అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 26-01-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

ముప్వన్నెల కాంతులు


గణతంత్ర దినోత్సవం సందర్భంగా చార్మినార్‌కు వెలుగులు

సంపుటి : 8 సంచిక : 341 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

సర్కారు బడుల్లో జోష్

కరోనా తర్వాత పేద,మధ్యతరగతి బతుకులు చెల్లాచెదురయ్యాయి. ఉపాధికి దూరమై..పనికోసం తంటాలు పడేస్థితికి చేరుకున్నాయి. తమ బిడ్డల భవిష్యత్తు గురించి ఆలోచించి...అప్పో సొప్పో చేసి ప్రయివేటు బడులకు పంపేవారు. కానీ ఇపుడు వారి చదువు కోసం పైసల్లేక ..ప్రభుత్వ బడులకు పంపక తప్పటంలేదు. ఇదే ప్రథమ్ సర్వేలో వెల్లడైంది.

కరోనా తర్వాత ప్రభుత్వ స్కూళ్లకు పిల్లలు

- దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇవే పరిస్థితులు
- 2022లో నమోదు 72.9 శాతానికి పెరుగుదల : నివేదిక



న్యూఢిల్లీ : భారత్‌లో కరోనా మహమ్మారి రాక తర్వాత విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా గ్రామీణ భారతంలో ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక్కడ అనేక మంది చిన్నారులు ప్రయివేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడులకు మారారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇవే పరిస్థితులు కనిపించాయి. 17వ దేశవ్యాప్త వార్షిక విద్యాస్థితి (ఏఎస్ఈఆర్) నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. దేశవ్యాప్తంగా 616 జిల్లాల్లోని దాదాపు ఏడు లక్షల మంది చిన్నారులను కవర్ చేస్తూ ఈ నివేదికను రూపొందించారు. ఈ సర్వేను ప్రథమ్ ఎన్జీవో నిర్వహించింది. ఈ నివేదిక సమాచారం ...9లో

జేఎన్‌యూలో రణరంగం

విద్యార్థులపై రాళ్లు..గాజు ముక్కలతో హిందూత్వ మూకల దాడి

- బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శన అడ్డుకునేందుకు రాత్రంగా కరెంట్ కట్..
- జామియా మిలియాలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు అరెస్టు



న్యూఢిల్లీ : గుజరాత్ 2002నాటి అల్లర్లపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ ప్రదర్శించకుండా మోడీ సర్కార్ అణచివేత చర్యలకు దిగుతోంది. వివిధ వర్సిటీల్లో ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనలను జీర్ణించుకోలేకపోతోంది. మంగళవారం రాత్రి ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో డాక్యుమెంటరీ చూస్తున్న వందలాది మంది విద్యార్థులపైకి రాళ్లు, గాజు ముక్కలతో దాడి జరిగింది. ఏబీవీపీ కార్యకర్తలు ఈదాడికి తెగబడ్డారని ఆరోపణలు వెలువడ్డాయి. బుధవారం ఢిల్లీ జామియా మిలియా వర్సిటీలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన డాక్యుమెంటరీ ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో డాక్యుమెంటరీ ప్రదర్శన చేపట్టగా, డాక్యుమెంటరీ ప్రసారమవుతుండగా...మధ్యలో పోలీసులు రంగంలోకి దిగి కార్యక్రమాన్ని నిలిపివేశారు

మంగళవారం రాత్రి డాక్యుమెంటరీ ప్రదర్శనకు జేఎన్‌యూ విద్యార్థి సంఘం పిలుపునివ్వగా, ఈ కార్యక్రమాన్ని రద్దు చేసుకోవాలని వర్సిటీ యాజమాన్యం, పోలీసులు బెదిరింపులకు దిగారు. ప్రదర్శన ముగిసిన తర్వాత రాత్రి 10.40 గంటల సమయంలో కమ్యూనిటీ సెంటర్ వద్ద గుమికూడిన విద్యార్థులపై రాళ్లదాడి జరిగింది. హాజరైనవారి పైకి పగిలిన అద్దాల్ని విసిరేశారని మీడియాలో వార్తా కథనాలు ప్రసారమయ్యాయి. వర్సిటీ యాజమాన్యం మంగళవారం రాత్రంతా విద్యుత్ సరఫరాను నిలిపివేసింది. ప్రధాన గేట్లతో సహా అనేక చోట్ల దారుల్ని పోలీసులు మూసేశారు. అయినప్పటికీ వర్సిటీలో క్యాంపస్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన డాక్యుమెంటరీ ప్రదర్శనకు వందలాది మంది విద్యార్థులు హాజరుకావటం విశేషం.

తమ మొబైల్ ఫోన్లలో, ల్యాప్‌ట్యాప్స్‌లో డాక్యుమెంటరీని విద్యార్థులంతా చూశారు. డాక్యుమెంటరీ ప్రదర్శనకు ముందు జేఎన్‌యూఎస్‌యూ అధ్యక్షురాలు ఆయిషీ ఘోష్ ప్రసంగించారు. "డాక్యుమెంటరీ ...9లో

పద్మపురస్కారాల ప్రకటన

- బి. రామకృష్ణారెడ్డి, చినజీయర్, కీరవాణి తో పాటు మరో 9 మందికి అవార్డులు



- మొత్తం 106 పురస్కారాలు.. 91 మందికి పద్మశ్రీ పురస్కారాలు
- ఆరు పద్మ విభూషణ్, 9 పద్మ భూషణ్ 25 పద్మశ్రీ అవార్డుల గ్రహీతల జాబితా విడుదల

వివరాలు 2లో..

పౌష్టికాహారంలో కామారెడ్డి వెనుకబాటు

అర్థగణాంకశాఖ నివేదికలో వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్య తెలంగాణ సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉన్న కార్యక్రమాలు, పథకాలను బలోపేతం చేస్తూ కొత్త పథకాలను ప్రవేశపెడుతున్నది. ఈ కార్యక్రమాలు, పథకాలు ఇస్తున్న ఫలితాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ వాటిని మెరుగుపరుస్తున్నది. ఈ నేపథ్యంలో గతేడాది జిల్లాల వారీగా ఆయా కార్యక్రమాల అమలు, పథకాల నుంచి లబ్దిపొందిన వారికి సంబంధించిన గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో 19,79,139 మంది పిల్లలుండగా అందులో 1,20,447 మంది (6.09 శాతం) పౌష్టికాహార ...9లో

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా

ఎమ్మెల్యే వేధిస్తున్నారంటూ కన్నీరు

- ఈనెల 23న చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా కౌన్సిలర్ల సంతకాలు



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి తన పదవికి రాజీనామా చేశారు. కౌన్సిలర్లను అడ్డుపెట్టుకుని తనను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వేధిస్తున్నారంటూ ...9లో

నారా లోకేశ్ యువగళం

పాదయాత్ర కోలాహలం

- జూబ్లీహిల్స్ నుంచి ఎన్టీఆర్ ఘాట్ వరకు బైక్ ర్యాలీ



నవతెలంగాణ - హైదరాబాద్

తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ "యువగళం" పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టనున్న 400 రోజులు, 4,000 కి.మీ.ల పాదయాత్రకు హైదరాబాద్ నుంచి బుధవారం బయలుదేరారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వద్ద, టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ వద్ద, ఎన్టీఆర్ ఘాట్ పరిసరాల్లో కోలాహలం నెలకొంది. కాగా నారా లోకేశ్ ఇంటి నుంచి ఎన్టీఆర్ ఘాట్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు టీటీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ నేతత్వంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీని నిర్వహించారు. తప్పెట్ల మోతలు, టపాసులు, జానపద కోలాటాలతో సందడిగా బైక్ ర్యాలీ చేశారు. లోకేశ్ తన నివాసం వద్ద హాజరైన నాయకులు, కార్యకర్తలతో కరచాలనం ...9లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

పద్మ పురస్కారాల ప్రకటన

న్యూఢిల్లీ : తెలంగాణకు చెందిన బి. రామకృష్ణారెడ్డి (80)కి పద్మశ్రీ అవార్డు వరించింది. సాహిత్యం, విద్య (భాషాశాస్త్రం) విభాగంలో ఆయనకు ఈ అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డులను ప్రకటించింది. పురస్కారాలకు ఎంపికైన వారి జాబితాను బుధవారం రాత్రి విడుదల చేసింది. ఆరు పద్మ విభూషణ్, 9 పద్మ భూషణ్, 25 పద్మశ్రీ అవార్డుల గ్రహీతల జాబితాను విడుదల చేసింది. పలు రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులను ఈ అత్యున్నత పురస్కారాలకు ఎంపిక చేసింది. ఈ అవార్డులకు గాను కేంద్ర ప్రభుత్వం గతేడాది మే 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు నామినేషన్లు స్వీకరించింది. కళలు, సాహిత్యం, విద్య, వైద్యం, క్రీడా, సామాజిక, విజ్ఞాన, ఇంజినీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్, వాణిజ్యం, పారిశ్రామిక, తదితర రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని గుర్తించి వారి పురస్కారాలు ప్రకటించింది. ఓఆర్ఎస్‌తో ముందుకు వచ్చిన దిలీప్ మహలనాబిస్‌కు మరణానంతరం మెడిసిన్ (పీడియాట్రిక్స్) విభాగంలో పద్మవిభూషణ్ ను ప్రకటించారు.

గిరిజన, దక్షిణాది భాషలకు అనేక సేవలందించిన తెలంగాణకు చెందిన బి. రామకృష్ణారెడ్డి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆయన లింగ్విస్టిక్స్ ప్రొఫెసర్. తన దశాబ్దాల పట్టుదలతో, అతను కువి, మందా, కుయ్ వంటి గిరిజన, దక్షిణాది భాషల పరిరక్షణకు అపారమైన కృషి చేశారు. గిరిజన భాషలను ఇతర భాషలతో కలుపుతూ సాంస్కృతిక వారధిని నిర్మించడం చేశారు. మాండా-ఇంగ్లీష్ డిక్షనరీ, కువి- ఒరియా- ఇంగ్లీష్ డిక్షనరీని రూపొందించారు. అదే సమయంలో ఈ ఉద్దేశంతో ఐదు పుస్తకాలను కూడా రచించారు. ఈ నేపథ్యంలో సాహిత్యం, విద్య (భాషాశాస్త్రం) విభాగంలో ఆయనకు పద్మశ్రీ అవార్డు వరించింది.

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన సామాజిక సేవకుడు సంకురాత్రి చంద్రశేఖర్ (79) పేద ప్రజలకు ఉచిత విద్య, వైద్య సేవలను అందించడానికి తన జీవితాన్ని అంకితం చేశాడు. ఎయిర్ ఇండియా కనిష్క బాంబు దాడిలో ఆయన భార్య, ఇద్దరు పిల్లలను కోల్పోయిన తరువాత, అతని దుఃఖాన్ని సమాజాభివృద్ధికి జీవితకాల నిబద్ధతగా మార్చారు. మూడు లక్షల మందికి పైగా కంటి రోగుల చికిత్సలో సేవలు, 90 శాతం శస్త్రచికిత్సలు ఉచితంగా అందించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన 3,500 మందికి పైగా పిల్లలకు ఉచిత విద్యను అందించారు.

రిపబ్లిక్ డేను నిర్వహించాలి

- పరేడ్‌ను కూడా ఏర్పాటు చేయాలి
- హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గణతంత్ర వేడుకల్ని ఘనంగా, అధికారికంగా, వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇదొక జాతీయ జెండా పండుగనీ, దేశభక్తిని చాటేదని స్పష్టం చేసింది. కరోనా కారణంగా బహిరంగంగా కాకుండా రాజ్‌భవన్‌లో నిర్వహిస్తున్నామన్న ప్రభుత్వ వాదనను తిరస్కరించింది. గతంలో మాదిరిగానే నిర్వహించాలని ఆదేశించింది. పరేడ్ కూడా నిర్వహించాలంది. అయితే, ఎక్కడ నిర్వహించాలనే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. రిపబ్లిక్ డే వేడుకలకు ప్రజలను కూడా అనుమతించాలని సూచించింది. వేడుకలకు ఒక్కరోజే సమయం ఉన్నందున కోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని ఏజీని ఆదేశించింది. కేంద్రం ఈ నెల 19న విడుదల చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్ఓపీ) గైడ్‌లైన్స్‌ను విధిగా అమలు చేయాలని సూచించింది. ఈ నెల 18న కేంద్రం ఇచ్చిన గైడ్‌లైన్స్ ఢిల్లీలో నిర్వహించే వేడుకలకు చెందినదని గుర్తు చేసింది. ఈ మేరకు జస్టిస్ మాధవీదేవి బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండేండ్ల మాదిరిగా (కరోనా సమయంలో) ఈసారి కూడా రాజ్‌భవన్‌లో రిపబ్లిక్‌డే నిర్వహించేందుకు వీలుగా ప్రభుత్వం ఈ నెల 19న ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కె.శ్రీనివాస్ వేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌ను భోజన విరామ సమయం తర్వాత న్యాయమూర్తి విచారించి ఉత్తర్వులు జారీ చేశారు.

రిపబ్లిక్ డే నిర్వహించేందుకు సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎలాంటి ఏర్పాట్లు చేయలేదనే విషయాన్ని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది సూర్యకిరణ్ రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ నెల 19న కేంద్రం (నెం22/2023) జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం రిపబ్లిక్‌డే నిర్వహించకపోవడం రాజ్యాంగ వ్యతిరేకంగా ప్రకటించాలని కోరారు. దేశంలో రిపబ్లిక్‌డే నిర్వహించకుండా ఏ రాష్ట్ర ప్రభుత్వమూ లేదన్నారు. దేశంలోనే తొలిసారి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ స్ఫూర్తిని పెంపొందింప చేయడమే రిపబ్లిక్‌డే లక్ష్యమనీ, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చడం అన్యాయమన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజున రిపబ్లిక్ డే ను నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం సమరయోధులు సాధించిన విజయాల్లో భాగమే రిపబ్లిక్ డే అని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పోలీసులకు, ప్రభుత్వ ఉద్యోగుల సేవల్ని గుర్తించి గవర్నర్ ద్వారా అవార్డులు ఇవ్వడం కూడా జరుగుతూ వచ్చిందన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో ఏటా జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు ఎంతోమంది కుటుంబాలతో హాజరవుతారని, ఇదొక వేడుకగా చేస్తారనీ, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఏవిధమైన ఏర్పాట్లు చేయకపోవడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు. రిపబ్లిక్‌డే అంటే హాలిడే కాదనీ, ఇంట్లో కూర్చునే రోజు కాదనీ, జాతీయతను చాటి చెప్పే రోజంటూ సూర్య ముత్తు వర్సెస్ కేరళ కేసులో రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పిందని గుర్తు చేశారు.

మన పూర్వీకులు దేశం కోసం పాటుపడిన తీరుతెన్నులు, ప్రజాస్వామ్య దేశంలో ప్రజల హక్కుల రక్షణకు రాసుకున్న గొప్ప రాజ్యాంగం గురించి నెమరవేసుకోవడం ద్వారా నేటి తరానికి ఆనాటి త్యాగాలను చాటి చెప్పడమే రిపబ్లిక్‌డే ఉద్దేశమని చెప్పారు. పెద్ద సంఖ్యలో స్కూల్ పిల్లలు హాజరయ్యేలా చేసి వారిలో జాతీయ స్ఫూర్తిని పెంపుదలకు కృషి జరిగేదన్నారు.

రిపబ్లిక్‌డేకు హాజరయ్యే వారికి మంచినీళ్లు, ఆహారం వంటికి కూడా ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని వివరించారు. ఈ ఏర్పాట్లన్నీ చేసేలా కూడా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన రిపబ్లిక్‌డే వేడుకల్ని రాజ్‌భవన్‌లో నిర్వహించుకోవాలంటూ గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేయడం దారుణమన్నారు. రాష్ట్ర తొలి పౌరురాలికి ఆ విధమైన సమాచారం ఇవ్వడం శోచనీయమన్నారు. ఈ మేరకు పత్రికల్లో వార్తలు చూసి పిటిషనర్ విస్తుపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెరేడ్‌గ్రౌండ్‌లో రిహార్సల్స్ జరిగేవనీ, ఈ ఏడాది మాత్రమే జరగలేదన్నారు. దేశ స్వాతంత్ర్య/గణతంత్ర వేడుకల్లో పిల్లలు పాల్గొనేలా చేయడం ద్వారా జాతీయత ఇనుమడింపజేయడమనే ప్రధాన ఆశయాన్ని నీరుగార్చేలా ప్రభుత్వ తీరు ఉందన్నారు. ప్రభుత్వ చర్య రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని కోరారు. తుది తీర్పు వెలువరించేలోగా గురువారం రిపబ్లిక్‌డే నిర్వహించేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. లక్షల మందితో సభలు నిర్వహించేప్పుడు కరోనా అడ్డురాలేదన్నారు. రిపబ్లిక్‌డే జరిపేందుకు మాత్రం కరోనాను సాకు చూపడం అన్యాయమన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ, కోవిడ్ కారణంగా ఏర్పాట్లు చేయలేదన్నారు. ఇప్పటికిప్పుడు ఏర్పాట్లు చేయాలని ఆదేశిస్తే అందుకు అనుగుణంగా చేసేందుకు సమయం సరిపోదన్నారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ నిర్వహించేందుకు వీలుగా ప్రభుత్వం తెలియజేసిందని వివరించారు. రాష్ట్రంలో కరోనా ప్రభావం ఉన్నందున ఈ నెల 13న రాజ్‌భవన్‌కు లేఖ రాశామని.. రాజ్‌భవన్‌లోనే వేడుకలను జరుపుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. వెబ్ కాస్టింగ్ విధానంలో జనం చూసేలా ఏర్పాట్లు కూడా చేశామన్నారు.

ఇల్లు వాకిలి లేదని పెద్దోనికి పిల్లనిస్తలేరాయే..

బస్వాపురం నిర్వాసిత రైతు ఆవేదన

- తెల్లారేసరికే గుండెపోటుతో మృతి
- అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమంటూ రైతుల రాస్తారోకో
- భువనగిరి మండలం బీఎన్‌తిమ్మాపురంలో ఘటన

'మన పెద్దోని పెండ్లి ఎప్పుడు చేద్దాం.. చిన్న కొడుకులిద్దరికీ పెండ్లి వయసు వచ్చింది. పెద్దోని పెండ్లి కాకపోతే పరువు పోతుంది. పైసలు రాకపోయే.. ఉన్న ఇల్లు నీళ్లల్లో మునిగిపోతుంది. కొత్త ఇల్లు ఎప్పుడు కట్టుకోవాలి. పిల్లగాడు నచ్చినా ఇల్లు లేదని పిల్లని ఇస్తలేరు. 50 రోజుల పైన దీక్షలు చేసినా.. 48 గంటలు కలెక్టరేట్ దగ్గర ధర్నా చేసినా నష్టపరిహారం రాకపోయే.. పిల్లలు ఆగమవుతున్నరు.. ఆటో నడిపితే ఇల్లు గడవదాయే.. మనలాగా.. ఊల్లో ఎంతమంది బాధ పడుతున్నారో.. ఉన్న ఇల్లును తీసుకుంటామని అధికారులు నోటీసులు ఇచ్చే..'' అంటూ భార్యతో మాట్లాడుతూ నెత్తీనోరూ కొట్టుకున్న బస్వాపురం రిజర్వాయర్ నిర్వాసిత రైతు తెల్లవారేసరికి గుండెపోటుతో ప్రాణం విడిచాడు.



నవతెలంగాణ - భువనగిరి

యాదాద్రిభువనగిరి జిల్లా బస్వాపురం రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న బీఎన్‌తిమ్మాపురం గ్రామ నిర్వాసితుడు బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. ప్రాజెక్టులో సర్వం కోల్పోతున్నా.. ప్రభుత్వం నష్టపరిహారం పూర్తి స్థాయిలో ఇవ్వకపోవడంతో నిర్వాసితులు నెలరోజులకుపైగా ఆందోళనలు చేసిన విషయం విదితమే. ఈ క్రమంలోనే కలెక్టరేట్ ఎదుట మహాధర్నా కూడా చేశారు. అయితే, నష్టపరిహారం రాకపోగా.. అధికారుల ఒత్తిడి భరించలేక మనోవేదనకు గురై రైతు గుండెపోటతో ప్రాణం కోల్పోయాడు. కుటుంబసభ్యులు, నిర్వాసితులు తెలిపిన వివరాల ప్రకారం..

భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన జూపల్లి నరసింహ(48)కు ఎకరం పొలం ఉంది. బస్వాపురం రిజర్వాయర్‌లో భూమిని కోల్పోతున్నాడు. అందులో అర ఎకరానికి నష్టపరిహారం డబ్బులు వచ్చాయి. మరో అర ఎకరం ప్రభుత్వ భూమి కావడంతో డబ్బులు ఇవ్వడం లేదు. పెళ్లీడుకొచ్చిన ముగ్గురిలో పెద్దవానికి పెండ్లి చేద్దామంటే ఇల్లు.. వాకిలి లేదని వచ్చిన సంబంధాలు తిరిగి వెళ్లిపోతున్నాయి. అరకొరగా వచ్చిన డబ్బులతో ఇల్లు కట్టుకుందామంటే నేటికీ స్థలం కేటాయించలేదు. ఈ క్రమంలోనే మంగళవారం ఇల్లు ఖాళీ చేయాలంటూ రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేశారు. దాంతో రాత్రి కుటుంబీకులతో మాట్లాడుతూ ఆందోళనకు గురయ్యాడు. బుధవారం ఉదయం నరసింహ గుండెపోటుతో మృతిచెందాడు. రైతుకు భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఈ విషయంపై రైతు భార్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహానికి పోలీసులు పంచనామా చేసి జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

మృతదేహంతో రాస్తారోకో

కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులంతా రైతు మృతదేహాన్ని తీసుకెళ్లి బస్వాపురం రిజర్వాయర్ క్యాంపు కార్యాలయం వద్ద పెట్టారు. అక్కడే ధర్నా నిర్వహించారు. అక్కడ ఎవరూ సరైన సమాధానం చెప్పకపోవడంతో మృతదేహంతో కలెక్టరేట్‌కు బయలుదేరగా.. మధ్యలో పోలీసులు అడ్డుకున్నారు. దాంతో భువనగిరి పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని మాస్కుంట గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడి వరంగల్ రహదారి వద్ద రాస్తారోకో చేశారు. సుమారు రెండుగంటల పాటు బైటాయించారు. రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పినా ఒప్పుకోలేదు. ఇరిగేషన్ అధికారులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు గ్రామస్తులు, సీపీఐ(ఎం), సీపీఐ నాయకులతో చర్చలు జరిపారు.

రైతు కుటుంబానికి రూ.2 లక్షలు అందిస్తామని తెలిపారు. నిర్వాసితులకు త్వరితగతిన ఇండ్ల స్థలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన గ్రామస్తులు రాస్తారోకో విరమించారు. అందులో భాగంగా లక్ష రూపాయలు నగదు వెంటనే ఇచ్చారు. మరో 10 రోజుల్లో మిగతా లక్ష రూపాయలు ఇస్తామని హామీనిచ్చారు. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండమడుగు నర్సింహ, సింగిల్ విండో మాజీ చైర్మెన్ ఎడ్ల సత్తిరెడ్డి, సర్పంచ్ పిన్నం లత, ఎంపీటీసీ ఉడుత రాధిక ఆంజనేయులు, ఉప సర్పంచ్ ఎడ్ల దర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రావుల అనురాధ నందు, మాజీ ఎంపీటీసీ జిన్న మల్లేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కోండపురం యాదగిరి, మండల కార్యదర్శి బోల్లేపల్లి కిషన్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు, రావుల రాజు, పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం కావాలి

బస్వాపురం ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపురం నిర్వాసితు లకు తాత్కాలిక ఉపశమనం కాకుండా శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలి. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. 250 గజా ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు, భూమి నష్టపరిహారం పూర్తి స్థాయిలో అందించాలి. నష్ట పరి హారం అందించే వరకు క్యాంపు కార్యాలయం ఎత్తేయాలి.

వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ

ఏసీడీ పేరుతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం తగదు

పోలీస్ లైసెన్సుల పేరుతో వేధింపులు సరికాదు

- సీఎం కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏసీడీ పేరుతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలను మోపటం, పోలీసు లైసెన్స్ పేరుతో వ్యాపారులను వేధించడం సరికాదని టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన బుధవారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. ఆయా నిర్ణయాలను తక్షణం ఉపసంహరించుకోవాలని కోరారు. కేసీఆర్ తొమ్మిదేండ్ల అసమర్థ పాలనలో, అప్పుల భారం, ఆర్థిక సంక్షోభం తప్ప తెలంగాణకు ఒరిగింది శూన్యమనీ, ఆయన కుటుంబ అవినీతి, కమిషన్ల కక్కుర్తితో ప్రభుత్వ సంస్థలు దివాళా తీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలన అసమర్థత ను, వ్యవస్థల పతనాన్ని కప్పి పుచ్చు కోవడానికి విద్యుత్ ఏసీడీ ఛార్జీల పేరుతో ప్రజల నెత్తిన అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు. గతంలో అభివృద్ధి ఛార్జీలు, ఎడ్యుకేషన్ సెస్సులు, గ్రీన్ సెస్సుల పేరుతో భారం మోపారని గుర్తుచేశారు. మళ్లీ రెండు నెలల విద్యుత్ బిల్లుల డిపాజిట్ పేరుతో పేదల జేబుకు చిల్లుపెట్టడానికి రంగం సిద్ధం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వైపు కరోనా, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసరాల పెరుగుదలకు తోడు ఉపాధి కరువై, ఉద్యోగాలు కోల్పోయి యువత రోడ్డున పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో విద్యుత్ డిపాజిట్ల పేరుతో ప్రభుత్వమే పేద, మధ్య తరగతి వారిపై దోపిడీకి తెగబడటం క్షమించరాని విషయమని పేర్కొన్నారు.

విద్యుత్ సంస్థలు నష్టాల్లోకి ఎందుకెళ్లాయి?

దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా విద్యుత్ రంగంలో తెలంగాణ ప్రగతి సాధించామన్నది నిజమైతే... విద్యుత్ సంస్థలు రూ.60 వేల కోట్ల నష్టాల్లోకి ఎందుకెళ్లాయి? అని రేవంత్‌ఈ సందర్భంగా సీఎంను ప్రశ్నించారు. విద్యుత్ సంస్థలకు ప్రభుత్వమే రూ.20 వేల కోట్ల మేర బాకాయి పడిందని తెలిపారు. చత్తీస్‌ఘడ్‌తో వెయ్యి మెగా వాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం లోపభూయిష్టంగా ఉండి ప్రజలపై భారాలకు కారణమవుతున్నదంటూ నిపుణులు హెచ్చరించినా పెడ చెవిన పెట్టారని విమర్శించారు. యాదాద్రి-భద్రాద్రి లాంటి ప్లాంట్ల నిర్మాణంలో వినియోగిస్తున్న కాలం చెల్లిన సాంకేతికతతోనూ భారం తప్ప ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. కమిషన్లు, కుంభకోణాల కోసమే ఈ ఒప్పందాలు, కాలం చెల్లిన నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం సొంతంగా నిర్మాణం ప్రారంభించి... పూర్తి చేసిన ఒక్క విద్యుత్ ప్రాజెక్టు కూడా లేదని తెలిపారు. కరోనాతో దెబ్బతిని, అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్న వీధి వ్యాపారులపై పోలీస్ లైసెన్సులను తప్పనిసరి చేస్తూ కనీసం రూ.1,000 నుంచి రూ.15 వేల వరకు ఫీజు చెల్లించాలంటూ హుకూం జారీ చేయడం తగదని పేర్కొన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గిరిజన విద్యార్థులకు మంత్రి సత్యవతి రాథోడ్ అభినందనలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని డీఎస్ఎంఎ భవన్‌లో గ్రూప్-1 మెయిన్స్‌కు సెలెక్ట్ అయిన 123 మంది ట్రైబల్ వెల్ఫేర్ స్టడీ సర్కిల్ విద్యార్థులను రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజేంద్రనగర్ స్టడీ సర్కిల్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ఎస్టీ స్టడీ సెంటర్లలో కోంచింగ్ తీసుకుని మెయిన్స్‌కు సెలెక్ట్ అయిన విద్యార్థులకు మాత్రమే ట్యాబ్‌లు, ప్రతినెల రూ.5 వేలు స్టైఫండ్‌ను ప్రభుత్వం అందచేస్తుందని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జీసీసీ జీఎమ్ సీతారాంనాయక్, జేడీ సబుజ్వల, స్టేట్ మిషన్ మేనేజర్ లక్ష్మీప్రసాద్, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఆత్మగౌరవ భవన నిర్మాణాలకు ముహూర్తం ఖరారు

- మంత్రి గంగుల కమలాకర్ వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీసీ కుల సంఘాల భవనాల నిర్మాణాలకు ముహూర్తాలు ఖరారు చేసినట్టు మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఫిబ్రవరి 5న కోకాపేట్‌లో, 6న ఉప్పల్ భగాయత్‌లో సామూహిక భూమిపూజలు నిర్వహించనున్నట్టు వివరించారు. 16 భవన నిర్మాణాలు ప్రభుత్వ ఆధ్వర్యంలో, 18 బీసీ ఏక సంఘాల సారథ్యంలో నిర్మాణాలు చేపడుతున్నామని బుధవారం 32 బీసీ కుల సంఘాల నేతలతో జరిగిన సమీక్షా సమావేశంలో తెలిపారు. 41 బీసీ ఆత్మగౌరవ భవనాల కోసం ప్రభుత్వం 87.3 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. మార్చి 31వ తేదీ లోగా ఆయా భవనాల శ్లాబుల నిర్మాణం పూర్తి కావాలనీ, లేనిపక్షంలో ప్రభుత్వమే వాటిని తీసుకొని నిర్మిస్తుందని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన కోసం అడ్‌హాక్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే సంఘాలు నిర్మించుకునే ఆత్మగౌరవ భవనాలకు లైజనింగ్ ఆఫీసర్లను నియమించి సహకారాన్ని అందిస్తామన్నారు. సమావేశ మందిరాలు, కళ్యాణ వేదికలు, హాస్టళ్లు, రిక్రియేషన్ తదితర సకల సదుపాయాలతో నిర్మాణాలు చేపడుతున్నామనీ, దసరా లోపు ఆత్మగౌరవ భవనాలు ప్రారంభమవ్వాలని చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మెల్సీ బండాప్రకాశ్, రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ఎస్ తిరుపతిరావు, మేడ్చల్ అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ ఎత్తున ఐపీఎస్‌ల బదిలీలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో భారీ ఎత్తున ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒకేసారి 60 మంది వరకు ఐపీఎస్ అధికారులను బదిలీ చేయటం ఇదే మొదటి సారి. బదిలీ అయినవారిలో ఎస్పీ స్థాయి నుంచి ఐజీ స్థాయి అధికారుల వరకు ఉన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించాలి

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలి
- మూసీని ప్రక్షాళన చేయాలి
- ప్రజాసమస్యలపై బీఆర్ఎస్‌తో రాజీపడబోం..: సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-సూర్యాపేట

ఫిబ్రవరి ఒకటి నుంచి కేంద్ర బడ్జెట్, ఫిబ్రవరి 3 నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతా క్రమంలో బడ్జెట్ కేటాయింపులు చేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతాలకు బడ్జెట్‌లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సంక్షేమ రంగానికి నిధులు పెంచాలని కోరారు. బడ్జెట్‌లో కేటాయింపులు పెరుగుతున్నాయి తప్ప ఖర్చు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌లోనైనా గతేడాది ఖర్చు చేయని నిధులను కలిపి కొత్తగా కేటాయించాలని కోరారు. బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి పూర్తి చేయాలని, ఈ ప్రాజెక్టుకు జాతీయహోదా కల్పించాలని డిమాండ్ చేశారు. మూసీని ప్రక్షాళన చేసి వెంటనే ఆధునీకరణ చేయాలన్నారు. మిర్యాలగూడెం నుంచి సూర్యాపేట మీదుగా ఖాజీపేట వరకు రైలుమార్గం ఏర్పాటు చేయాలని అనేక ఏండ్లుగా ఉద్యమాలు నిర్వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రతిపాదనలు చేస్తున్నారు తప్ప సూర్యాపేటకు రైలుమార్గం ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి రైలు మార్గం ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీని ఓడించడమే సీపీఐ(ఎం) రాజకీయ కర్తవ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని చెప్పారు. బీఆర్ఎస్‌తో కలిసి పని చేసినంత మాత్రాన ప్రజాసమస్యలపై పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలయ్యే వరకు ఉద్యమిస్తూనే ఉంటామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, యాదాద్రిభువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, నాయకులు మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మీ, కోటగోపి, మేక అశోక్‌రెడ్డి, ఎల్గూరి గోవింద్, జె.నర్సింహారావు, మేకనబోయిన శేఖర్, మద్దెల జ్యోతి, మేకనబోయినసైదమ్మ చిన్నపంగ నర్సయ్య పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఉద్యోగుల రూ.33.78 లక్షల విరాళం



హైదరాబాద్ : ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ సర్కిల్ ఉద్యోగులు రూ.33,78,200 నిధులను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తం విలువ చేసే చెక్కును బుధవారం ఆ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ అమిత్ జింగ్రాన్ బృందం గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్‌కు అందజేశారు. బ్యాంక్ సిబ్బంది చొరవను గవర్నర్ ప్రశంసించారు. ఈ సంస్థకు ఇచ్చిన నిధులను సైన్యంలో పని చేసిన మాజీ సైనికులు, భర్తలను కోల్పోయిన వారి సంక్షేమానికి ఉపయోగిస్తారు.

యూబీఐడీఈఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సురేష్ చంద్ర



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (యూబీఐడీఈఎఫ్) క్యాలెండర్‌ను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ సురేష్ చంద్ర తెల్లి, హెచ్ఆర్ విభాగం చీఫ్ మేనేజనర్ ఎ విజయ్‌కుమార్ బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ చంద్ర తెల్లి మాట్లాడుతూ వైకల్యం శరీరానికే కానీ మానసిక సామర్థ్యానికి కాదని చెప్పారు. కదల్లేని స్థితిలో వీల్ చైర్‌లో కూర్చుని కేవలం అంతరిక్షంలోని బ్లాక్ హోల్స్‌పై పరిశోధన చేసి రహస్యాలు ఛేదించిన స్టీఫెన్ హాకింగ్ అందరికీ ఆదర్శమని అన్నారు. లూయిస్ బ్రెయిలీ కనిపెట్టిన ఆరు చుక్కల లిపి ఇప్పటికీ అనేక దేశాలు, భాషలు అంధుల కోసం వాడుతున్నాయని వివరించారు. ఇలాంటి మేధావులు ఈ ప్రపంచానికి ఆదర్శమనీ, భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశకులని అభిప్రాయపడ్డారు. దృష్టి లోపం ఉన్న వారందరి అవసరాలను పరిగణనలోకి తీసుకుని వారి కోసం ప్రత్యేకంగా స్పర్శ్ బ్రెయిలీ డెబిట్ కార్డును రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో యూబీఐడీఈఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పి రాజశేఖర్, నాయకులు ఆర్ స్వామినాయక్, పి కృష్ణయ్య, దివ్యశ్రీ, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ పరిశ్రమల కనీసవేతన జీవోలు సవరించాలి

- విడుదల చేసిన ఐదు జీవోలను గెజిట్ చేయాలి : సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని 73 షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాల జీవోలను సవరించాలనీ, గతేడాది విడుదల చేసిన ఐదు రంగాల కనీస వేతనాల జీవోలను గెజిట్ చేసి అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పారిశ్రామిక కార్మికుల రాష్ట్రస్థాయి వర్క్‌షాపును సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కరాములు మాట్లాడుతూ..1948 కనీస వేతనాల చట్టం ప్రకారం ఐదేండ్లకోసారి వేతనాలు పెంచాలన్నారు. కానీ, రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిదున్నరేండ్ల కాలంలో ఒక్కసారి కూడా పెంచలేదని విమర్శించారు. దీంతో కార్మికులు వేల కోట్ల రూపాయలను వేతనాల రూపంలో నష్టపోతున్న తీరును వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు సవరించాలనీ, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక కార్మికుల సమస్యలపై అధ్యయనం కోసం ఫిబ్రవరి నెలంతా కార్మికులు సర్వేలు చేయాలనీ, వాటి పరిష్కారం కోసం ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి, కార్మిక శాఖ అధికారులకు వినతి పత్రాలు కూడా అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో క్లస్టర్ కమిటీ కన్వీనర్ భూపాల్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, పి.జయలక్ష్మి, టి.వీరారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, బి. మధు, పి. శ్రీకాంత్, కె. రమేష్, బి. మల్లేశం, కె. గోపాలస్వామి, కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర నాయకులు చంద్రమోహన్, విష్ణు, జగదీష్, సాయిలు, ఆంజనేయులు, శ్రీను, నరసింహ, బ్రహ్మాచారి, మీనా, కవిత, రాజు, అజయ్‌బాబు పాల్గొన్నారు.

అడవుల రక్షణ, అగ్నిప్రమాదాల నివారణకే ప్రాధాన్యత

- వచ్చే హరితహారంలో స్థానిక జాతుల మొక్కలు నాటుతాం
- అర్బన్ పార్కుల నిర్వహణ, ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి
- పీసీసీఎఫ్ ఆర్ఎం. డోబ్రియాల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అడవుల రక్షణ, వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ తెలిపారు. వేగంగా పెరిగే స్థానిక జాతుల మొక్కలను రాబోయే హరితహారంలో నాటేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్బన్ పార్కుల నిర్వహణ, ఎకో టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నొక్కిచెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో చీఫ్ కన్జర్వేటర్లు, జిల్లా, డివిజనల్ ఫారెస్టు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వేసవిలో అగ్ని ప్రమాదాల రూపంలో అడవులకు ముప్పు పొంచి ఉంటుందనీ, వాటి నివారణ కోసం బీట్ల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయా ప్రమాదాలపై అటవీ సమీప గ్రామాల ప్రజల్లో, అడవుల గుండా వెళ్లే ప్రయాణికుల్లో అవగాహన పెంచాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా వీలైనంత వరకు నివారించాలన్నారు. వేసవిలో వన్యప్రాణుల తాగునీటి కోసం ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. రానున్న వర్షాకాలంతో ప్రారంభించే హరితహారం సీజన్‌కు నర్సరీలను సిద్ధం చేయాలన్నారు. అర్బన్‌పార్కుల్లో ఔషధ మొక్కలు, హెర్బల్ గార్డెన్ల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇండ్లలో పెంచుకునేందుకు వీలుగా పంపిణీకి కూడా మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. హరితవనాల్లో వందశాతం పచ్చదనం పెంపుపై సమీక్షించారు. అడవుల్లో నీటి నిల్వల సామర్థ్యం, నేలల్లో తేమ పరిరక్షణ చర్యలు తీసుకోవటం వల్ల వాటి సహజ పునరుద్ధరణ వేగాన్ని పెంచొచ్చని సూచించారు. సమావేశంలో కంపా నిధులు, పనులు, పురోగతి, అటవీ అనుమతుల ప్రక్రియ వేగవంతం, గిరిజన గూడేలలో మౌలిక సదుపాయాల కల్పన, అటవీ నేరాల కేసుల సత్వర పరిష్కారం, తదితర విషయాలపై చర్చించారు. సమావేశంలో పీసీసీఎఫ్ (కంపా) లోకేశ్ జైస్వాల్, పీసీసీఎఫ్ (ఎఫ్‌సీఏ) ఎం.సీ.పర్గెయిన్, పీసీసీఎఫ్ (విజిలెన్స్) ఏలూసింగ్ మేరు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసిన..

500 మంది నిరుపేదలు



ప్రభుత్వ భూములు పేదలకు పంచాల్సిందే.. : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-భూపాలపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామంటూ అనేక వాగ్దానాలు ఇచ్చిందని, అయినప్పటికీ నేటి వరకు వాటిని అమలుచేయకపోవడంతో విసిగివేసారిన పేదలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో ఎర్రజెండాలు పాతి గుడిసెలు వేసుకున్నారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలో చాలీచాలని వేతనాలతో అద్దె భవనాల్లో నివసిస్తున్న 500 మందికి పైగా నిరుపేదలు.. సర్వే నెంబర్-283, 284, 285లో బుధవారం గుడిసెలు వేసి ఇంటి స్థలాల పోరాటం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, సింగరేణి అధికారులు.. అక్కడికి చేరుకొని నిలువరించే ప్రయత్నం చేయగా.. అక్కడే భీష్మించుకు కూర్చుని.. ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంచాల్సిందేనని పట్టుబట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో నిరుపేద కుటుంబాలు అద్దె భవనాలలో తీవ్ర ఇబ్బందులతో జీవనం కొనసాగిస్తున్న నిరుపేద కుటుంబాలు.. ఇంటి స్థలాల పోరాటం ప్రారంభించారని తెలిపారు. ఎనిమిదేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పలు హామీలు ఇచ్చి అమలు చేయడంలో విఫలమైందన్నారు.

తమ పార్టీ ఆధ్వర్యంలో పలుమార్లు ఎమ్మెల్యేలు, కలెక్టర్లకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. దాంతో చేసేదేమీ లేక నిరుపేదలతో భూ పోరాటం ప్రారంభించినట్టు తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇంటి స్థలాల పోరాట బాధ్యులకు ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లతో సహా ఇంటి స్థలాలు ఇచ్చి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు కంపేటి రాజన్న, చెన్నూరి రమేష్, పొలం రాజేందర్, దామెర కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మోడీ విధానాలు మార్చుకో.. లేకుంటే గద్దె దించుతాం

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్

- చాప కింద నీరులా రైతు వ్యతిరేక విధానాలు
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ
- మోడీ పాలనలో అన్నదాతల ఆకలి చావులు
- ప్రముఖ సినీ డాన్సర్ రాకేష్ మాస్టర్
- సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో ట్రాక్టర్ల ర్యాలీ



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు మార్చుకోకుంటే మోడీని గద్దె దించుతామని తెలంగాణ రైతు సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి.సాగర్, పశ్య పద్మ హెచ్చరించారు. మోడీ పాలనలో అన్నదాతలకు ఆకలి చావులు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి బొంగ్లూర్ మీదుగా ఇబ్రహీంపట్నం అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టి.సాగర్ మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయడంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పంట ఉత్పత్తికి 50 శాతం అదనపు మద్దతు ధర అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. కేరళ ప్రభుత్వం మాదిరిగా రుణ విముక్తి చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతు సంఘాలతో చర్చించకుండా విద్యుత్తు సవరణ బిల్లును పార్లమెంటులో ఆమోదానికి పెట్టడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. 500 రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాల ఫలితంగా విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకున్నప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా అమలు చేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. గృహ వినియోగదారులకు సైతం నెలకు రూ.800 మినిమం బిల్లు చెల్లించే పరిస్థితి తీసుకురానున్నదన్నారు. కౌలు రైతులకు, రైతాంగానికి నెలకు రూ.5000 పింఛన్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడా పారిశ్రామిక నేతలకు చెందిన రూ.11 లక్షల కోట్ల రుణాలు మోడీ ప్రభుత్వం ఎలా మాఫీ చేసిందని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లు, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. మరో స్వతంత్ర పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పశ్య పద్మ మాట్లాడుతూ.. 500 సంఘాలతో సంయుక్త కిసాన్ మోర్చా ఏర్పడిందని తెలిపారు. తమ పోరాటాలతోనే మోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసిందని గుర్తు చేశారు. కానీ గడిచిన 11 నెలలుగా మోడీ ఇచ్చిన హామీని సైతం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖ సినీ డాన్సర్ రాకేష్ మాస్టర్ మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెడుతున్న రైతాంగం అన్నమో రామచంద్ర అని చస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు.

కార్మికులు, రైతుల పట్ల అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతుల ఆత్మఘోష మోడీకి వినిపించే విధంగా బలమైన ఉద్యమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచందర్, మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు జంగయ్య, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

14 ఏండ్లు గాడిద చాకిరీ చేసినాం

- ఆత్మగౌరవం అడిగితే సస్పెండ్ చేస్తారా..
- న్యాయం కోసం లడాయికైనా సిద్ధం
- ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో చకిలం అనిల్‌కుమార్



నవతెలంగాణ-నల్లగొండ

"తెలంగాణ ఉద్యమంలో లాఠీ దెబ్బలు తిని, కేసులు, జైలు పాలై, ఆస్తులు అమ్మి పార్టీని.. ఉద్యమాన్ని నడిపించిన ఉద్యమకారులకు నేడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆత్మగౌరవం కూడా దగ్గడం లేదు.. ఉద్యమకారులపై కేసులు పెట్టించిన వారికి మాత్రం పదవులు దక్కాయి" అని బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి చకిలం అనిల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నల్లగొండలోని సర్దార్ చకిలం శ్రీనివాసరావు పంతులు నివాసంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సదస్సులో ఆయన మాట్లాడారు.

2001 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం కోసం ఆస్తులు అమ్ముకొని పనిచేస్తే.. అధికారంలోకి వచ్చాక సీఎం కేసీఆర్ తన వంటి వారిని గుర్తించకపోవడం అన్యాయమన్నారు. ఉద్యమ కాలంలో తాను పార్టీ కోసం అమ్ముకున్న ఆస్తుల విలువ నేడు రూ.100 కోట్ల వరకు ఉంటుందని, ఆస్తులు పోయినా బాధ లేదు కానీ ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసేలా పార్టీ నాయకత్వం వ్యవహరించడం బాధగా ఉందన్నారు. 2018 ఎన్నికల్లో నల్లగొండ టికెట్ కంచర్ల భూపాల్ రెడ్డికి కేటాయించడాన్ని తాను ప్రశ్నించానన్నారు. తనను ప్రగతిభవన్‌కి పిలిచిన సీఎం కేసీఆర్ టికెట్ విషయంలో అన్యాయం జరిగిందని, అయితే భూపాల్ రెడ్డిని గెలిపిస్తే ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పి మాట తప్పారని విమర్శించారు. ఉద్యమకారులకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నిస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామంటున్నారని, తనను నమ్ముకున్న ఉద్యమకారులకు, పేదలకు న్యాయం చేసేందుకు దేనికైనా సిద్ధమని చెప్పారు ఆత్మ గౌరవం కోసం తమ లడాయి కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికీ సీఎం కేసీఆర్ నాయకత్వానికి విధేయులుగానే ఉన్నామని, ఇకనైనా తమకు న్యాయం చేయకపోతే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ పోరాటాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఉద్యమకారుడైన చకిలం అనిల్ కుమార్‌కు కేసీఆర్ ఇస్తానన్న మాట మేరకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని, లేదంటే వచ్చే ఎన్నికల్లో నల్లగొండ టికెట్‌ను అనీల్‌కే ప్రకటించాలని సదస్సులో పాల్గొన్న వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు పంకజ్ యాదవ్, పిచ్చయ్య, జమాల్ ఖాద్రి, తలమల్ల యాదగిరి, ఎన్జీవోస్ నాయకులు రమేష్, వెంకట నరసయ్య, వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

30తో ముగియనున్న భారత్ జోడో యాత్ర

- 26 నుంచి ఆరు లక్షల గ్రామాల్లో రాహుల్ సందేశం : పవన్ ఖేరా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఈ నెల 30తో ముగుస్తుందని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేరా తెలిపారు. ఈ నేపథ్యంలో ఆరు లక్షల గ్రామాల్లో యాత్రలు నిర్వహించటం ద్వారా పార్టీ శ్రేణులు రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రజలకు చేరవేస్తాయని వెల్లడించారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ హయాంలో నిత్యావసరాల ధరలు పెరిగాయనీ, చిన్న మధ్య తరహా వ్యాపారులు రోడ్డున పడ్డారని విమర్శించారు. బీజేపీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాల కారణంగా 100 మంది బడా పారిశ్రామికవేత్తల వద్ద రూ.13 లక్షల కోట్ల సంపద పోగుపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టటం ద్వారా ఆ పార్టీ తన పబ్బం గడుపుకుంటున్నదన్నారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్ గా మార్చారనీ, వాస్తవంగా అది వీఆర్ఎస్ (వాలంటరీ రిటైర్మెంట్ సర్వీస్) అని ఎద్దేవా చేశారు.

119 స్థానాల్లో పోటీ

- బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 ఎమ్మెల్యే స్థానాల్లో ఎంసీపీఐ(యూ),బీఎల్పీ, టీసీపీ, ఎంబీటీలతో కలిసి పోటీ చేస్తామని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో బీఎల్ఎఫ్ ఐదో ఆవిర్భావ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న వామపక్ష పార్టీలు ఒకే శక్తిగా బీఎల్ఎఫ్‌లో భాగస్వాములై రాజ్యాధికారం సాధించాలని కోరారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను ఎదుర్కొనే శక్తి, సిద్ధాంతం కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు లేవని చెప్పారు. సిద్ధాంతం ఉన్న కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు మాత్రమే ఎదుర్కొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బీఎల్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, టీసీపీ రాష్ట్ర కార్యదర్శి కె పర్వతాలు, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, ఎస్ సిద్ధిరాములు, హంసారెడ్డి, కన్నం వెంకన్న, పెద్దారపు రమేష్, బీసీ కులాల ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎంఎం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ నియామకాల్లో తప్పిదాలకు యువత బలి

- గవర్నర్ కు యూత్ కాంగ్రెస్ ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పోలీస్ నియామకాల్లో ప్రభుత్వం చేసిన తప్పిదాలకు యువత బలయ్యారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్‌కు ఆయన నేతృత్వంలో యువజన కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విషయాన్ని అనేక సార్లు పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు చైర్మెన్ వి.వి.శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లామనీ, ఏడు మార్కులు కలపాలంటూ హైకోర్టు సూచించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికే 18 మంది విద్యార్థులు చనిపోయారనీ, రన్నింగ్‌లో క్వాలిఫై అయిన వారికి మెయిన్స్ లో అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ స్పందించకుంటే అసెంబ్లీకి ఎలా వస్తారో చూస్తామని హెచ్చరించారు.

అర్ధరాత్రి గ్యాస్ సిలిండర్ పేలి.. ఇద్దరు సజీవ దహనం

నవతెలంగాణ- చేగుంట

మెదక్ జిల్లా చేగుంట మండలం చిన్నశివనూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు గ్యాస్‌సిలిండర్ పేలి ఇద్దరు సజీవ దహనమయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీలోని పిట్టల అంజమ్మ(59)కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. బతుకు దెరువు కోసం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు గ్రామానికి వెళ్లింది. చిన్న కుమారుడు రాజేష్ ఖన్నా, భార్య లక్ష్మీ అలియాస్ కవిత చిన్న కుమార్తె మధుమతి(9)ను వెంట పెట్టుకొని రేషన్ బియ్యం, వృద్ధాప్య పింఛన్ కోసం గ్రామానికి మంగళవారం వచ్చారు. రాత్రి భోజనం చేసి కొవ్వొత్తి వెలిగించుకొని పడుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు గ్యాస్ లీకై సిలిండర్ పేలడంతో మంటలు చెలరేగాయి. ఆ మంటల్లో అంజమ్మ, మధుమతి సజీవ దహనమయ్యారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ప్రకాష్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని ఫైర్‌ఇంజన్ సహాయంతో మంటలు ఆర్పారు. రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, ఆర్ఐ యాదగిరి, పంచాయతీ సెక్రెటరీ ఎల్లం మృతదేహాలకు పంచనామా నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

దేవుడి పగేనా?!

దేవుడు పగపడతాడా? అసలు తన సృష్టిపై తానే పగపట్టగలడా? మరి జోషీమఠ్ కుంగిపోవడం భగవత్ సంకల్పమేనని చెప్పిన ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రిని ఏ కోవలో జమెయ్యాలి? సృష్టి, స్థితి, లయ కారకులని త్రిమూర్తులకు "వర్క్ డివిజన్" ఉంది. స్థితి, లయ కారకులైన విష్ణువుకు, శివుడికి అత్యంత ప్రఖ్యాత ఆలయాలున్న బదిరీనాథ్, కేదార్‌నాథ్

> ప్రకృతి విధ్వంసాన్ని పెట్టుబడి లాభాల కోసం అనుమతించే పాలకులున్నంత కాలం దేవాలయాలు మూసెయ్యాల్సిందే! (2013లో కేదర్‌నాథ్ లాగా) భక్తుల ప్రాణాలకూ రక్షణ ఉండదు. చార్‌ధామ్ పేరుమీద మోడీ సర్కార్‌కు ఓట్లు రావచ్చేమోగాని, పర్యావరణం సర్వనాశనం అవుతుంది. గ్లాస్‌గో (కాప్-26)లో ప్రగల్భాలు మర్చిపోవద్దు మోడీ ప్రభుత్వమా!

ఆలయాలను, వాటిని దర్శించేందుకు వచ్చే భక్తకోటినీ ఆ దేవుళ్ళిద్దరూ కల్సి 'లయి'స్తారా? మానవ తప్పిదాలను, 'పాపాల'ను పాపం! ఆనోరులేని దేవుళ్ళపై నెట్టేయడం అన్యాయం కదా!

ఆంగ్లంలో "హిమాలయన్ బ్లండర్" అనే నానుడి ఉంది. ప్రస్తుతం హిమాలయ పర్వతాల్లో హిమాలయన్ బ్లండర్ జరుగుతోంది. ఇది ఉత్తరాఖండ్‌లోనే కాదు, అటు హిమాచల్ నుండి సిక్కిం వరకు జరుగుతోంది. ప్రస్తుతం ఆర్టికల్ 370 రద్దు పుణ్యమా అని రేపు కాశ్మీర్‌లోనూ జరుగుతుంది. ఎన్ఆర్ఎస్ఎతో సహా 12 శాస్త్రవేత్తల సంఘాలు జోషీమఠ్ ఉన్న ప్రాంతం 99శాతం భూపాతం (ల్యాండ్ స్లైడ్) ఉండే ప్రాంతమేనని ఏనాడో చెప్పాయి. కాని ఇటీవల ఢిల్లీలో జరిగిన శాస్త్రవేత్తల మీటింగులో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి జోషీమఠ్ వ్యవహారమంతా "భగవంతుడి లీలే"నని బల్లగుద్ది మరీ వాదించిన సంఘటన మనల్ని అవాక్కయ్యేలా చేస్తుంది. జోషీమఠ్ అంటే మన శంకరమఠం లాంటి భవనం కాదు. 27వేల మంది ప్రజలు నివశించే ఒక పట్టణం. హిందువులు అత్యంత పవిత్రంగా భావించే బదిరీనాథ్, హేమకుండ్ సాహిబ్ వంటి పుణ్యక్షేత్రాలకు ముఖద్వారం. ప్రపంచ ప్రఖ్యాత మంచు ఆటల కేంద్రం అవులి ఉన్నదక్కడే. ప్రపంచంలోనే అత్యంత పొడవైన 'రోప్‌వే' ఈ పట్టణంపై నుండే పోతుంది. "ఇది ఒక పట్టణమే కాదు సాంస్కృతిక వారసత్వం" అని ఆ ప్రాంతాన్ని పరిశీలించిన సీపీఐ(ఎం), సిఐటియు బృందం చెప్పింది అక్షర సత్యం. మానవ తప్పిదం వల్లా, ఆశ్రిత పెట్టుబడిదార్ల లాభాపేక్ష వల్లా నేడీ పట్టణం కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికే సగం పట్టణం నివాసయోగ్యం కాకుండా పోయింది. సునీతా నారాయణ్ రాసినట్లు "అదొక మానవ విషాదం.మనిషి స్వయం కృతం."



1976లోనే ఘర్వాల్ కమిషనర్ ఎమ్.సి.మిశ్రా కమిషన్ "ఇదొక మునిగిపోయే పట్టణమని, ఇక్కడ ఏ నిర్మాణాలు చేపట్టవద్దని" నివేదిక ఇచ్చింది. ఏ ప్రభుత్వమూ దాన్ని ఖాతరు చేయలేదు. ప్రత్యేకంగా 2014 తర్వాత భారీ హెూటళ్ల నిర్మాణం సాగిపోతోంది. స్థానికులు అడ్డుపడుతున్నా తపోవన్ - విష్ణుగాడ్ 520 మె.వా. హైడల్ స్టేషన్ నిర్మాణం సాగుతోంది. ఎన్‌టిపిసి వారి ఈ ప్రాజెక్టు జోషీమఠ్ క్రిందికే తవ్వేశారు. నాలుగు పుణ్యక్షేత్రాలను కలిపే 'చార్‌ధామ్' ప్రాజెక్టును 'ఉభయ తారకం'గా ఉండేలా 2016లో మోడీ సర్కార్ ప్రారంభించింది. రూ.12వేల కోట్ల ఈ ప్రాజెక్టుని చిన్న చిన్న ముక్కలుగా చేసి పర్యావరణ అనుమతులు గోల తప్పించేసింది. ఎక్కడికక్కడ 'అస్మదీయుల' హెూటళ్ళు వెలుస్తున్నాయి. నాలుగు లైన్ల రోడ్ నిరాఘాటంగా నిర్మాణం సాగిపోతోంది. అదీ జోషీమఠ్ అంచునే పెద్ద పెద్ద బ్లాస్టింగులు జరగడంతో ఆ పట్టణానికి ప్రమాదం ముంచుకొచ్చింది.

బహుశా ఉత్తరాఖండ్ పెట్టుబడి లాభాపేక్షకి, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి బ్రహ్మాండమైన ఉదాహరణ. వంద డ్యామ్‌లు, 450 జలవిద్యుత్ ప్రాజెక్టులకు ప్లాన్ చేసినట్టు ఒక నివేదిక తెల్పుతోంది. ఈ నిర్మాణంలో వచ్చేరాళ్ళు, రప్పల్ని, అన్ని రూల్స్‌కి భిన్నంగా నదుల్లోనే వేయడంతో, దాన్ని పాలకులు పట్టించుకోకపోవడంతో ఉపద్రవాలు ముంచుకొస్తున్నాయి. భూపాతం వల్ల 1894లో భీకర వరదలు రాగా, ఇష్టాను సారం అడవుల నరికివేత వల్ల 1970లో వరదలొచ్చాయి. 2013లో కేదర్‌నాథ్ పెను ముప్పు, 2021లో తపోవన్ - రైనీ ప్రమాదంలో 200 మంది కార్మికులు జలసమాధి అయినా బుద్ధిరాని పాలకులు పెట్టుబడి లాభాపేక్ష కోసం ఈ ప్రాజెక్టులకు తెరతీశారు. పెద్ద ఎత్తున జల విద్యుదుత్పత్తి జరిగే ఉత్తరాఖాండ్ వాసులు సైతం మనలాగే అధిక విద్యుత్ చార్జీలు చెల్లించాల్సి రావడం విరోధా భాసకు పరాకాష్ట!

ఇంత జరుగుతున్నా మీడియా ముందు నోరిప్పరాదని మొన్ననే శాస్త్రవేత్తలను, ఇస్రో వంటి సంస్థలను శాసించింది మోడీ సర్కార్. 2020, 21లో కరోనా కాలంలోనూ ఈ విధంగా శాస్త్రవేత్తల నోరు నొక్కేసరికి పుక్కటి పురాణాలు యధేచ్ఛగా ప్రచారమైనాయి. స్థానికులు పోరాడుతూనే ఉన్నారు. అవి దేశానికి తెలియ చేయాల్సిన మీడియా కార్పొరేట్ల చేతిలో, పైగా అంబానీ, అదానీ చేతిలో బందీగా ఉంది.

సుప్రీం కోర్టు దీన్ని పరిగణనలోకి తీసుకుని ఒక కమిటీని నియమించింది. ఈ ప్రాజెక్టులు, నిర్మాణాలు తక్షణం ఆపాలంది. ఆ తర్వాత మరో కమిటీని నియమించింది. అది మొదటి కమిటీనే బలపరిచింది. ఆ తర్వాత మరో కమిటీ వేశారు. సదరు కమిటీ పైనివేదికల్ని తిరగేసింది. ప్రకృతి విధ్వంసాన్ని పెట్టుబడి లాభాల కోసం అనుమతించే పాలకులున్నంత కాలం దేవాలయాలు మూసెయ్యాల్సిందే! (2013లో కేదర్‌నాథ్ లాగా) భక్తుల ప్రాణాలకూ రక్షణ ఉండదు. చార్‌ధామ్ పేరుమీద మోడీ సర్కార్‌కు ఓట్లు రావచ్చేమోగాని, పర్యావరణం సర్వనాశనం అవుతుంది. గ్లాస్‌గో (కాప్-26)లో ప్రగల్భాలు మర్చిపోవద్దు మోడీ ప్రభుత్వమా!

రవాణా కార్మికుల సంఘర్ష యాత్ర - అనుభవాలు



ఎస్. వీరయ్య


రాష్ట్రంలో రవాణా కార్మికుల సంఘర్ష యాత్రకు అనూహ్యమైన స్పందన వచ్చింది. విలువైన అనుభవాలు ఇచ్చింది. సమస్యలతో సతమతమవుతున్న రవాణా కార్మికులలో విశ్వాసం నింపింది. సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలన్న స్ఫూర్తి నింపింది. కార్మికుల సమస్యలు తెలుసుకోవటం, వారిని సంఘటితం చేయటం, పోరాట చైతన్యం నింపటం ఈ యాత్ర లక్ష్యం.

'ఇల్లు చూసి నన్ను చూడు' అన్నట్టున్నది రవాణా కార్మికుల బతుకు చిత్రం. యాత్ర బృందం రవాణా కార్మికులిండ్లలోనే బస చేసింది. వారి ఇండ్లలోనే భోజనాలు చేసింది. దీనివల్ల వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడే అవకాశం దొరికింది. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు, సమస్యలు సన్నిహితంగా పరిశీలించేందుకు ఉపయోగపడింది. కుటుంబాలతో మమేకం కావడంతో కుటుంబ సభ్యులు ఎంతో ఆప్యాయత ప్రదర్శించారు. నాయకులు తమ ఇంటికి రావటం, వారు పెట్టింది తినటం, అగ్గిపెట్టెల్లాంటి తమ ఇండ్లలో, మురికి కూపాల పరిసరాలలో, వారితో పాటు బస చేయటం వారికి ఆశ్చర్యం కలిగించింది. అందుకే హృదయపూర్వకంగా ఆదరించారు. ఇరుకు గదులు... ఒకరు పడుకుంటే మరొకరు నిలబడేందుకు కూడా చోటులేని ఇండ్లు కూడా ఉన్నాయి. ఇలాంటి ఇండ్లలో కుటుంబాలు బతుకుతున్నాయంటేనే వారి ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి ఇండ్లలో నాయకులు కూడా వారితో పాటు నేలపైన చాప పరుచుకుని నిద్రించటం వారిలో విశ్వాసం పెంచింది. ఈ కుటుంబాలలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన వారు, హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అందరూ ఉన్నారు.

హైదరాబాద్ నడిబొడ్డున, చెత్త సేకరించే వాహనాల డ్రైవర్ ఇంట్లో భోజనం చేసాం. రెండు ఇండ్ల మధ్య ఇద్దరు మనుషులు ఎదురైతే నడవటం కష్టం. ఒక ఆటో డ్రైవర్ ఇంట్లో బస చేయడానికి పోయాం. బృందం పడుకుంటే ఆ

> ఈ కార్మికులంతా అనేక కులాలూ, ప్రాంతాలూ, హిందూ, ముస్లిం, క్రైస్తవ కుటుంబాలలో జన్మించినా, వారంతా రవాణా కార్మికులన్న వాస్తవాన్నే గుర్తిస్తున్నారు. అందరూ కలిసే తమ యూనియన్లకు ఐక్యంగా నాయకత్వం వహిస్తున్నారు. కార్మికులంతా సమైక్యంగా నడుస్తున్నారు. ఈ ఐక్యతను దెబ్బకొట్టటం కోసమే మోడీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నది. భావోద్వేగాలను రెచ్చగొడుతున్నది. ఈ కుతంత్రాలను అధిగమించి, ఐక్యంగా పోరాడినప్పుడే రవాణా కార్మికులకు, ఆర్టీసీలకూ ఉరితాడుగా మారిన మోటారు వాహన సవరణ చట్టాన్ని వెనక్కి కొట్టగలం. మోడీ ప్రభుత్వం మెడలు వంచి హక్కులు కాపాడుకోగలం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద పోరాడి సంక్షేమ బోర్డులు సాధించుకోగలం.

కుటుంబ సభ్యులకు స్థలం లేదని అర్థమైంది. ఒక్కరం అక్కడ ఉండి, మిగిలిన నాయకులు మరో ఇంటికి వెళ్ళారు. కారు డ్రైవర్ ఇంట్లో భోజనానికి పోయాం. చెత్త కుప్పలో విసిరేసినట్టున్న ఆ ఇంటికి నాయకులు రావటం, భోజనం చేయటం వారు ఊహించలేదు. మిధాని డిపో పక్కన, ఫుట్‌పాత్ మీద గూడు కట్టుకున్న గిరిజన ఆటో డ్రైవర్ ఇంట్లో టిఫిన్ చేయటం ఆ ఇంటి ఇల్లాలుకు ఎంతో సంతోషం కలిగించింది. చెత్త డంపింగ్ యార్డ్ కార్మికుడి ఇంట్లో భోజనం చేసి, మరో కార్మికుడి రాజీవ్ గృహకల్ప ఇంట్లో బసచేసాం. వీరూ గిరిజనులే. ఒక ఆటో డ్రైవర్ ఇంట్లో గదికీ, వంటగదికీ మధ్య తలుపులు లేవు. ఫ్రిజ్ తలుపు సరిగా పడలేదని సర్దబోయాను. తలుపు ఊడిపడింది. అది పనిచేయదండీ అని అప్పుడు చెప్పాడు ఆ డ్రైవర్. ఇద్దరు డ్రైవర్ల ఇండ్లలో నిద్రించే సమయానికి కుటుంబ సభ్యులు లేరు. స్థలం లేక, పక్కింటిలో సర్దుకున్నారు. కిరాణా దుకాణంతో నష్టపోయి కారు డ్రైవరుగా మారిన చిరు వ్యాపారి, శవాల ఫ్రీజర్ కూడా నిర్వహించటం గమనార్హం. ఒక పూట వారి ఆతిథ్యం స్వీకరించాం. మరో గూడ్స్ ఆటో డ్రైవర్ మా బసకు ఏర్పాటు చేసిన గదిలో మంచి పరుపూ,



మంచం, సోఫా, నిలువుటద్దం ఉన్నాయి. తీరా వారు నివసించే ఇట్లో చూస్తే గాలీ, వెలుతురు ప్రసరించని రేకుల కొట్టం. తమ బతుకు చిత్రం కనిపించకుండా, అతిథులకు మర్యాద చేసి పంపే ప్రయత్నమని అర్థమైంది.

యాత్రకు సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎస్. వీరయ్య, పి. శ్రీకాంత్ సారథ్యం వహించారు. కూరపాటి రమేశ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనీ, ఆర్టీసీని పరిరక్షించాలని, 'మోటారు వాహనాల సవరణ చట్టం-2019'ని సవరించాలని కోరుతూ ఈ యాత్ర సాగింది. ఈ నెల 3న ఖమ్మంలో ప్రారంభమైన యాత్ర 11న సాయంత్రం సంగారెడ్డిలో ముగిసింది. సంఘర్ష్ యాత్ర 24 జిల్లాలలో, 49 కేంద్రాలలో కార్మికులను కలిసింది. 2780 కి.మీ. యాత్ర సాగింది. అన్ని కేంద్రాలలో కార్మికులు యాత్ర బృందానికి ఘనమైన స్వాగతం పలికారు. హైదరాబాద్, వరంగల్ మహానగరాలలోనూ, సంగారెడ్డి, హనుమకొండ, మహబూబాబాద్, మిర్యాలగూడ వంటి పట్టణాలలోనూ వందలాదిగా కదిలిన కార్మికుల స్పందన ప్రత్యేకంగా చెప్పుకోదగింది. నిజామాబాద్, సంగారెడ్డి, మిర్యాలగూడ పట్టణాలలో ప్రత్యేకంగా రవాణా కార్మికులు విరాళాలు ఇచ్చి ఉద్యమనిధిగా యాత్ర బృందానికి అందజేసారు. దీనికి తోడు యాత్ర ఆరంభం నుంచి చివరిదాకా కార్మికులు తమకు తోచిన మేరకు విరాళాలు యాత్ర హుండీలో వేసి సహకరించారు.

కార్మికులు అడ్డాల సమస్యతో సతమతమవుతున్నారు. వీరిని పోలీసులు ఊరవతలకి, బస్‌స్టాండులూ, మార్కెట్లకూ దూరంగా తరుముతున్నారు. ఆర్టీసీ బస్సు దిగిన ప్రయాణీకులు, మార్కెట్లో సరుకులు కొనుగోలు చేసిన జనం, సినిమాహాల్స్ నుంచి బయటకు వచ్చినవారు, దేవస్థానాలు సందర్శించిన భక్తులు బయటకురాగానే ఆటోలు, కార్లూ, మాక్సీ క్యాబ్‌లూ అందుబాటులో ఉండాలని కోరుకుంటారు. అందుకే ఇలాంటి చోట్ల అడ్డాలుంటే ప్రయాణీకులకు సౌకర్యంగా ఉంటుంది. డ్రైవర్లకు ఆదాయం కూడా ఉంటుంది. అధికారులకూ, పోలీసులకూ మాత్రం ఈ సోయిలేదు. పోలీసుల వేధింపులకు అవధులు లేవు. యాదగిరిగుట్టమీదకు బస్సులు, కార్లు అనుమతించారు. ఆటోలను మాత్రం అనుమతించటం లేదు. భక్తుల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించటం హర్షించదగిందే. అదే సమయంలో ఖర్చు భరించగలిగే వారికి, తమ ఇంటికి దగ్గర నుంచే కారులో కుటుంబ సమేతంగా బయలుదేరి గుట్టమీదకు వెళ్ళేందుకు అనుమతించారు. కానీ ఆ స్థోమత లేనివారు, ఆటోలలో వెళ్ళడానికి మాత్రం అనుమతించటం లేదు. ఇది పేదల పట్ల, ఆటో డ్రైవర్ల పట్ల వివక్ష. ప్రమాదాలు జరిగినప్పుడు మరణించిన, అంగవికలురైన కార్మికుల కుటుంబాలను, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న కుటుంబాలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఆన్‌లైన్ కంపెనీల దోపిడీ కూడా చెప్పారు. ఒకే ఆన్‌లైన్ పోర్టల్‌తో పనిచేస్తున్న కార్మికులను గ్రూపులుగా విడగొట్టి అనైక్యత సృష్టిస్తున్నారు. లారీ కార్మికులను పెద్ద పెద్ద కంపెనీలు బెంగుళూరు, ముంబై, చెన్నై లాంటి సుదూర ప్రాంతాలలో పనిలేదని వదిలేస్తున్నారని గోడు వినిపించారు. స్వరాష్ట్రానికి రావడానికి ఖర్చులు కూడా ఇవ్వరు. స్థానిక కార్మికులను తొలగించి వలస కార్మికులను నియమిస్తున్నారు. వలస కార్మికులు ప్రశ్నిస్తే స్థానికులను నియమిస్తున్నారు. చెత్త రవాణా చేసే వాహనాల రిపేర్లు, డీజిల్ ఖర్చులు కూడా డ్రైవర్లే భరించవల్సి వస్తున్నదని చెప్పారు. ఫైనాన్స్ సంస్థల వేధింపులకు హద్దులు లేవు. హైర్ బస్సు కార్మికులకు పనిగంటలు లేవు. ఆర్టీసీలో యూనియన్లమీద, కార్మికుల మీద అమలు చేస్తున్న ఆంక్షల పట్ల ఆందోళన వ్యక్తం చేసారు. రెండు విడతలు వేతన సవరణ జరుగక పోవటం, డీఏ బకాయిలు పెండింగ్ పెట్టడం లాంటి సమస్యల గురించి ఆవేదన వ్యక్తం చేసారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి సులభతరమైన పనులు

> రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనీ, ఆర్టీసీని పరిరక్షించాలని, 'మోటారు వాహనాల సవరణ చట్టం-2019'ని సవరించాలని కోరుతూ ఈ యాత్ర సాగింది. సంఘర్ష్ యాత్ర 24 జిల్లాలలో, 49 కేంద్రాలలో కార్మికులను కలిసింది. 2780 కి.మీ. యాత్ర సాగింది. అన్ని కేంద్రాలలో కార్మికులు యాత్ర బృందానికి ఘనమైన స్వాగతం పలికారు.వందలాదిగా కదిలిన కార్మికుల స్పందన ప్రత్యేకంగా చెప్పుకోదగింది. రవాణా కార్మికులు విరాళాలు ఇచ్చి ఉద్యమనిధిగా యాత్ర బృందానికి అందజేసారు.

ఇవ్వనందువల్ల పెట్రోల్ పంపులో పనిచేస్తున్న ఘటనలు కూడా మా దృష్టికి వచ్చాయి.

యాత్ర బృందానికి అడ్డాలమీద, ఆర్టీసీ డిపోలలో వివిధ యూనియన్ల నుంచి సంఘీభావం తెలిపారు. వీరిలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, అనేక ఇండిపెండెంట్ యూనియన్ల నాయకులున్నారు. ఆర్టీసీ డిపోలలో ఎన్ఎంయూ, ఎంప్లాయీస్ యూనియన్ల నాయకులు, కార్యకర్తలు కూడా సాదరంగా ఆహ్వానించారు.

ఈ కార్మికులంతా అనేక కులాలూ, ప్రాంతాలూ, హిందూ, ముస్లిం, క్రైస్తవ కుటుంబాలలో జన్మించినా, వారంతా రవాణా కార్మికులన్న వాస్తవాన్నే గుర్తిస్తున్నారు. మాకు స్వాగతం పలికిన ఒక యూనియన్ పేరు జై హనుమాన్ ఆటో వర్కర్స్ యూనియన్. దాని అధ్యక్షుడు మన్సూర్ పాషా. తనకు పరిచయస్తులైన హిందూ కుటుంబాలు వచ్చినప్పుడు, గుడిలో తనకున్న పలుకుబడితో గర్భగుడిదాకా తీసుకుపోయి దర్శనం కల్పిస్తాడు. మరో యూనియన్ పేరు జై శ్రీరామ్ ఆటో వర్కర్స్ యూనియన్. దాని ఉపాధ్యక్షుడు రహీంతో సహా మా బృందానికి సాదరంగా స్వాగతం పలికారు. ఆది జాంబవ యూనియన్, శ్రీలక్ష్మీ నరసింహ యూనియన్... ఇట్లా పేరు ఏదైతేనేమి? హిందూ, ముస్లిం, క్రైస్తవులన్న తేడా లేదు. దళితులూ, గిరిజనులూ, బడుగు బలహీన వర్గాలూ, అగ్రవర్ణాలన్న దృష్టిలేదు. అందరూ కలిసే తమ యూనియన్లకు ఐక్యంగా నాయకత్వం వహిస్తున్నారు. కార్మికులంతా సమైక్యంగా నడుస్తున్నారు. ఆతిథ్యం ఇచ్చిన షౌకత్‌అలీ, పాషాల కుటుంబాలైనా, యేసు భక్తుడు బాబు కుటుంబమైనా, దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల కుటుంబాలైనా, అగ్రవర్ణ కుటుంబాలకు చెందిన కార్మికులైనా ఈ యాత్ర బృందాన్ని తమ ఆప్తులుగానే ఆదరించారు. కులాలూ, మతాలూ వారికి అడ్డురాలేదు. సహజమైన లింగభేదం కూడా వారికి అడ్డుగోడ కాలేదు. కార్మికులన్న ఒకే ఒక్క లక్షణం వారందరినీ ఒకే విధంగా స్పందించేటట్టు చేసింది. అదే వారి ఐక్యతకు మూలం. ఈ ఐక్యతను దెబ్బకొట్టటం కోసమే మోడీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నది. భావోద్వేగాలను రెచ్చగొడుతున్నది. ఈ కుతంత్రాలను అధిగమించి, ఐక్యంగా పోరాడినప్పుడే రవాణా కార్మికులకు, ఆర్టీసీలకూ ఉరితాడుగా మారిన మోటారు వాహన సవరణ చట్టాన్ని వెనక్కి కొట్టగలం. మోడీ ప్రభుత్వం మెడలు వంచి హక్కులు కాపాడుకోగలం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద పోరాడి సంక్షేమ బోర్డులు సాధించుకోగలం.



కేజీబీవీలలో బోధనేతర సిబ్బంది బాధలు తీరేదెపుడు?

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవి) పథకాన్ని భారత ప్రభుత్వం 2004 ఆగస్టులో ప్రారంభించింది. ఈ పథకం కింద దేశంలోని విద్యాపరంగా వెనుకబడిన బ్లాకులు, పట్టణాలు, మైనారిటీ కేంద్రీకృత ప్రాంతాలలో ఉన్నత ప్రాథమిక స్థాయిలో బాలికల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయబడ్డాయి. దాదాపు మండలానికి ఒక కేజీబీవి ఏర్పాటు చేయబడింది. ఈ పథకం షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, ఇతర వెనుకబడిన తరగతుల, మైనారిటీ వర్గాల, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల ఆడపిల్లలకు ఆరవ తరగతి నుండి ఇంటర్ మీడియట్ వరకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసారు.



కాసు మాధవి

గొప్ప లక్ష్యంతో ఏర్పడ్డ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో బోధనేతర సిబ్బంది తీవ్రమైన శ్రమదోపిడీకి గురైతున్నారు. అతి తక్కువ వేతనాలకు అత్యధిక గంటలు పని చేస్తున్నారు. బోధనేతర సిబ్బంది ఏఎన్ఎం, అకౌంటెంట్, అటెండెంట్, స్వీపర్, డే/నైట్ వాచ్ ఉమన్, కుక్స్, కంప్యూటర్ ఆపరేటర్‌లుగా ఏడు రకాల పనులు చేస్తున్నారు. వీరంతా దళిత, గిరిజన, బాగా వెనుకబడిన కులాలకు చెందిన పేద మహిళలే. బాలికలకు నాణ్యమైన విద్యను అందించడంలో వీరి తోడ్పాటు కీలకమైనది. వీరు మాత్రం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక, కనీస వేతనాలు పొందక పేదరికంలో మగ్గుతూ మరొకవైపు రోజుకు పన్నెండు నుండి పద్నాలుగు గంటల అధికపని భారం మోస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. విద్యార్థినులకు తగినట్లుగా సిబ్బందిని నియమించకపోవడం, తక్కువ సిబ్బందితో ఎక్కువ పనులు చేయించడం, 10+2గా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలో అదనపు సిబ్బందిని నియమించకపోవడం, పండుగలు, ఆదివారాలలో సెలవులు లేకపోవడం వలన అదనపు పని భారం పెరిగి ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా కుక్స్ అధిక గంటలు పనిచేయడం వలన వంట చేస్తున్న క్రమంలో కండ్ల నుండి నీరుకారడం, లంగ్స్ ఇన్ఫెక్షన్‌కు గురవుతున్నారు. పెద్ద పెద్ద గిన్నెలలో వండిన వంటను కిచెన్ నుండి డైనింగ్ హాల్‌కు మోస్తున్న క్రమంలో కడుపు నొప్పి, డిస్క్ సమస్యలు, బహిష్టు సమయంలో అధిక రక్తస్రావానికి గురవుతున్నారు. పని ఒత్తిడి, మనసిక ఆందోళన వలన అనారోగ్యం పాలవుతూ త్వరగా వృద్ధాప్యంలోకి నెట్టబడుతున్నారు.

దేశంలో ప్రజలకు విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. విద్య, వైద్యం, ఉపాధి పొందడం ప్రజల హక్కు. కాని మన దేశంలో ప్రభుత్వం హక్కుగా ప్రజలకు కల్పించాల్సిన సేవలను తాత్కాలిక చర్యలుగా ఆలోచిస్తూ, ఎప్పుడైనా మూసివేయగల అవకాశం ఉన్న పథకాలను ప్రారంభిస్తున్నది. మరోవైపు ఆ పథకాలకు కూడా తగిన బడ్జెట్ కేటాయింపులు చేయడం లేదు. విద్యకు దూరంగా ఉన్న బాలికల సమగ్ర అభివృద్ధికి పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, విద్య మొదలైనవి కేజీబీవి ద్వారా అందవలసి ఉంది. ఇది దేశంలో ఆడపిల్లలు, పేదరికం, వెనుకబాటుతనం ఉన్నంతకాలం కొనసాగవలసిన చర్య. ఇది శాశ్వతమైన పథకంగా ఉండాలి. ఇందులో పని చేస్తున్న వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలి. కాని ప్రభుత్వం తాత్కాలికమైన పథకంగా కొనసాగిస్తూ, ఇందులో కాంట్రాక్టు కార్మికులను నియమిస్తూ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నది. ఉదాహరణకు 2004లో కేజీబీవి ప్రారంభించగా గత పందొమ్మిది సంవత్సరాలుగా పథకం కొనసాగుతుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా వేలాది మంది కార్మికులు జీవితకాలం పని చేస్తున్నారు. వీరికి ఎలాంటి రక్షణ, సౌకర్యాలు ఉండవు. క్యాజువల్ లీవులు, మెడికల్ లీవులు ఉండవు. గుర్తింపు కార్డులు, బస్ పాసులు ఉండవు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉండదు. పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ ఉండదు. వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీస వేతనం ఇవ్వకుండా, కార్మికులుగా గుర్తించకుండా ఫ్యాన్సీ పేర్లతో పిలుస్తూ ఒక రకంగా ప్రభుత్వం వీరిని మోసం చేస్తున్నది.

దేశంలో సంపద సృష్టిస్తున్నది శ్రమజీవులే. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చట్టం చెబుతున్నది. శాశ్వత ప్రాతిపదికన, కీలక(కోర్) పనులలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతి పెట్టొద్దని కోర్టులు అనేక తీర్పులిచ్చి ప్రభుత్వాలకు చీవాట్లు పెట్టినా కేంద్ర ప్రభుత్వానికి బుద్ధిరావడం లేదు. పైగా కార్మికులు పోరాడి సాధించుకున్న కొద్ది పాటి హక్కులను కూడా కార్మిక హక్కుల సంస్కరణల పేరిట ఉన్న హక్కులను తొలగించే ప్రయత్నం చేస్తున్నది. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్ల ఓట్లతో చట్టసభలకు ఎన్నికైనవారు చట్టసభల్లో వీరి గురించి చర్చించరు. మోడీ బేటీ బచావో బేటీ పఢావో అని ఒకవైపు చెప్తూ మరోవైపు పథకాలకు నిధులలో కోత పెడతున్నారు. సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ అంటున్నారు. మరి సబ్ కా వికాస్ లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్లు లేరా. మన్ కీ బాత్‌లో కుక్కల గురించి మాట్లాడే ఔదార్యం ఉన్న ప్రధానికి అర్ధాకలితో అలమటిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది కనిపించడం లేదా?

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల రాజకీయంగా విమర్శ చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్... తాను కార్మిక సంక్షేమం పట్ల శ్రద్ధ వహిస్తేనే తన ప్రత్యామ్నాయ మార్గంపై కార్మికులకు విశ్వాసం ఏర్పడుతుంది. అంగన్ వాడీ, ఆశావర్కర్లకు ఇస్తున్న గౌరవ వేతనం పెంచినట్లుగానే కేజీబీవి బోధనేతర సిబ్బంది వేతనాలు కూడా పెంచాలి. 2018లో తెలంగాణ రాష్ట్రంలో బాల కార్మికుల, డ్రాపౌట్ల, వీధి బాలుర కోసం అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇవి జిల్లాకు ఒకటి చొప్పున మొత్తం 29ఉన్నాయి. బోధనేతర సిబ్బందిగా సుమారు 200మంది పని చేస్తున్నారు. కేజీబీవి బోధనేతర సిబ్బందికి వర్తించే విధి విధానాలు, పని పద్ధతులు వీరికీ వర్తిస్తాయి. వీరు కూడా కేజీబీవి బోధనేతర సిబ్బందితో పాటుగా కనీస వేతనాలు, పని భద్రత, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి.

సెల్:9492585106

రాజ్యాంగ పతనంలో రాజకీయుల పాత్ర



ఎస్. హనుమంత రెడ్డి

రాజ్యాంగ ముసాయిదాను సమర్పిస్తూ ముసాయిదా కమిటీ అధ్యక్షులు అంబేద్కర్, రాజ్యాంగ నిర్మాణసభ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ ప్రజలను హెచ్చరించారు. "పాలకులు చెడ్డవారైతే మంచి రాజ్యాంగమైనా చెడుగా మారుతుంది. మంచివారైతే రాజ్యాంగం చెడ్డదైనా మంచిగా మారుతుంది. రాజకీయ పక్షాల మీద రాజ్యాంగ వ్యవస్థల పనితీరు ఆధారపడుతుంది. దేశం మతాతీతంగా ఉండాలి. మతం రాజ్యాన్ని అతిక్రమిస్తే స్వాతంత్ర్యం దూరమవుతుంది" అని అంబేద్కర్ అంటే... "పాలకులు యోగ్యులు, సమగ్రతా నిబద్ధులు, గుణవంతులయితే లోప యుక్త రాజ్యాంగాన్ని ఉత్తమంగా మార్చగలరు" అన్నారు రాజేంద్ర ప్రసాద్. భవిష్య ప్రజాప్రతి నిధుల చిత్తశుద్ధి, పాలనా విధానాలపై వీరికి ఆరోజే అనుమానం కలిగింది.

"భారత ప్రజలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోడానికి, పౌరులందరికీ సాంఘిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలలో స్వాతంత్ర్యం చేకూర్చుటకు, వారి వ్యక్తిగౌరవం, జాతి ఐక్యత, అఖండతలను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుటకు సత్యనిష్ఠా పూర్వకంగా తీర్మానించి 26 నవంబర్, 1949న రాజ్యాంగ పరిషత్తులో పరిగ్రహించి శాసనంగా రూపొందించుకున్న రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాం." సుప్రీంకోర్టు ఈ పీఠికను రాజ్యాంగ మౌలిక సిద్ధాంతంగా ప్రకటించింది. చట్టాలు, రాజ్యాంగ సవరణలు పీఠికలోని అంశాలకు కట్టుబడి ఉండాలన్నది. రాజ్యాంగ ముసాయిదా, నిర్మాణ సభల్లో మితవాదులు ఆనాడే అంబేద్కర్‌కు అనేక అడ్డంకులు కల్పించారు. ఈనాడు ఏకంగా అధికారమే చేపట్టి రాజ్యాంగానికి హైందవ తత్వాన్ని పులుము తున్నారు.

గత ప్రభుత్వాల రాజ్యాంగ అపసవ్యంలో నేరస్తుల రాజకీయాకరణ, రాజకీయ నేరమయం పెరిగాయి. రాజ్యాంగ పీఠిక అశ్రద్ధ చేయబడింది. సామాజికదృక్పథం, త్యాగంతో నిండ వలసిన రాజకీయాలు లాభసాటి లూటీ వ్యాపారంగా మారాయి. రాజ్యాంగ విలువలు దిగజారాయి. ఇందిర 1975లో రాజ్యాంగ అధికరణ 352(1)తో ఎమర్జెన్సీ విధించారు. దీనితో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం బలహీన పడ్డాయి. నియంతృత్వ పోకడ మొదలైంది. కాని సంఘ్ అంటరానితనం పోయింది. తన భావజాలాన్ని ప్రచారంచేసింది. జనసంఘ్, సంఘ్ పరివార్ సంస్థలు బలపడ్డాయి. జనతా ప్రభుత్వంలో అధికారం దక్కింది. ఆ తర్వాత ఇందిరకు, సంఘ్‌కు క్విడ్ ప్రోకో కుదిరింది. అది ఇందిరకు సహకరించింది. ఆమె సంఘ్ గంగాజల్ యాత్ర ప్రారంభించారు. ప్రభుత్వ కమిటీల్లో, చర్చల్లో జనసంఘ్‌కు ప్రాతినిధ్యం కల్పించారు. రాజీవ్ హిందువులను దువ్వడానికి హిందుత్వ మెతక వైఖరి వహించారు. అయోధ్య ఆలయ తలుపులు తెరిపించారు. అయోధ్య నుండి ఎన్నికల ప్రచారం ప్రారంభించి మందిర్ నిర్మిస్తామన్నారు. షాబానో మనోవర్తి సుప్రీంకోర్టు తీర్పును తిరగతిప్పి ముస్లిం మగాళ్ల కోసం చట్టం చేశారు. ఆ తరువాతి ప్రధాని నరసింహారావు బాబ్రీ మసీదు కూల్చివేతకు మౌనంగా సహకరించారు. అయోధ్య మందిర్ నిర్మాణం, అలౌకిక పాలనకు పునాదివేశారు. వాజపేయి ప్రజల ఆస్తుల అమ్మకాలను చట్టబద్ధంచేశారు. ప్రభుత్వ సంస్థలను కారుచౌకగా ప్రయివేట్లకు అమ్మారు. విద్యాలయాల్లో అశాస్త్రీయాంశాలను ప్రవేశపెట్టారు. విద్యావ్యవస్థ కాషా యీకరణతో రాజ్యాంగం నిర్దేశించిన శాస్త్రీయ దృక్పథానికి నీళ్ళొదిలారు. దేశాన్ని సాంస్కృతికంగా కలుషితం చేశారు. గుజరాత్ ముఖ్యమంత్రి నరమేధాన్ని సహించి, రాజకీయ మతోన్మాదాన్ని ప్రోత్సహించారు. మతపాలనకు నాందిపలికారు.

ఆర్.ఎస్.ఎస్. (సంఘ్) రాజ్యాంగ మూల



సిద్ధాంతాలకే వ్యతిరేకం. రాజ్యాంగం స్థానంలో 'మనుస్మృతి' అమలు చేయాలంటుంది. "రాజ్యాంగంలో మనదైన అంశమేలేదు. మనుస్మృతి ప్రపంచ సమ్మతి, ప్రశంస, యాదృచ్ఛిక విధేయత, అనుగుణ్యతలను పొందింది. రాజ్యాంగాన్ని శుభ్రపరచాలి. ఏకీకృత ప్రభుత్వం ఏర్పరచాలి." సంఘ్ రెండవ సర్ సంఘ్ చాలక్ గోల్వాల్కర్ వ్యాఖ్యానం ఇది. "రాజకీయాలను హైందవీకరించండి. హిందుత్వాన్ని సైనికీకరించండి" అన్నారు సావర్కర్. ఇప్పుడు మోడీ సర్కార్ ప్రజా రాజ్యాంగాన్ని పాలక పక్షపాత గ్రంథంగా మారుస్తోంది. సర్వసత్తాక స్థానంలో ఏకసత్తాకం తెస్తోంది. రాజ్యాంగంలో పేర్కొన్న సామ్యవాదం అసమానతలను నిరోధిస్తుంది. లౌకికత్వం రాజ్యాన్ని, మతాన్ని వేరుచేస్తుంది. ప్రజలను సోదరులుగా, మనుషులుగా తీర్చిదిద్దుతుంది. కానీ నేటి ప్రభుత్వం ఈ పదాలను రాజ్యాంగం నుంచే తొలగించాలని ప్రయత్నిస్తోంది. సామ్యవాదం మరిచి అసమానతలను పెంచి కార్పొరేట్ల ప్రభుత్వంగా మారింది. ప్రజాస్వామ్య, గణతంత్ర విలువలకు తిలోదకాలిచ్చింది. హేతు, భౌతిక, మానవ వాదాలను ప్రోత్సహించటం లౌకిక రాజ్య లక్షణం. గత ప్రభుత్వాల్లో లౌకిక భావం నిర్వీర్యమైంది. బీజేపీ సర్కార్ హిందూమత విశ్వాసాన్నే దేశభక్తిగా మారుస్తోంది. లౌకికత్వాన్ని హిందుత్వానికి ముడేసి హిందూత్వనే భారతీయతగా చెపుతోంది. సంస్థలన్నిటినీ సంఘ్ తాత్వికులతో నింపి, బలహీన పర్చింది. నియంతృత్వ ధోరణలతో రాజ్యాంగాన్ని ఎగతాళిచేసింది. పౌరసత్వ సవరణ చట్టంలో రాజ్యాంగ సమానత్వ అధికరణలు 14-18లను తిరస్కరిస్తుంది. సామాజిక సౌభ్రాతృత్వాన్ని మంటగలిపుతోంది. తన నిరంకుశ స్వేచ్ఛను, కార్పొరేట్ల దోపిడీ స్వేచ్ఛను పెంచుకుంటూ ప్రజల స్వేచ్ఛలను హరిస్తోంది. తమ దుశ్చర్యలను, తాత్వికతను ప్రశ్నించినవారిని తప్పుడు కేసులతో అరెస్టు చేయించి, జాతి నిర్మాతల గౌరవాన్ని కించ పరుస్తోంది. లౌకికత్వం, అంతర్జాతీయత, బహుళ సంస్కృతులతో పూర్వ కీర్తిప్రతిష్ఠలు నశించాయని ఫాసిజం నమ్మకం. దీనికి మతోన్మాదం తోడ్పడింది. భారతీయ సౌభ్రాతృత్వం, అంతర్జా తీయ మానవత్వం లేకుండా దేశ సమగ్రత, సమైక్యతలకు సంపూర్ణత లేదు. రాజ్యాంగ మనుగడ లేదు.

బీజేపీ సర్కార్ లక్షల్లో సంఘ్ కార్యకర్తలను పోలీసులుగా నియమించుకుందని, న్యాయ వాదులుగా నమోదుచేసుకుందని మంగళూరు బీజేపీ శాసన సభ్యుడు ఏడేండ్ల క్రితమే వెల్లడించారు. ఇప్పుడు న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికే తూట్లుపొడుస్తోంది. ఇటీవలి కోర్టు తీర్పులన్నీ బీజేపీ కోరుకున్నట్లే రావడం యాదృచ్ఛికం కాదని బీజేపీ నాయకులే అంటున్నారు. మీడియా పాలకపక్ష కార్పొరేట్ల చేతుల్లో చేరింది. ప్రజాసంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే చౌర్యోన్మాదస్వామ్యంగా ప్రజాస్వామ్యాన్ని మార్చింది. మతవాదం ఫాసిజానికి దారితీస్తోంది. జైళ్ళలో ఉండాల్సినవారు కుర్చీలెక్కి రాజ్యాంగ బాధ్యత మరిచారు. ఆ బాధ్యతను తలకెత్తుకొన్న సమాజ నిర్మాతలను జైళ్ళలో కుక్కారు. గతంలోలేని రీతిలో, స్థాయిలో రాజ్యాంగం ప్రమాదంలో పడింది.

అంబేద్కర్ అనుమానాలు నిజాలయాయి. అయన చెప్పినట్టు ఇప్పుడు స్వాతంత్ర్యం, రాజ్యాంగాల రక్షణ బాధ్యత ప్రజలదే. ప్రత్యామ్నాయ పార్టీలు సైద్ధాంతిక, సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక పద్ధతులతో ఎదగాలి. విద్యార్థులు, యువత, పౌరులు రాజ్యాంగ హక్కులు, బాధ్యతలు, పౌర జ్ఞానం, రాజ్యాంగ వక్రీకరణ నష్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్గస్వభావం, సామ్యవాదం, ఫాసిజంలపై అవగాహన పెంచుకోవాలి. ప్రజా స్వామ్యం, రాజ్యాంగాలను సమాజానికి అనుసం ధానించి ప్రచారం చేయాలి. బుద్ధిజీవులు రాజ్యాంగరక్షణలో భాగ స్వాములు కావాలి.

సెల్:9490204545

> అంబేద్కర్ అనుమానాలు నిజాలయాయి. అయన చెప్పినట్టు ఇప్పుడు స్వాతంత్ర్యం, రాజ్యాంగాల రక్షణ బాధ్యత ప్రజలదే. ప్రత్యామ్నాయ పార్టీలు సైద్ధాంతిక, సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక పద్ధతులతో ఎదగాలి. విద్యార్థులు, యువత, పౌరులు రాజ్యాంగ హక్కులు, బాధ్యతలు, పౌరజ్ఞానం, రాజ్యాంగ వక్రీకరణ నష్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్గస్వభావం, సామ్యవాదం, ఫాసిజంలపై అవగాహన పెంచుకోవాలి. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాలను సమాజానికి అనుసంధానించి ప్రచారం చేయాలి. బుద్ధిజీవులు రాజ్యాంగరక్షణలో భాగస్వాములు కావాలి.

జీవనాధారమైన తాటిచెట్లను నరికేశారు

- లబోదిబోమంటున్న బుగ్గపాడు గీత కార్మికులు
- ఫుడ్‌పార్కు ఎదుట గౌడసేన ఆందోళన

నవతెలంగాణ- సత్తుపల్లి

తమకు జీవనాధారమైన తాటిచెట్లను రోడ్డు వేవడానికంటూ అంటూ ఫుడ్‌పార్కు కాంట్రాక్టర్లు అకారణంగా నరికివేశారంటూ సత్తుపల్లి మండలం బుగ్గపాడుకు చెందిన గీత కార్మికులు లబోదిబోమంటున్నారు. బుగ్గపాడు ఫుడ్‌పార్కు సమీపంలో సుమారుగా 100కు పైగా తాటిచెట్లు నరికివేతకు గురయ్యాయని గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఫుడ్‌పార్కు ఎదురుగా గౌడసేన ఆధ్వర్యంలో గీత కార్మికులు బుధవారం ఆందోళన చేశారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో తాటికల్లుకు గిరాకీ ఉంటుందన్నారు. తాటికల్లు అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంతో పిల్లలను చదివించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని గీత కార్మికులు వాపోయారు. తిండిపెట్టే చెట్లను నరికితే తామెలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని ఆదుకోవాలని గీత కార్మికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో చిట్టిమాది భూషయ్య, మోదుగుమూడి బాలకృష్ణ, శ్రీను, పర్సా రమేశ్, చంద్రం, సర్పంచ్ జయేంద్ర పాల్గొన్నారు.



విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆగ్రహించిన రైతాంగం... రాస్తారోకో

మూడు విద్యుత్ సబ్ స్టేషన్ల ముట్టడి

నవ తెలంగాణ- చింతకాని

గత వారం రోజులుగా అర్ధరాత్రి రెండు గంటలు ఉదయం ఒక గంట మాత్రమే వ్యవసాయానికి రోజుకు మూడు గంటలు మాత్రమే ఇష్టారీతిగా విద్యుత్ సరఫరా చేస్తుండడంతో మొక్కజొన్న, వరి, మిర్చి పంటలు వడబడి పోతున్నాయి. వ్యవసాయ రంగానికి సరఫరా చేసే త్రీ ఫేజ్ కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సమస్య గురించి రైతులు విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ, డిఈ కు ఫోన్లు చేసినా సరిగా స్పందించకపోవడంతో బుధవారం ఉదయం చింతకాని మండల వ్యాప్తంగా ఉన్న మూడు విద్యుత్ సబ్ స్టేషన్ లను రైతులు ముట్టడించారు నాగులవంచ, పందిళ్ళపల్లి, కొదమూరు సబ్ స్టేషన్ ఎదుట పలు గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చేపట్టారు. ఖమ్మం- బోనకల్లు ప్రధాన రహదారి పై రైతులు రాస్తారోకో చేపట్టడంతో రహదారికి ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అయింది విద్యుత్ శాఖ డిఈ వచ్చేదాకా ఆందోళన విరమించేది లేదని రైతులు భీష్మించుకు కూర్చున్నారు సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన తర్వాత రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి తోటకూర వెంకట నరసయ్య, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నబోయిన గోపి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగార్జున, రైతులు తోటకూరి హరీష్, తాళ్లూరు రమేష్, సామినేని బాబురావు, అంబటి వెంకటి, మునుకుంట్ల నాగేశ్వరరావు, అబ్బూరి మహేష్, తన్నీరు పుల్లయ్య పాల్గొన్నారు.

డీటీసీపీ అనుమతి ఉంటేనే రిజిస్ట్రేషన్

సబ్ రిజిస్ట్రార్ మోయిజ్ అలీ

నవతెలంగాణ-వైరా

వైరా మునిసిపాలిటీ ఏర్పడిన తర్వాత డిటిసిపి అనుమతి లేని ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు నిలిపివేశామని వైరా సబ్ రిజిస్ట్రార్ మొయిజ్ అలీ స్పష్టం చేశారు. వరసగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌లు సస్పెండ్ అయిన తరువాత మోయిజ్ అలీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. వైరా సబ్ రిజిస్ట్రార్ పరిధిలో అనేక అక్రమ వెంచర్లు, స్థలాల అక్రమ రిజిస్ట్రేషన్‌లు జరిగినవి. మునిసిపాలిటీ 10వ వార్డులో ఒకరి స్వాధీనంలో ఉన్న ఇంటి స్థలంలోని కొంత భాగాన్ని కలిపి పక్కనే ఉన్న వ్యక్తి తన తల్లి పేరున ఉన్న ఇందిరమ్మ ఇంటితో సహా రిజిస్ట్రేషన్ చేయటంతో ఆందోళనలు, పోరాటాలు జరిగినవి. ఈ విషయమై జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్‌ల దృష్టికి వెళ్లగా పోలీస్ విచారణకు ఆదేశించారు. గతంలో వైరా మేజర్ గ్రామ పంచాయతీ ఈఓగా బాధ్యతలు నిర్వహించిన వారి సంతకం పోర్జరీ చేసి కొన్ని అక్రమ రిజిస్ట్రేషన్‌లు, మునిసిపాలిటీకి చెందిన కొన్ని స్థలాలు, గుట్టలు కొందరు ఆక్రమించి పొరుగు ఇంటి నెంబర్ చూపి రిజిస్ట్రేషన్ చేశారు. అంతే గాక కోర్టు వివాదంలో ఉన్న స్థలాలను కూడా తమ స్నేహితుల కోసం రిజిస్ట్రేషన్ చేసి సత్యానందమ్, రామ్ కుమార్ అను సబ్ రిజిస్ట్రార్‌లు వైరాలో వరసగా సస్పెండ్ అయ్యారు. ఈ చరిత్రను అధ్యయనం చేసిన కొత్త సబ్ రిజిస్ట్రార్ మోయిజ్ అలీ జాగ్రత్త పడుతూ డిటిపిసి అనుమతి లేకుండా రిజిస్ట్రేషన్ చేయబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే డిటిపిసి అనుమతి లేని వెంచర్ల వివరాలు సేకరించినట్లు ఎస్ఆర్ తెలిపారు. మునిసిపాలిటీ ఏర్పడక ముందు చేసిన వెంచర్లలోని ప్లాట్లకు లింక్ డాక్యుమెంట్లు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తామని కూడా ఆయన స్పష్టం చేశారు. డాక్యుమెంట్ రైటర్లకు కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. మునిసిపాలిటీ అనుమతి ఉన్న ఇండ్లను మాత్రమే రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, గతంలో గ్రామ పంచాయతీ అనుమతి పత్రాలతో నిర్మించిన ఇండ్ల రిజిస్ట్రేషన్ తాత్కాలికంగా పెండింగ్‌లో పెట్టామన్నారు. నిబంధనల ప్రకారం పారదర్శకంగా రిజిస్ట్రేషన్‌లు చేస్తామని సబ్ రిజిస్ట్రార్ తెలిపారు.



సమస్యల పరిష్కారం కోసం యువత ఉద్యమించాలి

ప్రముఖ విద్యావేత్త సంక్రాంతి రవికుమార్, డివైయఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్

నవతెలంగాణ-వైరాటౌన్

మహనీయుల జీవిత చరితలు నేటి యువతకు తెలిసే విధంగా వారి చిత్రపటాలతో క్యాలెండర్ తీయడం అభినందనీయమని, మహనీయుల జీవిత చరిత్ర నేటి యువత తెలుసుకోవాలని డివైఎఫ్ఐ 2023 క్యాలెండర్ ఆవిష్కరణ సభలో ప్రముఖ విద్యావేత్త, ఠాగూర్ విద్యాసంస్థల అధినేత సంక్రాంతి రవికుమార్, డివైయఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ అన్నారు. బుధవారం స్థానిక ఠాగూర్ విద్యాలయంలో డివైఎఫ్ఐ వైరా పట్టణ కార్యదర్శి షేక్ నాగుల్ పాషా అధ్యక్షతన జరిగిన క్యాలెండర్ ఆవిష్కరణ సభలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో డివైయఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు బాణాల కృష్ణమాచారి, యస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడ కోట ప్రేమ్‌కుమార్, డివైయఫ్ఐ నాయకులు నర్సింహారావు, కిశోర్, ఠాగూర్ విద్యాసంస్థల టీచర్స్, లెక్చరర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేయాలి

ఎంఎల్ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి, కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఖమ్మంరూరల్ మండలం కామంచికల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు చేయాలని పకడ్బందీ కార్యాచరణ చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 55 టీములతో కంటి వెలుగు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు, 100 రోజులపాటు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కంటి పరీక్ష తోపాటు కళ్ళద్దాలను ఉచితంగా అందజేయనున్నట్లు ఆయన అన్నారు. కామంచికల్‌లో 5 రోజులుగా ఏర్పాటు చేసిన శిబిరంలో బుధవారం మధ్యాహ్నం నాటికి 530 మందికి పరీక్షలు చేసినట్లు, 115 మందికి కళ్ళాద్దాలను ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో రవీంద్రనాథ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు వున్నారు.

సీపీఐ(ఎం) సానుభూతిపరుడు మృతి

నవతెలంగాణ-నేలకొండపల్లి



మండలంలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరుడు ములుగూరి వీరయ్య(45) బుధవారం మరణించారు. ఆయన గత కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ వీరయ్య సిపిఐ(ఎం) పట్ల అత్యంత విశ్వాసం, అంకితభావంతో పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. నేడు ఆయన మరణం పార్టీ అభివృద్ధికి తీరని లోటు అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రజా సమస్యలపై ఉద్యమించాలన్నారు. భౌతికకాయాన్ని సందర్శించిన వారిలో సిపిఐఎం మండల నాయకులు రచ్చ నరసింహారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, రాసాల కనకయ్య, ఎలమద్ది వెంకటేశ్వర్లు, రాసాల నవీన్ తదితరులు ఉన్నారు.

దళిత బంధుకు కేటాయించిన రూ.17,700 కోట్లను విడుదల చేయాలి

- కెవిపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- జిల్లా రెవిన్యూ అధికారి శిరీషకు వినతి

నవతెలంగాణ- ఖమ్మం



దళిత బంధు కోసం 2022-23 సంవత్సరానికి గాను కేటాయించిన రూ.17,700 కోట్ల రూపాయలను తక్షణమే విడుదల చేయాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రభుత్వం మొదట ప్రకటించిన విధంగా 1500 కుటుంబాలకు దళిత బంధు ఇవ్వాలని, ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా అధికారుల ద్వారా అర్హులను పారదర్శకంగా ఎంపిక చేసి దళితబంధు ఇవ్వాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దళిత బంధు అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వి.వెంకటాయపాలెంలోని నూతన కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి మనోహర్ మాట్లాడుతూ గత బడ్జెట్లో దళిత బంధు కోసం కేటాయించిన నిధులను నేటివరకు ఖర్చు చేయకుండా దళితులను మోసగించడం సరైనది కాదని, తక్షణమే దళిత బంధు నిధులను దళిత బంధుకే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు బడ్జెట్లో కేటాయింపులు చేసినట్టు చేసి నిధులను దారి మళ్ళించడం సరైనది కాదని విమర్శించారు. ఇప్పటికే ఎస్సీ కార్పొరేషన్ గత మూడు సంవత్సరాలుగా జీరో బడ్జెట్ ఉండటంతో నిరుపేద ఎస్సీలకు ఎలాంటి పథకాలూ అందడం లేదని ఆరోపించారు. దళిత బంధు పథకం పైన ప్రజలలో అనేక అపోహలు ఉన్నాయని, అవినీతికి, రాజకీయ జోక్యానికి తావు లేకుండా పారదర్శకంగా దళిత బంధు అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి శిరీషకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తమాల ప్రసాద్, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బొట్ల సాగర్, పాపిట్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు పంది నాగరాజు, కొమ్ము శ్రీనివాసరావు, మేఘన, కిరణ్, గుమ్మడి భిక్షం, కష్ణ, మండల జగదీష్, కోదండం, వెలుతురు రామనాథం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి

- ఎస్ఈకి రైతు సంఘం వినతి

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం జిల్లాలో అస్తవ్యస్తంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా నిరంతరం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఖమ్మం జిల్లా విద్యుత్ ఎస్ఈ సురేందర్‌కి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ప్రకటనలు చేస్తుందని, ఈ వ్యవసాయ సీజన్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 12 గంటలు విద్యుత్ సరఫరా చేసి గత నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది అని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ సీజన్లో అధిక వర్షాలు వైరస్, తెగుళ్ల వల్లన పంటలు దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో రబీ సీజన్లో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న, వరి పంటలు వేశారని, వీటికి తోడు మిర్చి పంట ఉందని అధిక సాగు నీరు అవసరం ఉన్న నేపథ్యంలో కరెంట్ సరఫరా రైతులకు, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కోతలు విధించడంతో పాటు రాత్రి సరఫరా చేయడం వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు, వ్యవసాయంకు అవసరమైన విద్యుత్ సరఫరా నిరంతరం పగటి పూట సరఫరా చేయాలని కోరారు. విద్యుత్ సరఫరా అవంతరాలు తొలిగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్ ఎస్కే మీరా, సహాయ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు కూసుపూడి మధు, చెరకుమల్లి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో ఉపాధి పనులకు రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాలి

- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ- ఖమ్మంరూరల్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న చివరి బడ్జెట్లో ఉపాధిహామీ పథకానికి రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్లో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మద్ది వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు 600 రూపాయలు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీని అన్ని రాష్ట్రాల్లో 200 రోజులు అమలు చేస్తూ 2.50 లక్షల కోట్లు కేటాయించాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పొన్నెకంటి సంగయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని, గ్రామాల్లో వలసలు నివారించాలని, కూలీబీమా పథకం ప్రవేశపెట్టి ప్రతికూలీ కుటుంబానికి నెలకు పదివేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నంద్ర ప్రసాద్, సంఘం మండల కార్యదర్శి వల్లమూడి నాగేశ్వరరావు, సంఘం నాయకులు కత్రం ఉపేందర్, కారుమంచి గురవయ్య, గుర్రం ఉపేందర్, లింగంపల్లి వీరస్వామి, యర్రా నరసింహారావు, కొర్నే వెంకయ్య, పొన్నం వెంకటరమణ, మోహన్, సైదులు, గుంటి వెంకన్న, పి.వెంకట్రావు, ఎల్.వెంకన్న పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

- కోటి రూపాయల చెక్కులు మంజూరు చేయించిన ఘనత సీపీఐ(ఎం)ది
- పార్టీ జిల్లా నాయకులు ఊరడి సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ఎంఎల్‌సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫార్సు ద్వారా సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం పార్టీ జిల్లా నాయకులు ఊరడి సుదర్శన్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏదులాపురం గ్రామానికి చెందిన తమ్మనబోయిన వెంకటేశ్వర్లకు మంజూరైన 13,500, తమ్మనబోయిన శ్రీకాంత్‌కు మంజూరైన 9500, సత్యనారాయణపురం గ్రామానికి చెందిన మామిండ్ల సూరమ్మకు మంజూరైన రూ.60 వేలు, మామిండ్ల ఉప్పలయ్యకు మంజూరైన 11,500, చిన్న తండా గ్రామానికి చెందిన బాణోత్ భారతికి మంజూరైన 15 వేలు, ఇందిరమ్మ కాలనీకి చెందిన మేళం రవికి మంజూరైన రూ.16,500, నాయుడుపేటకు చెందిన శ్రీనుకు మంజూరైన రూ.60 వేలు, సింహాద్రి నగర్‌కు చెందిన దరిపల్లి ఉమాదేవికి మంజూరైన రూ.22,500, ముత్తగూడెం గ్రామానికి చెందిన చామకూరి రవికి మంజూరైన రూ.45 వేలు, అనూరాధకు మంజూరైన 27 వేల రూపాయలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు ఏదులాపురం, పరిసర గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో సుమారు ఒక కోటి 7 లక్షల రూపాయలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. పేదలకు అండగా ఉండటమే సీపీఎం ధ్యేయమన్నారు. కార్యక్రమంలో పార్టీ ఖమ్మంరూరల్ మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్, రైతు సంఘం నాయకులు తోట పెద్ద వెంకటరెడ్డి, నందిగామ కృష్ణ, ప్రసాద్, దుండిగల బ్రహ్మం, నాగయ్య, వెంకటేశ్వర్లు, గడ్డం వీరబాబు, ప్రముఖ న్యాయవాది పి.నరసింహారావు, అనిష్, చక్రవర్తి, జేడి, నరేష్, తాటి వెంకన్న, పొన్నం సంగయ్య, రామన్న, అర్వపల్లి శ్రీను, బానోత్ సోని, నాగేశ్వరరావు, మధురెడ్డి, కె.రవి, పవన్ రెడ్డి, ఎం.రవి పాల్గొన్నారు.

ఠాగూర్ విద్యాసంస్థలో జాతీయ ఓటర్ దినోత్సవం

నవతెలంగాణ-వైరాటౌన్



స్థానిక ఠాగూర్ విద్యాసంస్థలకు చెందిన క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ సంక్రాంతి సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకొని వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ఓటర్ల ప్రతిజ్ఞ చేసిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సంక్రాంతి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ప్రిన్సిపల్ కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ పిఓ లింగారావు, అధ్యాపకులు మజీద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన ఎన్‌హెచ్‌ఎం బృందం

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని ఖమ్మం ప్రధాన ప్రభుత్వాసుపత్రిని బుధవారం నేషనల్ హెల్త్ మిషన్ బృందం (ఎన్‌హెచ్) సందర్శించింది. ఎన్‌హెచ్ వైద్యులు చంద్రశేఖర్, పర్వీణ్ సుల్తానా ఆసుపత్రిని పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ల్యాబ్, వార్డ్ సౌకర్యాలు, ఐసిటిసి, ఫార్మసీ, బ్లడ్ బ్యాంకు, రికార్డులను తనిఖీచేశారు. మాతా శిశు కేంద్రంలోని గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలను ఆరా తీశారు. అనంతరం ఆపరేషన్ థియేటర్లో సౌకర్యాలు పరిశీలించి వివరాలు నమోదు సుకున్నారు. బాధితులకు కేంద్ర బడ్జెట్లో కేటాయించిన సర్వీసులు అందుతున్నాయా లేదా అని తెలుసుకొని సలహాలు, సూచనలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు, ఆర్ఎంఓ బొల్లికొండ శ్రీనివాసరావు, జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్‌లో వాన్, సాగర్, నందగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. ఈ మేరకు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఖమ్మంరూరల్, ఖమ్మం, వైరా, మధిర, పెనుబల్లి మండలాల్లో జరిగే వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తారని పేర్కొన్నారు. కావున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

వ్యవసాయ రుణాలు పునర్ధరణ చేసుకోవాలి

నవతెలంగాణ-ముదిగొండ

వ్యవసాయ రుణాలను రైతులు పునర్ధరణ చేసుకొని బ్యాంకు వారికి సహకరించాలని గ్రామసర్పంచ్ చెరుకుపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలో యడవల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులకు ఏపీజీవీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక, అక్షరాస్యత అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రాచకొండ రవిచందర్, ఎఫ్ఎల్‌సి కౌన్సిలర్ మోహన్‌రావు, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్స్ మద్దాల ప్రవీణ్ బాబు, ఎల్ గంగశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని బాలునికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ -బోనకల్

పాల వాహనం ఢీకొని బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోనకల్ గ్రామానికి చెందిన బాలుడు మాచర్ల సందీప్ మిత్రునితో కలిసి వాత్సవాయి రోడ్డులో సైకిళ్ళ మీద వెళ్తుండగా వత్సవాయి వైపు నుంచి వేగంగా వెళ్తున్న పాల వాహనం ఢీకొని సందీప్‌కు కుడి కాలు విరిగింది. తలకు బలమైన గాయాలు అయ్యాయి. 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోట భాను సహన్, పైలట్ ఎంఎం మిథున్ చక్రవర్తి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం 108 లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిధుల విడుదలలో కేంద్రం వివక్ష

నవతెలంగాణ-కారేపల్లి

తెలంగాణ రాష్ట్రంలోని పంచాయతీలకు నిధులు విడుదలలో కేంద్రం జాప్యం చేస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దబోయిన ఉమాశంకర్ అన్నారు. బుధవారం తొడితలగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే సమాజ అభివృద్ధి అని నమ్మిన ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామపంచాయతీలకు ప్రతి నెల నిధులు విడుదల చేస్తున్నారన్నారు. తెలంగాణలో అభివృద్ధిని బీజేపీ ఓర్వలేక పోతుందని ఆరోపించారు. లావుడ్యా రాములునాయక్‌ను మరోసారి ఎమ్మెల్యే అవకాశం కల్పించటం ద్వారా అభివృద్ధి బాటలు వేసుకుందామన్నారు. ఈకార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు బానోత్ కుమార్, సొసైటీ డైరక్టర్ మర్సకట్ల రోషయ్య తదితరులు పాల్గొన్నారు.

1న కోయగంపులో సమ్మక్కసారలమ్మల జాతర

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం కోయగుంపులో ఫిబ్రవరి 1 నుంచి 3వతేది వరకు సమ్మక్కసారలమ్మ ల జాతర నిర్వహిస్తున్నట్లు కారేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షులు జాతర నిర్వాహణ కమిటీ సభ్యులు ఈసాల నాగేశ్వరరావు తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదిన సారలమ్మ తల్లిని గద్దెల మీదకు తీసుకరావటం, 2వ తేదిన సమ్మక్క తల్లి గద్దెల మీదకు తీసుకరావటం, 3వ తేదిన తల్లులకు బోనాల సమర్పణ, మొక్కలు చెల్లింపు కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. జాతరకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరంలో 59వ డివిజన్ దానవాయిగూడెం కాలనీకి చెందిన పోర్ల నాగయ్య, బోపిని బిక్షపతి కుమార్తె స్వాతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందారు. ఆ కుటుంబాలకు రూ.5వేలు చొప్పున రూ.10వేలను 59వ డివిజన్ బిఆర్‌యస్ మాజీ అధ్యక్షులు దామల రవి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాసిని కృష్ణగౌడ్, బత్తుల ఉపేందర్, జలా కోటయ్య, మద్దెల ఉపేందర్, నాగంటి బిక్షం, చిటిక వినయ్, జైరబీ, మేర వెంకన్న, ధార నాగరాజు, గుండ్ల వీరన్న, ఎస్‌కె.రంజాన్ పాల్గొన్నారు.

కోటి రూపాయలతో ధ్యాన మందిరం అభివృద్ధి పనులు

- పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి
- నెల రోజులలో ఆడిటోరియం

నిర్మాణ పనులను పూర్తి చేయాలి : కలెక్టర్

నవతెలంగాణ-నేలకొండపల్లి



భావితరాలు గుర్తించేలా భక్త రామదాసు జయంతి ఉత్సవాలను ప్రతి ఏటా ఘనంగా నిర్వహించాలని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా కలెక్టర్ పాలన యంత్రాంగం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, నేలకొండపల్లి శ్రీ భక్త రామదాసు విద్వత్ కళా పీఠం సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న భక్త రామదాసు జయంతి ఉత్సవాలను బుధవారం జిల్లా కలెక్టర్ విపి గౌతమ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. తొలుత ధ్యాన మందిరంలో ఎమ్మెల్యే కందాల, కలెక్టర్ వి పి గౌతమ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్త రామదాసు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రామదాసు ఉత్సవాలను ఈ ఏడాది నూతనంగా నిర్మిస్తున్న ఆడిటోరియంలో నిర్వహించాలని గత ఉత్సవాలలో అనుకున్నప్పటికీ సకాలంలో నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం చేత అక్కడ నిర్వహించుకోలేకపోయామన్నారు. వచ్చే ఏడాది కచ్చితంగా నూతన ఆడిటోరియంలోనే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుంటామని తెలిపారు. భక్త రామదాసు ధ్యాన మందిరానికి ప్రహరీ గోడ, ఫ్లోరింగ్ ఇతరత్రా అభివద్ధి పనులకు గాను కోటి రూపాయల నిధులను మంజూరి చేయనున్నట్లు ఆయన తెలిపారు. నేలకొండపల్లి గ్రామపంచాయతీలో పెండింగ్లో ఉన్న సిసి రోడ్లను 100% పూర్తి చేసేందుకు మరో 20 రోజులలో పనులను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ వి పి గౌతం మాట్లాడుతూ ధ్యాన మందిరం అభివృద్ధి పనుల్లో భాగంగా జరుగుతున్న ఆడిటోరియం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. మరో నెల రోజులలో ఆడిటోరియంను అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం నేలకొండపల్లి పట్టణంలో భక్తులు చేసిన నగర సంకీర్తన, చిన్నారుల వేషధారణలు, సంగీత కచేరీలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, సర్పంచ్ రాయపూడి నవీన్, ఎంపీటీసీలు బొడ్డు బొందయ్య, శీలం వెంకటలక్ష్మి, భద్రాచలం దేవస్థానం సూపరింటెండెంట్ సాయిబాబా, ఎంపీడీవో కే జమలారెడ్డి, టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య ,అర్చకుడు సౌమిత్రి రమేష్, భక్త రామదాసు విద్యుత్ కళా పీఠం చైర్మన్ సాధు రాధాకష్ణమూర్తి, భక్త రామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు యలమద్ది లెనిన్, పాలడుగు పూర్ణచంద్ర ప్రసాద్, వల్లంచెట్ల భాస్కరరావు, వెల్లంపల్లి శ్రీనివాసరావు, మామిడి వెంకన్న, పెండ్యాల గోపాలకష్ణమూర్తి, మన్నే కోటేశ్వరరావు, హరి శ్రీనివాసరావు, వాసం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యంను మరింత చేరవేసేందుకే బస్తీ దవాఖానాలు

నవతెలంగాణ-ఖమ్మం

పేదలకు నాణ్యమైన వైద్యంను మరింత చేరవేసేందుకే బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఎల్‌ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం ఖమ్మంనగరం 60వ డివిజన్ రామన్నపేటలో రూ.16.40 లక్షలతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానను కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యేతో కలిసి ప్రారంబించారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.బి.మాలతి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాతా మధుకు సత్తుపల్లి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

- నిఖిల్‌కు నివాళులర్పించిన నాయకులు

నవతెలంగాణ-సత్తుపల్లి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు సోదరుని కుమారుడు నిఖిల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా బుధవారం సత్తుపల్లి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులోని నిఖిల్ నివాసానికి చేరుకుని మధును, కుటుంబసభ్యులను పరామర్శించారు. నిఖిల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నవయస్సులో నిఖిల్ మరణించడం బాధాకరమన్నారు. పరామర్శించిన వారిలో సత్తుపల్లి మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, ఆత్మ కమిటీ ఛైర్మెన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఎంపీపీలు దొడ్డా హైమవతిశంకరరావు, పగుట్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు మందపాటి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తుంబూరు కృష్ణారెడ్డి, పిడుగు సత్యనారాయణ, కౌన్సిలర్లు ఎస్‌కే చాంద్‌పాషా, అద్దంకిఅనిల్, గుంట్రు రాఘవేంద్ర, నాయకులు గాయం రాంబాబు, మేకల నరసింహారావు, నాగార్జున వెంకటాచారి, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

సప్తపది లయన్స్ ఆర్థికసాయం

నవతెలంగాణ- పెనుబల్లి

రోడ్డు ప్రమాదంలో అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయించుకోవడానికి ఇబ్బంది పడుతున్న బయన్నగూడెం చింతోజు విజయ్‌కు సప్తపది లయన్స్ రూ.5వేల ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఛైర్పర్సన్స్ లయన్ మిట్టపల్లి జనార్దన్, లయన్స్అబ్దుల్ సలాం, ప్రెసిడెంట్ నాళ్ళ జయరాం, వైస్ ప్రెసిడెంట్ యస్ అనంత్, సెక్రటరీ శ్రీధరాల సుబ్బారావు, ట్రెజరర్ సుంకర సత్యనారాయణ, క్లబ్ బాధ్యులు బజ్జూరి నాగేశ్వరరావు, దీవెల మంగపతిరావు, నేరేటి బాబురావు, రామడుగు రాజా పాల్గొన్నారు.

ఎరువుల డీలర్లకు శిక్షణ

నవతెలంగాణ-రఘునాథపాలెం

రఘునాథపాలెం రైతు వేదిక నందు ఖమ్మం డివిజన్ పరిధిలో ఉన్న ఎరువుల డీలర్లకు శిక్షణ కార్యక్రమం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరువుల లైసెన్స్ జారీ చేయు వ్యవస్థలో వచ్చిన మార్పుల గురించి వివరించారు. ఎరువుల దుకాణదారులందరూ చట్ట ప్రకారం వ్యాపారం చేయాలని సూచించారు. నిబంధనలు పాటించకుంటే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి భాస్కర్‌రావు, కామేపల్లి మండల వ్యవసాయ అధికారి తారా దేవి, ఖమ్మం అర్బన్ మండల వ్యవసాయ అధికారి బి.కిషోర్‌బాబు, మూడు మండలాలకు సంబంధించిన డీలర్లు హాజరయ్యారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ- కామేపల్లి

పింజరమడుగు తండాకు చెందిన వాంకుడోత్ సక్రియ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తండ్రిని కోల్పోయిన ఆ పిల్లలకు చదువు ఖర్చుల నిమితం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తెలియజేసి వారి ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించగలమని మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు షేక్ పత్తే మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు

త్రివేణిలో వార్షిక క్రీడా ఉత్సవాలు

నవతెలంగాణ- ఖమ్మం

గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఖమ్మం త్రివేణి పాఠశాలలో వార్షిక క్రీడా ఉత్సవాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ క్రీడాంశాలలో పాల్గొని తమ ప్రతిభను చాటారు.ఈ క్రీడా ఉత్సవాలను గురుదత్త నేత్రాలయకు చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ఎం.నందనందన్, డాక్టర్ ఎం.యామిని ప్రారంభించారు.కార్యక్రమంలో వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు వారు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో త్రివేణి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

భక్త రామదాసు కళాక్షేత్రంలో వసతులు కల్పించాలని వినతి

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో మిగిలిన వసతులు లైటింగ్, కట్టన్స్, బౌండరీ, మైకులు ఏర్పాటుచేసి పూర్తిస్థాయి కళాక్షేత్రంగా తీర్చిదిద్దాలని నెలనెలా వెన్నెల నిర్వాహకులు అమరజీవి అన్నా బత్తుల రవీంద్రనాథ్ కళా సంస్కృతిక సంస్థ అధ్యక్ష కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏ.సుబ్రహ్మణ్య కుమార్, కళాపరిషత్ అధ్యక్ష కార్యదర్శులు వి.అప్పారావు, డాక్టర్ నాగబత్తిని రవి, ప్రజానాట్యమండలి కార్యదర్శి సదానందం, కలెక్టర్ వి పి గౌతమ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే కలెక్టర్ ఆఫీస్ నూతన భవన్లోకి మారిన సందర్భంగా కలెక్టర్‌ని అభినందించారు.

విజ్ఞాన్ స్కూల్ విద్యార్థుల ర్యాలీ

నవతెలంగాణ-వైరా

రిపబ్లిక్ డే పర్వదినం సందర్భంగా కేజీ సిరిపురం వైరా విజ్ఞాన్ స్కూల్ ఆధ్వర్యంలో జాతీయ నాయకుల విచిత్ర వేషధారణలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం రింగ్ రోడ్డు సెంటర్లో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో జై జవాన్ జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. ర్యాలీని వైరా మున్సిపల్ చైర్మన్ సూతగాని జైపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.జయ ప్రకాష్, కరస్పాండెంట్ దిలీప్, హెడ్మాస్టర్ కళ్యాణి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

నవతెలంగాణ-సత్తుపల్లి

స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఎలక్టోరల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఓటర్ల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ పానెం రామచంద్రరావు, కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.విజయ్‌కుమార్, ఎలక్టోరల్ క్లబ్ కన్వీనర్ రాజ్యలక్ష్మీ, అకడమిక్ కోఆర్డినేటర్ రాంబాబు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జి షేక్ పీర్‌సాహెబ్ పాల్గొన్నారు,

బోనకల్ : జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లింగమనేని నళినిశ్రీ, ఎన్ఎస్ఎస్ పివో రామకృష్ణ, అధ్యాపకులు జోనాథన్ బాబు, ఎస్.ప్రసాద్ బాబు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరు : ఓటు అనేది వజ్రా ఆయుధం లాంటిదని అందరూ ఓటు హక్కు ఉపయోగించుకొని నిష్పక్షపాతంగా ఎన్నుకోవాలని ఆర్డీవో సిహెచ్ సూర్యనారాయణ అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తాసిల్దార్ బాబ్జి ప్రసాద్, ఆర్ఐలు అన్వర్, స్టాలిన్, ఆర్డీవో సిబ్బంది రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగొండ : చైతన్యవంతమైన ఆలోచనలకు ఓటు కీలకమని, ఆ ఓటు విలువ తెలుసుకోవాలని సామాజికవేత్త రవిమారుత్ అన్నారు. ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటర్ల దినోత్సవం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఓటు హక్కుపై ఏర్పాటుచేసిన సెమినార్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ ప్రముఖ కవి ప్రసేన్, అధ్యాపకులు శ్రీనివాసరావు, వెంకన్న, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిధి పాఠశాలలో క్రీడలు ప్రారంభం

నవతెలంగాణ-మధిర

మధిర శ్రీనిధి పాఠశాలలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా పాఠశాలలో ఇంట్రమోరల్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌ను పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అంజన్‌బాబు క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, మరియు డైరెక్టర్ చందు, వెంకట్, ప్రవీణ్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం పోలీసు కమిషనర్‌గా సురేష్ కుమార్..?

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం కమిషనరేట్ పోలీసు కమిషనర్‌గా కొల్లు సురేష్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు త తెలిసింది. ప్రస్తుతం పోలీసు కమిషనర్ పనిచేస్తున్న విష్ణు ఎస్ వారియర్ను బదిలీ అయినట్లు సమాచారం. విష్ణు ఎస్ వారియర్ను ఖమ్మంలో సంవత్సరం 9 నెలలు పనిచేశారు. సురేష్‌కుమార్ 2016 సంవత్సరంలో ఐపీఎస్‌గా ఉద్యోగోన్నతి పొందిన సురేష్ కుమార్ 2010 సంవత్సరంలో గ్రూప్ వన్ డీఎస్పీగా ఉద్యోగం సాధించడంతో మొదటి పోస్టింగ్ నెల్లూరు జిల్లా గూడూరులో పొందారు. అక్కడి నుంచి వరంగల్ జిల్లా మామునూరు డిఎస్పీగా పనిచేశారు. 2015 నవంబర్లో ఖమ్మం డీఎస్పీగా బదిలీపై జిల్లాకు వచ్చారు. 2017 నవంబర్ లో ఖమ్మం కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (అడ్మిన్)గా విధులు నిర్వర్తించారు. 2018 సెప్టెంబర్ వరకు ఖమ్మంలో పనిచేసిన ఆయన అనంతరం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు ఓఎస్డీ(ఆపరేషన్స్)గా బదిలీ అయ్యారు. అక్కడి నుంచి ములుగు జిల్లాకు.. బదిలీ అయ్యారు. అక్కడి నుంచి జగిత్యాల జిల్లాకు అడిషనల్ ఎస్పీగా వెళ్లగా 2022 సంవత్సరంలో ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా వెళ్లి ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్నారు.

ఓటర్ల చేతిలోనే దేశ భవిష్యత్తు

జాతీయ ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ వీపీ గౌతమ్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



దేశ భవిష్యత్తు ఓటర్ల చేతిలో ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరిగి ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన 13వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ మాట్లాడుతూ... భారత దేశం అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటు చేసుకొని, ప్రతి 5 సంవత్సరాలకు ఎన్నికలు నిర్వహించుకుంటుందని తెలిపారు. 2011 నుండి జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని, ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని తెలిపారు. జిల్లాలో ఇటీవలే ఓటరు జాబితా సవరణ పూర్తి చేసి, 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించామన్నారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు నేపథ్యంలో మరోసారి సైతం ఓటరు జాబితా సవరణ చేపట్టి అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తున్నామని అన్నారు.కలెక్టర్ నూతన ఓటర్లకు ఓటర్ ఐ.డి. ఎథిక్స్ కార్డులు అందించారు. జిల్లాలో నూతనంగా ఓటు హక్కు పొందిన యువత ప్రతి ఎన్నికల్లోనూ ఆ హక్కు ఉపయోగించాలని కోరారు. ఓటరుగా నమోదు చేసుకున్నందుకు వారిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్, జిల్లా రెవెన్యూ అధికారి శిరీష, జిల్లా నోడల్ అధికారి కె. శ్రీరామ్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన 'మన ఊరు– మన బడి'

'మన ఊరు–మన బడి'లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయ సమావేశ మందిరంలో బుధవారం పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 426 పాఠశాలల్లో మన ఊరు–మన బడి కింద అభివృద్ధి పనులు చేపట్టినట్లు, 416 పాఠశాలల్లో పనులు గ్రౌండింగ్ అయినట్లు తెలిపారు. ఇందులో 372 పాఠశాలల్లో ఉపాధిహామీ కింద పనులు జరుగుతున్నట్లు తెలిపారు. 49 పాఠశాలల్లో పూర్తి స్థాయిలో పనులు పూర్తయినట్లు 174 పాఠశాలలో పనులు ముగింపు దశలో ఉన్నాయన్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెయింటింగ్‌కు సిద్ధంగా ఉన్న పాఠశాలల్లో పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. పూర్తి అయిన పనులకు వెంట వెంటనే ఎంబీలు సమర్పించాలన్నారు. పనులు పూర్తయిన పాఠశాలలకు ఈ నెల నుండి డ్యూయల్ డెస్క్ పంపిణీ ప్రారంభం కానున్నట్లు తెలిపారు. గిరిజన సంక్షేమం, రోడ్లు భవనాల ఇంజనీరింగ్ శాఖలు చేపట్టిన పనుల్లో వేగం పెంచాలన్నారు. పనుల పూర్తికి అధికారులు రోజువారీ సమీక్ష చేయాలని, వ్యక్తిగత శ్రద్ధతో త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, జిల్లా విద్యాధికారి సోమశేఖర శర్మ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.వి. అప్పారావు, ఈఈలు నాగేషు, శ్రీనివాసరావు, చంద్రమౌళి, కష్ణ లాల్, మండల విద్యాధికారులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, డీఈ లు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ సత్వర పూర్తికి అవసరమైన నిధులు కేటాయించాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-కామేపల్లి



ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించటంతో పాటు రెండున్నర లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టు స్థిరీకరించే సీతారామ ప్రాజెక్టు పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం సరిపడా నిధులు 2023–24 రాష్ట్ర బడ్జెట్లో కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం కామేపల్లి మండలం జాస్తిపల్లిలో వజ్జా రామారావు అధ్యక్షతన జరిగిన కామేపల్లి, కారేపల్లి, ఏన్కూర్ మండలాల రైతు సంఘం విస్తృత సమావేశంలో బొంతు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు భూ నిర్వాసితులకు మూడు సంవత్సరాల క్రితం పరిహారం ప్రకటించి నేటికీ అందించలేదని, ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జనవరి 26 జిల్లా కేంద్రాల్లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగే ప్రదర్శన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ, సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, భూక్యా లక్ష్మా కామేపల్లి మండల అధ్యక్షులు రాయల సత్యనారాయణ, రైతు సంఘం సీనియర్ నాయకులు వడ్డే అజయ్ బాబు, ఏన్కూర్ మండల అధ్యక్ష కార్యదర్శులు తమ్మినేని వెంకటయ్య, గుండా సత్యనారాయణ రెడ్డి, కారేపల్లి మండల అధ్యక్షులు ముళ్ళ ఏకాంబరం, అంబటి శ్రీనివాసరెడ్డి, బదావత్ శ్రీనివాస్, ఉప్పతల వెంకన్న, రాయల వెంకన్న, ఉప్పర సూర్య నారాయణ, గుండా వెంకటరెడ్డి, బండ్ల చిన్న జోగయ్య, వల్లభనేని మురళి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య పార్క్‌లో కోనోకార్పస్ మొక్కలు తొలగించాలి

సీపీఐ(ఎం) త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని త్రీ టౌన్ ప్రాంతంలో ఉన్న సుందరయ్య పార్క్‌లోని కోనోకార్పస్ మొక్కల పువ్వుల ద్వారా శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉందని, వెంటనే ఆ మొక్కలను తొలగించాలని సిపిఎం త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు అన్నారు. కోనోకార్పస్ పువ్వుల పుప్పొడి రేణువుల వల్ల శ్వాసకోశ వ్యాధులు వస్తాయని ఇటీవల అధ్యయనంలో తేలిందన్నారు. అందుకే ప్రభుత్వం ఈ మొక్కలను నిషేధించిందన్నారు. వెంటనే ఈ మొక్కలను పార్కులో తొలగించాలని భూక్య శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

తమ భూములకు దారి సౌకర్యం కల్పించాలి

తహసిల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనుల ధర్నా

నవతెలంగాణ-నేలకొండపల్లి



తమ పంట భూములకు దారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండలంలోని తిరుమలాపురం తండా గ్రామానికి చెందిన లంబాడి గిరిజనులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో తమ వ్యవసాయ పంట భూములకు దారి ఇవ్వకుండా కొంతమంది అడ్డుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దారి సౌకర్యం లేకపోవడంతో పంటలు సాగు చేసుకోలేక బీడు భూములుగా ఉంచాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని తమ భూములకు దారి లేకుండా అడ్డుకుంటున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు భూక్య వెంకటేశ్వర్లు, భూక్య రవి, రంజిత్ కుమార్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

క్వారీ నిలిపివేయాలని మైనింగ్ శాఖ ఆదేశం

నవతెలంగాణ-పెనుబల్లి



ఏజన్సీ ప్రాంతంలోని దేవతలగుట్టలో నడుస్తున్న క్వారీని తాత్కాలికంగా నిలిపివేయాలని మైనింగ్ శాఖ అధికారులు ఆదేశించారు. పెనుబల్లి మండలం లింగగూడెం రెవిన్యూలోని 302 సర్వే నెంబర్లో దేవతల గుట్టలో నడుస్తున్న పోపూరి కన్స్ట్రక్షన్ క్రషర్ క్వారీలో అనుమతులు లేకుండా కేటాయించిన భూమిని కంటే ఎక్కువ భూమిని ఆక్రమించి క్వారీ పనులు నిర్వహిస్తున్నారనే ఆరోపణపై మండల తహసీల్దార్ రమాదేవి ఎంక్వైరీ చేసి నివేదికను జిల్లా మైనింగ్ శాఖకు ఇచ్చారు. మైనింగ్ అధికారులు పూర్తి స్థాయిలో ఎంక్వైరీ చేసే వరకు క్వారీలో పనులు నిలిపివేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఇదే రెవిన్యూలో చిట్యాల బోడు గుట్ట నుండి పర్మిషన్‌లు లేకుండా ఆంధ్రాలోని ఎన్టిఆర్ జిల్లా తిరువూరు మండల కేంద్రంలో రియల్ఎస్టేట్ వెంచర్‌కు అక్రమంగా గ్రావెల్ తోలకాలపై విచారణ చేయనున్నట్లు తెలిపారు. అయితే మైనింగ్ శాఖ క్వారీ పనులు నిలిపివేయాలని ఆదేశించినప్పటికి క్వారీలో పనులు కొనసాగిస్తునే వున్నారు.



మిర్చి తోటలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

తిరుమలాయపాలెం మండలం పడమర తండా, హైదర్ సాయిపేట, జల్లేపల్లి, పాతర్లపాడు గ్రామాలలో మిర్చి వేసి తెగుళ్లతో నష్టపోయిన మిర్చి తోటలను సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కొమ్ము శ్రీను మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి మిర్చి తోటలేస్తే కనీసం పంట పండక తెగుళ్లతో నష్టపోయి రైతాంగం పడరాని ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మిర్చి తోటలేసి నష్టపోయిన రైతాంగ తోటలను పరిశీలించి నష్టపరిహారం చెల్లించి రైతన్నను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు తుళ్లూరు నాగేశ్వరరావు, బాణోతు బాలు, తిరుపతి, భాగ్య, భూక్యా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరు

నవతెలంగాణ- కల్లూరు



ముస్లిం మైనార్టీలకు షాదీఖానా నిర్మాణం కోసం రూ.75 లక్షలు మంజూరు చేయించడం ముస్లిం సోదరులు సీఎం కేసీఆర్‌కి, ఎంఎల్‌ఏ సండ్ర వెంకట వీరయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం స్థానిక మసీదు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ముస్లిం మైనారిటీలకు షాదీఖానా లేక అవస్థలు పడుతున్న సమయంలో ఎమ్మెల్యే సండ్ర కృషితో 75 లక్షల రూపాయల మంజూరు చేయడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ముస్లిం కమిటీ అధ్యక్షులు సయ్యద్ అలీ, మసీద్ కమిటీ అధ్యక్షులు షేక్ ఇమామ్, మండల జమాతే ఇస్లామీ హిందూ అధ్యక్షులు ఎండి ముజాహిద్, మాజీ సదర్ అనీఫ్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఇస్మాయిల్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు కమ్లి, బిఆర్ఎస్ పార్టీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు రవుఫ్, మైనార్టీ సీనియర్ నాయకులు ఇస్సాకు తదితరులు ఉన్నారు.

కిష్టారం ఓసీలో ఆల్‌టైం రికార్డు

- సింగల్ షిఫ్ట్‌లో 10,741 టన్నుల ఉత్పత్తి

- ప్రోత్సహక బహుమతులు అందజేత

నవతెలంగాణ- సత్తుపల్లి

సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీలో ఒకేరోజు సింగిల్ షిఫ్ట్‌లో రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరిగింది. మంగళవారం 10.741.570 టన్నుల బొగ్గును ఉత్పత్తిని రిలే–బీ కార్మికులు సాధించి ఆల్‌టైం రికార్డును నెలకొల్పారు. అధిక ఉత్పత్తిని సాధించి ఆల్‌టైం రికార్డు సాధించడంపై ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవీ నరసింహారావు, మేనేజర్ వెంకటేశ్వరరావు రిలే–బీ కార్మికులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని పీవో నరసింహారావు కార్మికులను కోరారు. కార్యక్రమంలో ఇంజినీర్లు వీరప్రసాద్, మాధవరావు, జగదీశ్, బీ–రిలే ఇన్‌ఛార్జి పి.శ్రీనివాస్, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి గద్దే మురళీకృష్ణ, సంక్షేమాధికారి విజయ్‌సందీప్, కార్మికులు పాల్గొన్నారు.

బాణాపురంలో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో బాణాపురం గ్రామంలో రెండో దశ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ సామినేని హరిప్రసాద్ బుధవారం లాంఛనీయంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వల్లభి పిహెచ్సి వైద్యాధికారి కే ధర్మేందర్, గ్రామసర్పంచ్ అవుల రమలక్ష్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పచ్చా నాగమణి, గ్రామ ఉపసర్పంచ్ చింతకాయల రామారావు, బిఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి గడ్డం వెంకట్ గౌడ్, నాయకులు పచ్చా సీతారామయ్య పాల్గొన్నారు.

ఎంఎల్‌ఏ కందాళ ఆర్థికసాయం

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలోని మల్లేపల్లి గ్రామంలో బుధవారం మృతిచెందిన దార వీరభద్రం, అదెమ్మ కుటుంబాలను ఎంఎల్ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు రూ.10వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

నవతెలంగాణ - అశ్వారావుపేట

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని మండల ఎన్నిక అధికారి, తహశీల్దార్ చల్లా ప్రసాద్ నేతృత్వంలో బుధవారం అశ్వారావుపేట లో ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఇదే పాఠశాల విద్యార్థుల చేత ముగ్గులు పోటీలు నిర్వహించారు. అనంతరం ఓటు విలువ,ప్రాధాన్యత అంశాల నినాదాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు జాతీయ ఎన్నికల కమీషన్ చేత విడుదలైన ఓటు ప్రాధాన్యత గీతాన్ని అందరూ ఆలపించారు. చివరిగా నిర్వహించిన ఓటు ప్రతిజ్ఞ కార్యక్రమానికి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని ప్రతిజ్ఞ చేసారు. ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినిలు కు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎం.డి.ఒ విద్యాధర రావు,ఎం.ఇ.ఒ క్రిష్ణయ్య, ఎఫ్ఆర్ఒ అబ్దుల్ రహ్మాన్, ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, సిఆర్‌పి ప్రభాకరాచార్యులు, నాయకులు యు.ఎస్ ప్రకాశ్, మందపాటి రాజమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవ అవగాహన ర్యాలీ

ములకలపల్లి : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వీరభద్రం ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత, గ్రామస్థులు, ఓటర్లతో కలిసి మండల కేంద్రంలో ఓటరు దినోత్సవ ఆవశ్యకతను తెలియచేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు అనేది ఎంతో విలువైనదని, 18 ఏళ్లు దాటిన యువతీ, యువకులు ఖచ్చితంగా ఓటు నమోదు చేసుకుని ఓటును వజ్రాయుధంగా మలుచుకోవాలని, ఓటరులారా మేలుకోండి, మంచి నిజాయితీ కలిగిన నాయకుడిని ఎన్నుకోండి అంటూ నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. అనంతరం ఓటర్లతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐతో పాటు హైస్కూల్ హెచ్ఎం, బీఎల్ఓలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలి- తహశీల్దార్

దుమ్ముగూడెం : 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరు విధిగా ఓటు హక్కు కలిగి ఉండాలని తహశీల్దార్ కె చంద్రశేఖర్ అన్నారు. బుదవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏజిహెచ్ఎస్ రేగుబల్లి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి లక్ష్మీనగరం సెంటర్లో మానవహారం నిర్వహించారు. దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎల్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి దుమ్ముగూడెం సెంటర్లో మానవహారం నిర్వహించారు. నడికుడి గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో డి కొత్తగూడెం గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. బండారుగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రతాప్, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయురాలు ధనసరి నాగమణి, బెక్కంటి శ్రీనివాసరావు, ఏజె ప్రభాకర్, సర్పంచ్‌లు తెల్లం రామకృష్ణ, కాటబోయిన వెంకటేశ్వరావు, మడి రాజేష్‌తో పాటు పంచాయితీ కార్యదర్శులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై వాలంటీర్లకు శిక్షణ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని తూరుబాక గ్రామంలో బుధవారం చైల్డ్ ఫండ్ ఇండియా, లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో వాలంటీర్లకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్ మధుబాబు మాట్లాడుతూ...హెచ్ఐవి ఎలా సోకుతుంది, వ్యాధి లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. లింక్ వర్కర్ జరినా మాట్లాడుతూ.. సుఖ వ్యాధులు, లైంగిక వ్యాధులపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవి సోకిన వారిని ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తూరుబాక ఉపసర్పంచ్ బొల్లి సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి రవి, అంగన్వాడీ కార్యకర్తలు విజయనిర్మల, వనలజాక్షి, సరళ, వీరాకుమారితో పాటు వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రేస్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో వితంతువులకు చీరెలు పంపిణీ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఖమ్మం గ్రేస్ మినిస్ట్రీ (జిఎస్ఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వితంతువు మహిళలకు చీరలు, బియ్యం నిత్యవసరాలను అందజేసినట్లు సంస్థ ప్రతినిధి తూంపెల్లి ఏసురాజు తెలిపారు. మండలంలోని ములకపాడు, ఆర్లగూడెం, దబ్బనూతుల, చిన్నబండిరేవు గ్రామాలకు చెందిన సుమారు 300 వందల మంది పేద వితంతువు మహిళలకు స్థానిక ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సైదులు, జయరాజు, అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

గౌరవరం జిపి ఆధ్వర్యంలో ఆటల పోటీలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గౌరవరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిపి రేసు లక్ష్మీ, సర్పంచ్ సోడి జ్యోతి, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి కణితి రాముడుతో పాటు పాటశాలలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపులో గుండెపోటు తో వ్యక్తి మృతి

నవ తెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని గొమ్మూరు ఇసుక ర్యాంపులో ట్రాక్టరు ఇసుక లోడింగ్‌కు వెళ్లిన కూలీ తీవ్ర అస్వస్థతకు గురై బుధవారం మృతి చెందాడు. బూర్గంపాడుకు చెందిన గోళ్ల పుల్లయ్య(55) గొమ్మూ రు ఇసుక ర్యాంపులో ట్రాక్టరు లోడింగ్ పని చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా ఆస్వస్థతకు గురయ్యాడు. దీంతో తోటి కూలీలు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడుకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వషయం తెలుసుకున్న జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత సందర్శించి నివాళి అర్పించారు.



ఏప్రిల్ 5 చలో ఢిల్లీ

నవతెలంగాణ-కొత్తగూడెం

ఏప్రిల్ 5వ తారీఖున జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి డి. వీరన్న అన్నారు. బుధవారం సీఐటీయూ ఆఫీసులో కొత్తగూడెం సిఐటియు పట్టణ కమిటీ సమావేశం భూక్య రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వీరన్న మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ, కార్మిక రైతు , వ్యవసాయ కార్మికులకు తీవ్ర నష్టం కలగజేసే విధంగా చట్టాలను తీసుకొస్తుందన్నారు. ఈ చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు వెంటనే మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి మోడీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ.. ఏప్రిల్ 5న జరిగే ఛలో ఢిల్లీలో కార్మికులు, కర్షకులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో కర్ల వీరస్వామి, సామెల్, దుర్గమ్మ, కళావతి, మాధవి, చంద్రన్న, రాజేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-ముదిగొండ



మాదాపురం నుండి కట్టకూరు వస్తున్న ఖమ్మంకు చెందిన ఓ(ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ మద్యం సేవించి అతివేగంగా వచ్చి కట్టకూరులో మూలమలుపు వద్ద బుధవారం రాత్రి విద్యుత్ స్తంభంతోపాటు, బొద్రాయిని, ఢీకొట్టగా,పూర్తిగా ధ్వంసంమై విద్యుత్ స్తంభం వంగిపోయి విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. బస్సులో స్కూలు విద్యార్థులు ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కట్టకూరు గ్రామానికి చెందిన చలమల గోపి,నల్లగొండ వీరాంజనేయులు ఇద్దరు స్కూల్ బస్ డ్రైవర్ లే,వీరికి ప్రాణాపాయం తప్పింది. విద్యుత్తు లేక గ్రామ ప్రజలు చీకట్లో ఉన్నారు.కాగా మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ అతివేగమే ఈప్రమాదానికి కారణమని గ్రామస్తులు తెలిపారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

పాల్వంచ : 74వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఐడిఓసి కార్యాలయం సర్వం సిద్ధమైంది. గురువారం ఐడిఓసి ప్రాంగణంలో 10 గంటలకు కలెక్టర్ అనుదీప్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించను న్నారు. తదుపరి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఉదయం 9 గంటలకు ఐడిఓసి కార్యాలయానికి విచ్చేయాలని డిఆర్ఓ అశోక్ చక్రవర్తి తెలిపారు.

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

- బదిలీల్లో రెండు సంవత్సరాల కనీస
- సర్వీసు నిబంధన సడలించాలి

పండితులు, పిఈటిలకు

-అందరితోపాటే పదోన్నతులు అమలు చేయాలి

- జిఓ 317 బాధితులందరికీ న్యాయం చేయాలి.

- విలేకరుల సమావేశంలో

టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చావ రవి



నవతెలంగాణ-పాల్వంచ

ఐదేళ్ళ తర్వాత జరుగుతున్న బదిలీలు, ఎనిమిదేళ్ళ తర్వాత జరుగుతున్న పదోన్నతులు పారదర్శకంగా నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు అనుకూలంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. బుధవారం పాల్వంచ టిఎస్ యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ..... బదిలీల్లో ఉపాధ్యాయులు అందరూ దరఖాస్తు చేసుకునే విధంగా పాఠశాలలో కనీసం రెండు సంవత్సరాలు సర్వీసు ఉండాలనే నిబంధనను సడలించి జిఓ 317 ద్వారా ఇతర జిల్లాలకు కేటాయించబడిన ఉపాధ్యాయులందరికీ బదిలీకి అవకాశం ఇవ్వాలని, గత బదిలీల్లో ఇచ్చినట్లు ఉపాధ్యాయుల సర్వీసు సీనియారిటీకి పాయింట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్‌గ్రేడ్ చేసిన 10479 పోస్టుల్లో న్యాయ వివాదాలను పరిష్కరించి పండిట్, పీఈటిలకు ఇతర స్కూల్ అసిస్టెంట్స్ తో సమానంగా పదోన్నతులు అమలు చేయాలని, జిఓ 317 ద్వారా విడిపోయిన దంపతులకు స్పౌజ్ బదిలీలు నిర్వహించాలని, స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను దశలవారీగా స్వంత జిల్లాలకు వచ్చే అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు అందరికీ నగదురహిత వైద్యం ప్రభుత్వమే అందించాలని, ఏజెన్సీ అలవెన్సులు, వికలాంగుల కన్వేయన్సు అలవెన్సులు తదితర పిఆర్సీ అనుబంధ జిఓలు విడుదల చేయాలని, పిఆర్సీ బకాయిలు, సప్లిమెంటరీ బిల్లులు జాప్యం లేకుండా మంజూరు చేయాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయాలని, కెజిబివి ఉద్యోగులకు బేసిక్ పే అమలు చేయాలని, గురుకులాల్లో ఉపాధ్యాయులపై వత్తిడి తగ్గించాలని, పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని చావ రవి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ కృష్ణ, జిల్లా కోశాధికారి ఎస్ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి మల్లెంపాటి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్కే.యాకూబ్ పాషా,మండల అధ్యక్షులు కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం : ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్‌లు ఇతర విద్యారంగ విషయాలను వివరిస్తూ ఉపాధ్యాయుల బదిలీలకు 0 సర్వీస్ ను అనుమతించాలని, కోర్టు తీర్పుకు లోబడి ఉండేలా పండిట్, పిఈటిలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రొమోషన్స్ ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. మండలంలోని మల్లెలమడుగులో జరిగిన యూటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ కృష్ణ, కోశాధికారి ఎస్.వి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయ భాస్కర్, రాజారావు, మండల ఉపాధ్యక్షులు ఐలయ్య, మండల సీనియర్ నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆహారం తయారీలో నాణ్యత పాటించాలి

భవనం నిర్మాణం పనులు శీఘ్రంగా చేయాలి

మధ్యాహ్నం భోజనం, నిర్మాణం పనులు తనిఖీ చేసిన ఎమ్మెల్యే మెచ్చా

నవతెలంగాణ - అశ్వారావుపేట

విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్నం భోజనం తయారీలో నాణ్యత పాటించాలని, రుచిగా వండి, శు చిగా వడ్డించాలని ఎమ్మెల్యే మిత్ర సేన వంట నిర్వాహకులకు సూచించారు. అశ్వారావుపేటలో ఆయన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆకస్మికంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశించి మధ్యాహ్నం భోజనంను తనిఖీ చేసారు. భోజనం, కూరలు క్షుణ్ణంగా పరిశీలించారు. అదే పాఠశాలలో నిర్వహిస్తున్న మన ఊరు మన బడి పథకంలో చేపట్టిన భవన నిర్మాణ పనులను తనిఖీ చేసారు. రాజీ పడకుండా పనులు నిర్వహించాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ శ్రీరామమూర్తి, ఎండిఒ విద్యాధర రావు, ప్రధానోపాధ్యాయులు నరసింహ రావు, యుఎస్ ప్రకాశ్ లు ఉన్నారు.

మండలంలో ఎమ్మెల్యే విస్తత పర్యటన

ములకలపల్లి : అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ములకలపల్లి మండలంలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత చాపరాలపల్లి గ్రామంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గుట్టగూడెంలో శ్రీశ్రీశ్రీ సీతారామచంద్రస్వామి ఆంజనేయ దేవ ధ్వజ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు తెలుసుకుని 1 పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. యూనియన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరగా దీనికి స్పందించిన ఎమ్మెల్యే మెచ్చా తహశీల్దార్కు సిఫార్సు చేశారు. సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడం నా బాధ్యత అని, ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి నేనున్నానంటూ ప్రజలకు ఎమ్మెల్యే మెచ్చా భరోసా కల్పించారు. అనంతరం గుట్టగూడెం పంచాయతీ



సర్పంచ్ "రాజు సతీమణి ఇటీవల ప్రమాదంలో గాయపడగా అక్కడకు వెళ్లి పరామర్శించారు. అలాగే మండల కేంద్రంలో చిక్కుమళ్ల సుధాకర్ తండ్రి ఇటీవల మృతిచెందగా ఆయన నివాసానికి వెళ్లి బిక్కుమళ్ల తండ్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సంతాపం, సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, సర్పంచ్ లు, మండల నాయకులు , కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలులో రిమోట్ కాటాతో మోసం

పోలీసుస్టేషన్లో బాధిత రైతుల ఫిర్యాదు

నవతెలంగాణ-ములకలపల్లి

పత్తి కొనుగోలు విషయంలో రిమోట్ కాటాతో రైతులను మోసం చేసిన సంఘటనపై బాధిత రైతులు బుధవారం ములకలపల్లి పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని రాచన్నగూడెం పంచాయతీ పరిధిలోని మోటుగూడెం, పాత జిన్నెలగూడెం గ్రామాల రైతులు వర్మిక రమేష్, కేసరి ప్రసాద్, పాయం సురేష్, కుంజా ప్రభుకుమార్, మిడియం వీరస్వామి, కుంజా కృష్ణ, మీడియం రాజు. మిడియం ఆదినారాయణ, కుంజా రాజేష్, కొర్సా వెంకటేష్, మిడియం గోపాలరావులు పత్తి కొనుగోళ్లలో మోసం జరిగిందని ఆరోపించారు. గత 15 రోజులుగా గొడ్ల వెంకటేశ్వర్లు, గొడ్ల సత్యం, పులి వెంకన్న మరికొందరు కలిసి మా గ్రామాల్లో తిరుగుతూ పత్తి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. గత వారం మా గ్రామాల్లో రైతుల వద్ద పత్తిని కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. బుధవారం కంప్యూటర్ కాటాపై అనుమానం వచ్చి వారిని ప్రశ్నించడంతో పాటు జేబుల్లో వెతకగా రిమోట్ కంట్రోలర్ దొరికిందని చెప్పారు. ఎందుకు మోసం చేస్తున్నారని ప్రశ్నిస్తున్న క్రమంలో మాకు సమాధానం చెప్పకుండా వారు వచ్చిన వాహనాల్లో పారిపోయినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు 100 క్వింటాళ్ల మోసం జరిగినట్లు తెలుస్తుందని అంటే సుమారు రూ.8లక్షల మోసం జరిగిందని గుర్తించారు. మాకు న్యాయం చేయాలని బాధిత గ్రామాల రైతులు కోరుతున్నారు.



ఇంజనీరింగ్ కాలేజీ అభివృద్ధికి కమిటీ ఏర్పాటు

కళాశాలను సందర్శించిన బృందం

మొదటి విడతలో రూ. 50 కోట్లు

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకతీయ యూనివర్సిటీ (కెఎస్ ఎం) కాలేజ్ అభివృద్ధి కార్యాచరణ చర్యలు వేగవంతం అయ్యాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు ఇటీవల కొత్తగూడెం సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన సభలో ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు కేటాయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ క్రమంలో ప్రభుత్వం కళాశాల అభివృద్ధికి కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ బుధవారం కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలని సందర్శించింది. ఈ సందర్భంగా కాలేజ్ అభివృద్ధికి సంబంధించిన పనులు, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కమిటీ లో కొత్తగూడెం కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సదానందం , వరంగల్ నీట్ ప్రొఫెసర్ లతీఫ్ , రిటైర్డ్ ప్రొఫెసర్ బి.శేష శ్రీనివాస్, కాలేజ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అశ్వారావుపేటలో 429 మందికి పరీక్షలు

నవతెలంగాణ - అశ్వారావుపేట

మండల వ్యాప్తంగా ఉన్న మూడు కంటి వెలుగు పరీక్షా కేంద్రాల పరిధిలో బుధవారం మొత్తం 429 మందికి పరీక్షలు నిర్వహించినట్లు అశ్వారావుపేట(వినాయక పురం),గుమ్మడవల్లి పి. హెచ్.సి వైద్యాధికారులు డాక్టర్ రాందాస్,డాక్టర్ మధుళిక లు తెలిపారు. ఇందులో 105 మందికి కళ్ళద్దాలు పంపిణీ చేసి దూరదృష్టి ఉన్న 48 మందికి కళ్ళద్దాలు కు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

ఆయుర్వేదం ఒక జీవన విధానం

-మరుగునపడుతున్న వైద్యాన్ని బయటికి తీసుకువద్దాం

నవతెలంగాణ-కరకగూడెం



మరుగునపడుతున్న ఆయుర్వేదాన్ని బయటికి తీసుకురావాల్సిన అవసరం ఎంతో ఉందని స్థానిక ఆయుర్వేద వైద్యులు, ట్రెడిషనల్ హీలర్ షేక్ సోందు పాషా అన్నారు. బుధవారం ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్టంలోని తిరుపతిలో గత మూడు రోజులుగా జరుగుతున్న 'జాతీయ పారంపర్య వైద్యుల మహాసభలో' పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో విశిష్టత కలిగిన ఆయుర్వేదంపై నేటి సమాజానికి అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ప్రతీ ఒక్క ఆయుర్వేద వైద్యులపై ఉందని అన్నారు. అంతేకాకుండా పారంపర్య వైద్యులందరూ ఏకతాటిపైకి వచ్చి ఆయుర్వేదంను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఆయుర్వేదం గొప్పతనం గురించి వివరిస్తూ.. నిత్య జీవితంలో మానవుడు ఆరోగ్యంగా ఉండాలంటే నిర్మలమైన మనస్సు, శక్తివంతమైన శరీరం ప్రధానం. మనస్సును శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకొని దీర్ఘకాలం జీవించడానికి అవసరమైన జ్ఞానాన్ని ఆయుర్వేదం అందిస్తోందన్నారు. మన రాష్ట్రంలోనే కాదు, దేశ విదేశాల్లో ఆయుర్వేదానికి ఆదరణ లభిస్తోంది. మనిషి రోగాల బారిన పడకుండా ఆరోగ్యకరంగా జీవించడానికి అవసరమైన విధి విధానాల్ని ఆయుర్వేదం నిర్దేశిస్తోందని ఆయుర్వేదం అనేది ఒక జీవన విధానంమని ప్రసంగించారు.

దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-పాల్వంచ

లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్ పాల్వంచ అధ్యక్షుడు లయన్ చాట్ల శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంకు రూ.4వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ చాట్ల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మ స్థైర్యం తో ముందుకు వెళ్ళాలని, పట్టుదలతో దేనినైనా సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ లయన్ పోట్రు సతీష్, డిస్ట్రిక్ 320 ఈ చైర్మెన్ లయన్ ఆరుద్ర సత్యనారాయణ, లయన్ రోశయ్య చౌదరి, లయన్ పుట్టా నాగేశ్వరరావు, మరియు లయన్ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.



మొక్కలు పెంచడానికి చర్యలు చేపట్టండి

నిర్లక్ష్యం చేస్తే వేతనాలు నుంచి రికవరీ చేస్తాం

మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ఆదేశం

నర్సరీల నిర్లక్ష్యంపై ఆగ్రహం

నవతెలంగాణ-పాల్వంచ

మున్సిపాల్టీలలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో 10 రోజుల్లో మొక్కలు పెంచడానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. బుధవారం ఓసి కార్యాలయంలో పట్టణ ప్రగతి కార్యక్రమాలపై మున్సిపల్ చైర్మన్లు పట్టణ ప్రగతి ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైకుంఠ ధామాలు, క్రీడా ప్రాంగణాలు, సమీకృత మార్కెట్లు, నర్సరీల్లో మొక్కలు పెంపకం, ఇంటి పన్నులు, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణ, పట్టణ ప్రకృతి వనాలు నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న హరితహారంలో మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని చెప్పినప్పటికీ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీల్లో పెంచిన మొక్కలనే హరితహారంకు వినియోగించాలని, బయటి నుండి కొనుగోలు చేయడానికి అంగీకరించనని స్పష్టం చేశారు. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు ప్రక్రియను పర్యవేక్షణ చేయుటకు మున్సిపల్ సిబ్బందిని ప్రత్యేక అధికారులుగా నియమించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. బృహత్ పట్టణ వనాల్లో మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు.

కొత్తగూడెం మున్సిపాల్టీ పరిధిలోని రామచంద్ర కళాశాల మైదానంలో పార్కు ఏర్పాటు పనులను తక్షణం చేపట్టాలని చెప్పారు. చేపట్టిన పనులు పరిపూర్ణంగా పూర్తి చేయాలని, అసంపూర్తిగా చేయొద్దని ఆయన స్పష్టం చేశారు. కొత్తగూడెం బస్టాండు నుండి పోస్టాఫీస్ వరకు ఏర్పాటు చేయనున్న డ్రైనేజి నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని చెప్పారు. రామవరంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ నిర్మాణంలో ఎందుకు జాప్యం జరుగుతున్నదని, 10 రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. పనుల్లో జాప్యం జరిగితే వేతనాలు నుండి రికవరీ చేసిస్తానని టిఎస్ఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంటి పన్నులు వసూళ్లను సమీక్షించిన కలెక్టర్ ఫిబ్రవరి 15వ తేదీ నాటికి లక్ష్యం మేర పన్నులు వసూళ్ల పూర్తి చేయాలని చెప్పారు. గత సంవత్సరం ఇంటి పన్నులు వసూళ్ల నూరు శాతం చేశామని, సమీక్షలో రాష్ట్ర ముఖ్యమంత్రి అభినందించారని ఈ సంవత్సరం నూరు శాతం పూర్తి చేయాలని చెప్పారు. డంపింగ్ యార్డులను పట్టణ ప్రగతి ప్రత్యేక అధికారులు తనిఖీ చేసి వ్యర్థాలు ఎంత వస్తున్నాయి, వర్మి ఎంత వస్తున్నది నివేదికలు అందచేయాలని చెప్పారు. డంపింగ్ యార్డులు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. కొత్తగూడెం, పాల్వంచలలో గ్రంథాలయ ఏర్పాటు వివరాలను మున్సిపల్ కమిషనర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కొత్తగూడెం, ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్, చైర్మెన్ కాపు సీతాలక్ష్మి, డి వెంకటేశ్వర్లు, పట్టణ ప్రగతి ప్రత్యేక అధికారులు అర్జున్, డా పురందర్, అలీం, మున్సిపల్ కమిషనర్లు, డిఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ఆడబిడ్డలకు పెద్దన్నగా కేసీఆర్ : ఎమ్మెల్యే వనమా

కల్యాణ లక్ష్మీ, షాదీ ముభారక్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ ఆడబిడ్డలకు పెద్దన్నగా కెసిఆర్ అండగా ఉన్నాడని కొత్తగూడెం నియోజకవర్గం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. పాల్వంచ లోని వనమా కార్యాలయంలో బుధవారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలానికి సంబంధించిన సుమారు ఒక కోటి పది లక్షల రూపాయల విలువ గల 110 చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే వనమా తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమా మాట్లాడుతూ పేదోళ్ల ఆడపిల్లలకు పెద్దన్న ముఖ్యమంత్రి కేసీఆర్ అని, తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా, ఏ రాష్ట్రంలో అమలు కావట్లేదని, కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోనా, సర్పంచ్లు అజ్మీరా భారతి, కొరెం చంద్ర శేఖర్, జోగ బక్కయ్య, వర్సా వసంత రావు, కొత్తగూడెం డివిజన్ ఆత్మ కమిటీ డైరెక్టర్లు శేషాద్రి వినోద్, పొగాకు వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి తాసిల్దార్ నాగరాజు, ఆర్ఐ నరసింహ రావు, టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత

జాతీయ ఓటర్ దినోత్సవం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

నవతెలంగాణ-అశ్వాపురం



ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరులు బాధ్యతగా స్వీకరించాలని ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. మండలంలో బుధవారం జాతీయ ఓటర్ దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ ప్రపంచ ప్రగతిని మార్చగల శక్తి ఓటు హక్కుకు ఉందన్నారు. వ్యవస్థ మార్పుకు నాంది పలికేదే ఓటన్నారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ కూడా ఓటును వినియోగించుకోవాలన్నారు. ఓటు ప్రతి పౌరుడు హక్కు, బాధ్యతగా స్వీకరించాలని ఈ సందర్భంగా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సూది రెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ కంచుకట్ల వీరభద్రం, తహసిల్దార్ సురేష్ కుమార్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రెండవ రోజుకు చేరిన ప్రీమియరీ

ఎక్స్ ప్లో జివ్స్ వర్కర్ల నిరవధిక సమ్మె

కార్మికులకు మద్దతు ప్రకటించిన సిపిఐ, ఏఐటీయూసీ

మణుగూరు : ప్రీమియరి ఎక్స్‌ప్లోజివ్ వర్కర్ల నిరవధిక సమ్మె రెండవరోజుకు చేరుకుంది. బుధవారం కార్మికుల సమ్మెకు సిపిఐ పార్టీ మణుగూరు మండల కార్యదర్శి జంగమోహన్రావు, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు ఆర్ లక్ష్మీనారాయణ, ఎఐటియుసి మండల కార్యదర్శి అక్కి నరసింహారావులు హాజరై మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయకుండా మేనేజ్ మెంట్ కాలయాపన చేస్తూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. కార్మికులకు రావాల్సినటువంటి న్యాయమైన హక్కులను యాజమాన్యం కాలరాస్తూ వారిని వెట్టి చాకిరి చేపిస్తుందని, నేడు కనీస అవసరాలు అత్యవసర వరకు సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుంటే చాలీచాలని వేతనాలతో కాలం వెళ్ళదీస్తున్నారని, ఎక్కడ చూసినా పేదవాడు కార్మికుల పొట్ట కొట్టడమే యాజమాన్యాల తీరుగా మారిందన్నారు. ఇకనైనా యాజమాన్యం దిగివచ్చి కార్మికులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని వారు హెచ్చరించారు. అనంతరం సింగరేణి ఏజీఎం లలిత్ కుమార్‌కి ప్రీమియర్ ఎక్స్ ప్లో జివ్ కార్మికుల సమస్యల వివరించి, పరిష్కరించాలని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఏఐటియుసి మండల అధ్యక్షలు తోట రమేష్, వార్డు మెంబర్లు వజ్రా వెంకటేశ్వర్లు కనితి సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యులు సర్వర్, సొందే కుటుంబరావు, మంగి వీరయ్య, కార్మికులు ఎర్రయ్య యాకయ్య, బుచ్చి రాములు అశోక, బాబురావు నరసింహారావు, మాధవరావు బాబురావు, కార్మికులు, తదితరులు, పాల్గొన్నారు.


అనుదినం..జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం 26 జనవరి 2023

మన ఊరు మన బడి పనుల్లో వేగం పెంచాలి

పంచాయతీరాజ్ ఈఈ సుధాకర్

నవతెలంగాణ-చంద్రుగొండ

మన ఊరు మనబడి పనుల్లో వేగం పెంచాలని పంచాయతీరాజ్ శాఖ ఈఈ సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం బెండలపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మన ఊరు మనబడి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ కింద నిర్మించిన మరుగుదొడ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ కల్లా పనులు పూర్తి చేయాలని లేకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఈ శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-దమ్మపేట

పట్వారీగూడెంగ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం క్రీడాకరులను పరిచయం చేసుకొని వారితో ఉత్సాహంగా వాలీబాల్ ఆడి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డాకుల రాజేశ్వరరావు, కొయ్యల అచ్యుత్ రావు, ఎంపిటిసి కూరం కమల, సర్పంచ్ మొగిలి అంజలి, వెటర్నరీ డాక్టర్ మన్యం రమేష్, ఉప సర్పంచ్ రెడ్డిమల్ల నాగయ్య, సోడెం గంగ రాజు, కట్టం ఎర్రప్ప ఉన్నారు.

ఆటో యూనియన్ ఎన్నిక ఏకగ్రీవం

నవతెలంగాణ-చంద్రుగొండ

చంద్రుగొండ అడ్డా ఆటో యూనియన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. బుధవారం రావి చెట్టు సెంటర్లో ఏర్పాటుచేసిన ఆటో యూనియన్ సభ్యులు సమావేశంలో మండలం కమిటీ అధ్యక్షునిగా ఇనుముల పిచ్చయ్య, ఉపాధ్యక్షులు ఎస్కే అన్వర్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి రెడ్డి పోగు రవి, ఆర్గనైజర్ ఎస్ ఆసిఫ్, కోశాధికారి కాకటి జగన్నాథం, సహాయ కార్యదర్శిగా కోండ్రు నాగరాజు, బోడ జగదీష్, సలహాదారులుగా నెక్కడు రామారావు, కిలారి వెంకటేశ్వర్లు, ఆటో యూనియన్ సభ్యులు, సీనియర్ డ్రైవర్లు పాల్గొన్నారు.

కులాంతర వివాహం

నవతెలంగాణ-ఇల్లందు



కోడి ప్రశాంత్ యాదవ్, దళిత యువతి వేమూరి జ్యోతిలు ఇల్లందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దళిత, యాదవ సంఘం, బీఆర్ఎస్ పార్టీ నేతల ఆధ్వర్యంలో మంగళవారం రిజిస్టర్ మ్యారేజ్ జరిగినట్లు ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు టేకుమట్ల దుర్గాప్రసాద్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని స్థానిక 12 వార్డు ఎస్సీ కాలనీ చెందిన వేమూరి జ్యోతి, 1వార్డుకు చెందిన కోడి ప్రశాంత్ గత 9 సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకోనని కోడి ప్రశాంత్ యాదవ్ నిరాకరించిన నేపథ్యంలో బుధవారం ఇరుపక్షాల కుటుంబ సభ్యులు 12వ వార్డు ఎస్సీ కాలనీ లో దళిత సంఘాల కుల పెద్ద మనుషులు స్థానిక కుల పెద్ద మనుషులు, యాదవ సంఘం కుల పెద్దలు, బీఆర్ఎస్ పార్టీ మహిళా నేతలు కలిసి మాట్లాడి ప్రేమికులను కలిపి, దళిత ఆ యువతిని పెళ్ళి చేసుకోవాలని అబ్బాయికి, వారి తల్లిదండ్రులకు, సూచించగా వారు కూడా ఒప్పుకోవడం జరిగినది. అనంతరం వారిద్దరికీ ఇల్లందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహం జరిపించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-చంద్రుగొండ

అనుమానాస్పద దుస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీస్ కథనం ప్రకారం వివరాలు ఎలా ఉన్నాయి. అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన మాలోతు శ్యామ్ కుమార్ రూప దంపతులకు ఒక కుమార్తె లాస్య, కుమారుడు సోను సంతానం కలరు. వీరు కూలి పనులు చేసుకుని కిరాయి ఇంట్లో ఉంటున్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ మద్యం తాగిన విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి సైతం భార్యాభర్తలు గొడవ పడగా పక్కన గల గ్రామస్తులు ఇరువురిని మందలించారు. భర్త కొడుతున్నాడని భయంతో భార్య తన పిల్లలను వెంటబెట్టుకొని బయటికి వెళ్ళింది. తిరిగి మంగళవారం తెల్లవారుజామున ఇంటికి రాగా అపస్మారక స్థితిలో ఉన్న భర్త శ్యాం కుమార్‌ను చూసి 108కి ఫోన్ చేసి కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. ఆసుపత్రికి వెళ్లే క్రమంలో భర్త చనిపోయాడని భార్య రూప తెలిపింది. వీరిది ప్రేమ వివాహం. నా కుమారుడు మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని తండ్రి మాలోత్ బాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఆదివాసీ చట్టాలను కాపాడే దిశగా ఉద్యమించాలి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఆదివాసీ జాతి మనుగడ కోసం చట్టాలను కాపాడుకునేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఎస్పి డివిజన్ అధ్యక్షులు సోంది మల్లూరు పిలుపునిచ్చారు. బుధవారం చిన కమలాపురం గ్రామంలో కోరం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీల గుండె కాయ లాంటి చట్టాలకు కొంతమంది గిరిజనేతరులు ఏజన్సీవాసులకి అండగా ఉంటున్న చట్టాలపై కుట్రలు చేసే ప్రయత్నాలను చేస్తున్నారని ఆయన అన్నారు. ఆదివాసీ చట్టాల రక్షణకు పోరాటం చేయకపోతే రానున్న రోజుల్లో జాతి మనుగడకు ముప్పు కలిగే పరిస్థితి ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నటువంటి ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు మన ఆదివాసీల జీవన విధానాన్ని అనుసరించి భారత రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలకు భంగం కలిగిస్తే సహించేది లేదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీలు జీవో నెం 3 ప్రకారం ఉన్నటువంటి రిజర్వేషన్ ద్వారా ఆదివాసీ నిరుద్యోగులు ఉద్యోగాలు పొందేది చూసి ఓర్వలేక ఒక గిరిజనేతరుడు కుట్ర చేసి సుప్రీం కోర్టు లో కేసు వేసి కొట్టు వేయించి ప్రయత్నం చేయగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జీవో నెం.3పై రీపిటిషన్ వేసి ఆపుదల చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇకనైనా మన చట్టాలను కాపాడు కోవడం కోసం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివాసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు సోయం వినోద్, కుర్సం మహేష్, తుర్స చంటి, కనితి దర్మరాజు, వెంకట్, రామకృష్ణ ప్రసాద్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని అధికారులు పట్టించుకోవాలి

నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలోని అమ్మగారి పల్లి పంచాయతీ లోగల కుమ్మరిగూడెం గ్రామంలో ప్రభుత్వం చూపించిన క్రీడా మైదానంపై అధికారులు దృష్టి సారించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మోకాళ్ళ రమేష్ అన్నారు. కుమ్మరిగూడెం గ్రామంలో ప్రభుత్వ భూమిని గుర్తించిన తహశీల్దార్ క్రీడా మైదానం పనులు ప్రారంభించారన్నారు. కానీ క్రీడా మైదానం పూర్తికాకుండానే ఆపివేయడం జరిగిందన్నారు. ఆ క్రీడామైదానంలో యువత వారి సొంతంగా వాలీబాల్ కోర్టు, క్రికెట్ నెట్ ప్రాక్టీస్ ప్రతిరోజు ఉదయం సాయంత్రం ఆడుతున్నారన్నారు. క్రీడా మైదానంలో తక్షణమే అన్ని ఏర్పాట్లు చేయాలని లేకుంటే గ్రామం యువత అందరితో కలసి కలెక్టర్ దగ్గర వెళ్లి విషయాన్ని వివరిస్తామన్నారు. క్రీడా మైదానం పూర్తయ్యే వరకు పోరాడతామన్నారు.

265 కేజీల గంజాయి పట్టివేత

ఇరువురు అరెస్టు



బూర్గంపాడు :మండలంలో పోలీసులు బుధవారం భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పాల్వంచ డీఎస్పీ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఐ పి.సంతోష్, తన సిబ్బందితో కలిసి మోరంపల్లి బంజరలో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అనుమానాస్పదంగా ఉన్న మినీ లారీని గుర్తించారు. ఆ వాహనాన్ని ఆపి తనిఖీలు చేయడంతో గంజాయి అక్రమ రవాణా విషయం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యానులో 125 ప్యాకెట్లలో ఉన్న 265.745 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.53 లక్షల 15వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న మహారాష్ట్రకు చెందిన మహాదేవ్ మోహన్, కృష్ణ కాళిదాస్ పవార్ నిందితుల అరెస్ట్ చేసినట్లు డీఎస్పి తెలిపారు. అదేవిధంగా వ్యాన్ ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మరో ఇరువురు పరార్ లో ఉన్నారని వారిని కూడా పట్టుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ గంజాయిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చింతూరు నుంచి తరలిస్తుం డగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ నాగరాజు, బూర్గంపాడు ఎస్సై పి.సంతోష్, అదనపు ఎస్సై రమణారెడ్డి, పాల్గొన్నారు.

ఓటరు ఎలాంటి ప్రలోభాలకు గురికాకూడదు









- **నిష్పక్షపాతంగా ఓటు వినియోగించుకోవాలి**
- **కలెక్టర్ అండ్ జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్**

నవతెలంగాణ-కొత్తగూడెం

ఓటరు ఎలాంటి ప్రలోభాలకు గురికాకూడదని, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అండ్ జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయం నుండి పోస్టాఫీసు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారం నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని గిరిజనులను, యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఓటరుగా నమోదు చేశామని చెప్పారు.

ఓటు హక్కు సామాన్యుడి చేతిలో బ్రహ్మ అస్త్రం

దమ్మపేట : సామాన్యుడు చేతిలో ఓటు హక్కు బ్రహ్మాస్త్రం వంటిది అని దమ్మపేట తాసిల్దార్ స్వామి స్పష్టం చేశారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా దమ్మపేట జెడ్‌పిఎస్ఎస్ పాఠశాల విద్యార్థులచే పట్టణంలోని ప్రధాన రహదారిలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి అనంతరం పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సభలో స్వామి మాట్లాడుతూ ఓటును దాని ఆవశ్యకత అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోకూడదని చెప్పారు. అనంతరం ఓటర్ల దినోత్సవం సందర్భంగా జరిగినటువంటి ముగ్గుల పోటీతోపాటు వ్యాసరచన, డిబేట్ కాంపిటీషన్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ మన్యం రమేష్ బాబు ఓటు విలువను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ ధారా మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

నవతెలంగాణ-చంద్రుగొండ

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కలిగి ఉండటం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని తాసిల్దార్ వరస రవికుమార్ అన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో మహిళలు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అధికారులు ఓటర్లచేత తాసిల్దార్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతి యువకులకు కచ్చితంగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ ఎల్ ప్రసన్న, ఆర్ఐ ముత్తయ్య కార్యాలయ సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

ఓటు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం

ఇల్లందు : ఎంతో విలువైన ఓటు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం వంటిందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరంగం రామలింగేశ్వర రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్ తొర్తి జాన్ ఆధ్వర్యంలో కళాశాలలో జాతీయ ఓటర్స్ దినోత్సవంనిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది తో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విలియం ప్రసాద్ ,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం లాంటిది

- ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-పినపాక

జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని పినపాక జూనియర్ కళాశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పినపాక విద్యార్థులు పినపాక మండల కేంద్రంలో గల తాసిల్దార్ కార్యాలయం నుండి ఈ బయ్యారం క్రాస్ రోడ్డు వరకు రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీని నిర్వహించారు. స్థానిక ఎంపీపీ గుమ్మడి గాంధీ స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటు అనేది ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం లాంటిదని వివరించారు. 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కును నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు అత్యంత కీలకమైందని, ఈ ఓటుతో అవినీతిని అంతంచేసి నీతివంతమైన పాలన అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, వీరభద్రం, ఎంపీటీసీ చింతపండు సత్యం, ప్రజా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును ధైర్యంగా సద్వినియోగం చేసుకోవాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ యర్నం

నవతెలంగాణ-పాల్వంచ

ప్రతి ఒక్కరూ ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును ధైర్యంగా సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ యర్నం చిన్నప్పయ్య అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవంను పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాల్వంచ నందు కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థిని విద్యార్థులు అందరితో ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీ జమ్మలమూడి అబ్రహం, కళాశాల లైబ్రేరియన్ శ్రీ పగిడి కత్తుల విజయకుమార్, కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ ఎకనామిక్స్ ఏ వెంకటేశ్వర్లు, ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీ సూరంపల్లి రాంబాబు, హిందీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పాల్గొన్నారు.

కెఎల్ఆర్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవం

నవతెలంగాణ-పాల్వంచ

జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా స్థానిక కేఎల్ఆర్ డిగ్రీ పీజీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులచే కళాశాల చైర్పర్సన్ నాగమణి ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే లక్ష్యం తథ్యం

- **86 శాతం పోలీసు ఉద్యోగాల తుది రాత పరీక్షకు ఎంపిక**
- **ఉచిత శిక్షణా తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో**

జిఎం షాలేము రాజు

నవతెలంగాణ-ఇల్లందు

పోటీ పరీక్షలలో కష్టపడి చదివితే లక్ష్యం తథ్యమని జిఎం షాలేము రాజు అన్నారు. సింగరేణి సేవా సమితి ఏరియా ఆధ్వర్యంలో పోలీస్ విభాగం ఉద్యోగాల నియామక తుది రాత పరీక్షకు బుధవారం శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి సేవా సమితి ద్వారా మొత్తం 120 మంది దేహదారుఢ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోగా క్రమం తప్పకుండా ఈ శిక్షణ తరగతులకు 100 మంది హాజరవగా అందులో 86 మంది తుది రాత పరీక్షకు ఎంపిక కావడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. కష్టపడి చదివితే మీ లక్ష్యాన్ని చేరుకుంటారని, ఏకాగ్రతతో శ్రమిస్తే, రాత రాత పరీక్షలలో తప్పక విజయం సాధించవచ్చునని అన్నారు. తదుపరి దేహదారుఢ్య శిక్షణ తరగతులకు శిక్షకుడిగా సేవలు అందించినటువంటి జేనులవుద్దిన్ సీనియర్ సెక్యూరిటీ గార్డును జిఎం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షులు పి.శ్రీనివాసు, డీజీఎం (పర్సనల్)జి.వి.మోహన్ రావు, డిజిఎం(ఫైనాన్స్) రామచంద్ర, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జి.శ్రీహరి, సెక్యూరిటీ ఆఫీసర్ అంజి రెడ్డి, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షులు ఎస్. రంగనాథ్ ఇతర అధికారులు మరియు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బొడ్డుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొనారు.



హాత్ సే హాత్ జోడో యాత్ర ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మణుగూరు



హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు గురిజాల గోపి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరంగల్‌లో జరిగిన రాహుల్ గాంధీ సంఘర్షణ సభలో ప్రవేశపెట్టిన వరంగల్ డిక్లరేషన్ ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ రైతు భరోసా కిందభూమి ఉన్న రైతుకి, భూమిలేని కౌలు రైతులకి ఎకరానికి 15వేల పంట పెట్టుబడి, వరి కి 2500, మొక్కజొన్నకి 2200, మిర్చికి 15000మద్దతు ధర, అన్ని పంటలకు మద్దతు ధర మేనిఫెస్టో లో ఉందని, సొంత ఇంటి నిర్మాణం కోసం 5 లక్షలు, పోడు రైతులకు యాజమాన్యపు హక్కు, క్రయవిక్రయాలు గురించి నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామంలో గడపగడపకి వెళ్లి ప్రజలకు, రైతులకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు పొలమరి రాజు, ముక్కెర లక్ష్మణ్, బూర్గుల కిరణ్ మోహన్, కంప రవి, షరీఫ్, నూరుద్దీన్, కిషన్ నాయక్, పులిపాటి పాపారావు, సత్తి, వంశీ, వంశీకృష్ణ, జనగాం సత్యనారాయణ, మామిడి శెట్టి నాగేష్, మాధవరెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పల్లెల రూపును మారుస్తున్న సీఎం కేసీఆర్...



- **సీసీ రోడ్ల ప్రారంభంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రేగా కాంతారావు**

నవతెలంగాణ-అశ్వాపురం

పల్లెల రూపురేఖలను మార్చి పల్లెల్లో అన్ని సౌకర్యాలు కల్పనే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పనిచేస్తున్నారని ప్రభుత్వ విప్ పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బుధవారం మండలంలోని గొల్లగూడెం, సీతారాంపురం గ్రామాలలో 15 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన మూడు సీసీ రోడ్లకు ప్రారంభోత్సవాలు చేసారు. అదేవిధంగా మొండికుంటలో తిప్పారెడ్డి నారాయణరెడ్డి సంతాప సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలనేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లెలలో మౌలిక సదుపాయాల కల్పన తోపాటు గ్రామాలను అన్ని రంగాలలో అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజల అభివృద్ధి కోసమే నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్క అండగా ఉండాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ముందుకు తీసుకువెళ్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సూది రెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ కంచుకట్ల వీరభద్రం, రైతు సమన్వయ కమిటీ నాయకులు గజ్జల లక్ష్మారెడ్డి, సర్పంచ్ మర్రి మల్లారెడ్డి ఎంపీటీసీ తాటి పూజిత, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోడి అమరేందర్, సూది రెడ్డి గోపాలకృష్ణారెడ్డి, పున్నారావు పాల్గొన్నారు.

నిరుపేద ఆపద్బాంధవుడు కేసీఆర్

మణుగూరు : నిరుపేదల ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని జడ్పిటిసి పోశం నర్సింహరావు అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు ఆర్ఎస్ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల ప్రకారం లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్దిదారులు అయినా భగత్ సింగ్ నగర్, పైలెట్ కాలనీ ఏరియాకు చెందిన మన్నూరు భాగ్యలక్ష్మి రూ.20,000, పైలట్ కాలనీ ఏరియా కి చెందిన జక్కుల సౌజన్య రూ.22,000, చిన్నాల వెంకటమ్మ రూ.60,000, వెన్నం శివకుమార్ రూ.18,000 ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వర రావు, బిఆర్ఎస్ పార్టీ మండల,టౌన్ అధ్యక్షులు ముత్యం బాబు, అడపా అప్పారావు, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొలిశెట్టి నవీన్, సీనియర్ నాయకులు తాళ్లపల్లి యాదగిరి గౌడ్, ఎడ్ల శ్రీనివాస్, షేక్ బాబ్జాని, ముద్దంగుల కృష్ణ, నూకారపు రమేష్, కొర్లకుంట అప్పారావు పాల్గొన్నారు.

బాలలకు స్నేహ పూర్వక న్యాయ సేవలు



- **జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి. శ్రీనివాసరావు**

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

రేపటి పౌరులైన నేటి బాలలకు స్నేహపూర్వకమైన న్యాయ సేవలను అందించటానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కట్టుబడి ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం న్యాయమూర్తి తనికెళ్లలోని గ్రేస్ పాఠశాలలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు, భ్రూణ హత్యలు, బాల కార్మిక వ్యవస్థ వంటి దురాచారాలు సమాజంలో బాలల అభ్యున్నతికి అడ్డుపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని నిర్మూలించడానికి ఎన్నో చట్టాలు ఉన్నప్పటికీ ప్రజలలో అవగాహన లేని కారణంగా అవి సమర్థవంతంగా అమలు కావటం లేదన్నారు. దీని కోసమే న్యాయ సేవా సంస్థల ఆధ్వర్యంలో విస్తృతంగా న్యాయ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలకి రోజు వచ్చే విద్యార్థులలో ఎవరైనా ఒకరు తరచుగా గైర్హాజరు అయితున్నప్పుడు తోటి విద్యార్థులు గమనించి న్యాయ సేవా సంస్థకు సమాచారం అందించాలని సూచించారు. అప్పుడు ఆ బాలుడి పరిస్థితిపై న్యాయ సేవ అధికార సంస్థ పరిశీలన జరుపుతుందన్నారు. ఒకవేళ సదరు విద్యార్థి బాల కార్మిక వ్యవస్థకు లేదా బాల్య వివాహాలకు లోనైనట్లయితే వారిని సంరక్షించి తిరిగి విద్యాసంస్థలో చేర్పించడం జరుగుతుందన్నారు. వరకట్న దురాచారం వల్ల సమాజంలో ఎన్నో అరాచకాలు జరుగుతున్నాయని వీటన్నిటికీ మూలమైన వరకట్నాన్ని నిషేధిస్తూ 1964లోనే చట్టం వచ్చినప్పటికీ సక్రమంగా అమలు జరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా న్యాయవాదులు ఇమ్మడి లక్ష్మీనారాయణ, జనార్ధన్, పాఠశాల ప్రిన్సిపల్ జాకోబ్, చైల్డ్ లైన్ డైరెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేట అభివృద్ధిలో తన కృషి ఎనలేనిది

తాత్కాలిక ప్రయోజనం కోసం పార్టీలు మార్చొద్దు....

మాజీ మంత్రి తుమ్మల

నవతెలంగాణ - అశ్వారావుపేట

అశ్వారావు పేట ప్రాంతం అభివృద్ధిలో తన కృషి ఎనలేనిదని, సమాజాభివృద్ధికి పాటు పడే వారిని రాజకీయాలకు అతీతంగా ఆదరించాలని మాజీ మంత్రి, తెరాస నాయకులు తుమ్మల నాగేశ్వరరావు హితవు పలికారు. అశ్వారావుపేటలో బుధవారం పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. అశ్వారావుపేటలో ఓ వివాహంలో, వినాయకపురంలో ఓ అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొని అనుచరులతో, పార్టీ కార్యకర్తలతో ఓ గంట సమయం గడిపారు. ఈ సందర్భంగా మంత్రిగా తాను అశ్వారావుపేట లో చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకున్నారు. అనంతరం చిలుకలు గండి ముత్యాలమ్మ దేవతను దర్శించుకున్నారు. దేవాలయ సిబ్బంది వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం పిఎసిఎస్ అధ్యక్షులు నిర్మల పుల్లారావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంక ప్రసాద్ రావు, బిర్రం వెంకటేశ్వరరావు, చందు వేణుగోపాల్, పాలవలస జీవన్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై 'రోటరీ' అవగాహన

నవ తెలంగాణ-బూర్గంపాడు

రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో దిశాయ్ ఇన్స్టిట్యూట్ సమన్వయంతో టీఎస్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కెరీర్ గైడెన్స్ కోసం ఆర్‌సి ఇన్‌భద్రా బృందం బుధవారం ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు టి. యస్ భాస్కర్ రావు, రోటరీ క్లబ్ కార్యదర్శి డా టి. విజయ్ కుమార్, యన్.సత్యనారాయణ, టీఎస్ గర్ల్స్ రెసిడె న్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి , సాయి రామ్, గిరీష్, ఖాదర్, బాషా, యం. శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, మురళి, దీలిప్, మహేష్ రెడ్డి , ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకుంట లో జాతీయ ఓటరు దినోత్సవం

నవతెలంగాణ - అశ్వారావుపేట

మండలం పరిధిలోని తిరుమలకుంట మండల పరిషత్ ఉన్నత పాఠశాల,రెడ్డిగూడెం పాఠశాలలో పి.ఎస్134 నందు జాతీయ ఓటర్లు దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వసంత,విఆర్‌పి రాము పాల్గొన్నారు.

రాజ్యాంగ రూపకల్పనలో మహిళలు

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పొడవైనది. గణతంత్ర దినోత్సవంగా జరుపుకునే 26 జనవరి 1950న ఇది చట్టబద్ధంగా అమలు చేయబడింది. రాజ్యాంగ అసెంబ్లీలోని 299 మంది సభ్యులలో 15 మంది మహిళలు ఉన్నారు. కాని వీరి గురించి అంతగా బయటి ప్రపంచానికి తెలియదు. వారిలో ప్రతి ఒక్కరు ఆనాడు ఒక్కో చరిత్ర సృష్టించిన వారు. బాల్య వివాహాలపై పోరాడి, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారిని ఉద్ధరించడానికి అవిశ్రాంతంగా కృషి చేశారు. స్వాతంత్ర్య సమరయోధులుగా, న్యాయవాదులుగా, సంస్కరణవాదులుగా, రాజకీయ నాయకులు తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ 15 మంది మహిళల జీవితాలను ఒకసారి చూద్దాం.





దాక్షాయణి వేలాయుధన్


34 ఏండ్ల వయసులో దాక్షాయణి అసెంబ్లీలో అతి పిన్న వయస్కురాలు. కొచ్చిన్‌లోని పులయ కమ్యూనిటీకి చెందిన ఆమె తన కమ్యూనిటీలో చదువుకున్న మొదటి తరం మహిళల్లో ఒకరు. 1945లో కొచ్చిన్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు నామినేట్ అయ్యారు. అసెంబ్లీ మొదటిసారి సమావేశమైన పది రోజుల తర్వాత దాక్షాయణి దాని ముందు నిలబడి తన మొదటి ప్రసంగం చేశారు.

అమ్ము స్వామినాథన్

ప్రారంభం నుండి బలమైన స్వరాన్ని వినిపించేవారు అమ్ము. తను 13 సంవత్సరాల వయసులో వివాహం చేసుకోవలసి వచ్చినప్పుడు కొన్ని షరతులు పెట్టారు. వీటిలో మద్రాసుకు వెళ్లి ఆంగ్ల విద్యను పొందడం లాంటివి కూడా ఉన్నాయి. 1914లో ఆమె రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. మూడేండ్ల తర్వాత 1917లో అన్నీ బిసెంట్, మార్గరెట్ కజిన్స్, మాలతీ పట్వర్ధన్, శ్రీమతి దాదాభోయ్, శ్రీమతి అంబుజమ్మాల్ వంటి ఇతర ప్రముఖులతో కలిసి ఉమెన్స్ ఇండియా అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. 1934లో మద్రాసు నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. అణచివేత, కుల వ్యవస్థ నిర్మూలన కోసం పని చేసిన ఒక దృఢమైన న్యాయవాది అమ్ము.

తహంసా జీవరాజ్ మెహతా

"పురుషులందరూ స్వేచ్ఛగా, సమానంగా జన్మించారు" అన్న దాన్ని "మానవులందరూ స్వేచ్ఛగా, సమానంగా జన్మించారు" అని సవరించబడింది. ఈ మార్పు చిన్నదే అయినప్పటికీ దాని ప్రభావం చాలా విస్తృతమైనది. అయితే దీని క్రెడిట్ పూర్తిగా హంసా జీవరాజ్ మెహతాకే దక్కుతుంది. 1897 జూలై 3న సంపన్నుల కుటుంబంలో జన్మించిన హంసా తండ్రి మనుభాయ్ నందశంకర్ మెహతా, అప్పటి బరోడా దివాన్. ఆమె చిన్నతనంలో ఇంగ్లాండ్ వెళ్లి భారతదేశానికి తిరిగి వచ్చే ముందు సోషియాలజీ, జర్నలిజం పూర్తి చేశారు. హంసా సహాయ నిరాకరణ, స్వదేశీ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆమె 1937లో బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ స్థానం నుండి మొదటి ప్రావిన్షియల్ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. కౌన్సిల్‌లో రెండు పర్యాయాలు (1937-39, 1840-49) పనిచేశారు. తదనంతరం రాజ్యాంగ సభలో చేరారు.



లీలా రాయ్

అక్టోబరు 1900లో అస్సాంలోని గోల్‌పరాలో జన్మించిన లీలా 1923లో ఢాకా విశ్వవిద్యాలయం నుండి ఎమ్మె పట్టా పొందిన మొదటి మహిళ. అదే సంవత్సరంలో ఆమె సామాజిక, రాజకీయాలను ప్రోత్సహించే, బోధించే మహిళల కోసం 'దీపాలి సంఘ'ను కూడా స్థాపించారు. విద్యకు గొప్ప మద్దతుదారు. ఆమె ఢాకాలో మహిళల కోసం రెండవ పాఠశాలను ఏర్పాటు చేశారు. మార్షల్ ఆర్ట్స్, వృత్తి శిక్షణకు ప్రాధాన్యతనిచ్చారు. ఈమె రచయిత్రి కూడా. 1931లో జయశ్రీని ప్రచురించడం ప్రారంభించారు. ఇది మహిళా రచయితలచే నిర్వహించబడిన మొదటి పత్రిక. లీలా 9 డిసెంబర్ 1946న బెంగాల్ నుండి రాజ్యాంగ పరిషత్ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. బెంగాల్ నుండి ఎన్నికైన ఏకైక మహిళా సభ్యురాలు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్

మొదట సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నప్పుడు దుర్గాబాయికి 12 ఏండ్లు. 1936లో ఆమె ఆంధ్ర మహిళా సభను స్థాపించారు. ఇది తర్వాత మద్రాసు నగరంలో గొప్ప విద్య, సామాజిక సంక్షేమ సంస్థగా మారింది. "నేను చట్టాన్ని అధ్యయనం చేయాలని నిర్ణయించుకున్నాను. తద్వారా మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందించి, తమను తాము రక్షించుకోవడానికి వారికి సహాయం చేయగలను" అని ఆమె తన ఆత్మకథలో రాసుకున్నారు. అందుకే జైలు శిక్ష తర్వాత ఆమె రాజకీయాల నుండి విద్యపై దృష్టి మళ్లించారు. దుర్గాబాయి న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా ఉన్నప్పుడు మద్రాసు బార్‌లో చేరారు. ఆమె 1946లో రాజ్యాంగ పరిషత్‌లోకి ప్రవేశించారు.

బేగం ఐజాజ్ రసూల్

రాజ్యాంగ పరిషత్‌లోని ఏకైక ముస్లిం మహిళా సభ్యురాలు ఐజాజ్ రసూల్. 1937లో తన మొదటి ఎన్నికల్లో రిజర్వ్‌డ్ కాని స్థానం నుండి గెలిచి ఉత్తరప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యురాలయ్యారు. అప్పుడే అధికారికంగా పర్దాను వదులుకున్నారు. రాజకీయ కుటుంబం నుండి వచ్చిన రసూల్ చిన్నతనంలోనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆమె తన తండ్రి జుల్ఫికర్ అలీ ఖాన్‌తో పాటు వివిధ సమావేశాలకు వెళ్లేవారు. కొన్నిసార్లు అతని కార్యదర్శిగా నోట్స్ కూడా తీసుకునేవారు. 1952 నుండి 1958 వరకు భారత జాతీయ కాంగ్రెస్‌కు రాజ్యసభ సభ్యురాలిగా సేవలందించారు. పదిహేనేళ్లకు పైగా భారత మహిళా హాకీ సమాఖ్య అధ్యక్షురాలిగా కూడా పనిచేశారు.

కమల చౌదరి

1930లో శాసనోల్లంఘన ఉద్యమంలో అత్యంత చురుకైన మహిళా సభ్యులలో ఒకరుగా పేరుగాంచిన మహిళ కమల. ఆ కాలంలో అనేకసార్లు జైలుకెళ్లారు. 1946లో మీరట్‌లో జరిగిన కాంగ్రెస్ 54వ సదస్సులో ఆమె ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1947 నుండి 1952 వరకు రాజ్యాంగ పరిషత్‌లో సభ్యురాలిగా కొనసాగారు. కమలా నిష్ణాతులైన రచయిత్రి, లింగ వివక్ష, దోపిడీపై విస్తృతంగా రాశారు.

సుచేతా కృపాలానీ

స్వాతంత్ర్య సమరయోధురాలు, రాజ్యాంగ పరిషత్ సభ్యురాలు, ముఖ్యమంత్రి, ప్రతిచోటా మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన సుచేతా కృప్లానీ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో చాలా కీలక పాత్ర పోషించారు. ఆమె 1940లో ఐఎన్‌సీలో మహిళా విభాగాన్ని స్థాపించడానికి బాధ్యత వహించారు. దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తన ప్రసిద్ధ "ట్రిస్ట్ విత్ డెస్టినీ" ప్రసంగం చేయడానికి ముందు వందేమాతరం, సారే జహాన్ సే అచా, జన గణ మన పాటలను పాడటానికి ఆమెపే ఆహ్వానించబడినప్పుడు ఆమె రాజకీయ జీవితంలో గర్వించదగిన క్షణాలలో ఒకటిగా చెప్పుకుంటారు.

మాలతీ చౌదరి

ఒడిశాకు చెందిన రాజ్యాంగ సభ సభ్యురాలు మాలతి సమాజంలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి అపారమైన కృషి చేశారు. 16 ఏండ్ల వయసులో ఆమె శాంతినికేతన్ చేరుకుంది. అక్కడ ఆమె విశ్వభారతి విశ్వవిద్యాలయంలో చదువుకుంది. తర్వాత ఒడిషా ముఖ్యమంత్రి అయ్యి 1927లో ఒడిషాకు మారిన నబక్రుష్ణ చౌధురిని వివాహం చేసుకుంది. సత్యాగ్రహ ఉద్యమంలో ఆమె, ఆమె భర్త కీలక పాత్ర పోషించారు. ఒడిశాలోని బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బాజీరౌత్ ఛత్రవాస్ వంటి అనేక సంస్థలను ఏర్పాటు చేసిన ఘనత కూడా ఆమెకు ఉంది.

పూర్ణిమా బెనర్జీ

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో భారత జాతీయ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా, 1930ల చివరలో, 1940లలో స్వాతంత్ర్య ఉద్యమంలో అగ్రగామిగా నిలిచిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహిళల నెట్‌వర్క్‌లో పూర్ణిమ ఒకరు. సామ్యవాద భావజాలం పట్ల తన నిబద్ధతను ప్రదర్శిస్తూ రాజ్యాంగ సభలో ఆమె చేసిన ఉద్వేగభరితమైన, ఆవేశపూరిత ప్రసంగం ఆమెకు తరచుగా గుర్తుకు వచ్చే వాటిలో ఒకటి. సత్యాగ్రహ, క్విట్ ఇండియా ఉద్యమ నిరసనల సమయంలో జైలు శిక్ష అనుభవించిన ఆమె జైలు నుండి తన బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ పూర్తి చేశారని నివేదికలు చెబుతున్నాయి.

సరోజినీ నాయుడు

"నైటింగేల్ ఆఫ్ ఇండియా" అని పిలువబడే సరోజినీ నాయుడు 1925లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేసిన మొదటి భారతీయ మహిళ. ఆమె భారత రాష్ట్ర గవర్నర్‌గా కూడా చేశారు. లండన్‌లోని కింగ్స్ కాలేజీ తర్వాత కేంబ్రిడ్జ్‌లో చదివిన ఆమె సహాయ నిరాకరణ ఉద్యమం వైపు ఆకర్షితురాలయారు. 1924లో ఆఫ్రికా అంతటా పర్యటించి అక్కడి భారతీయుల అభిరుచులను అర్థం చేసుకోవడంలో గడిపారు. 1914లో ఆమె రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్‌కి ఫెలోగా ఎన్నికయ్యారు. 1917లో భారతీయ స్త్రీల పరిస్థితిలో సంస్కరణల శ్రేణిని డిమాండ్ చేయడానికి మోంటాగు-చెమ్స్‌ఫోర్డ్ కమిటీని కలిసేందుకు మహిళా ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు.

రాజకుమారి అమృత్ కౌర్

1927లో ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్‌కు సహ వ్యవస్థాపకురాలిగా, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన మానవతావాది రాజకుమారి అమృత్. ఆమె ట్యూబర్‌క్యులోసిస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ లెప్రసీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ని ఏర్పాటు చేశారు. లీగ్ ఆఫ్ రెడ్‌క్రాస్ సొసైటీస్ గవర్నర్ల బోర్డు వైస్-ఛైర్‌గా, సెయింట్ జాన్స్ అంబులెన్స్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీకి అధ్యక్షురాలిగా కూడా ఉన్నారు. బాల్య వివాహాలు, పర్దా వ్యవస్థను నిర్మూలించడానికి కృషి చేశారు. ఈమె దేశానికి మొదటి మహిళా క్యాబినెట్ మంత్రి కూడా.

అన్నీ మస్కరేన్

అన్నీ రాజ్యాంగ పరిషత్‌లో ట్రావెన్‌కోర్, కొచ్చిన్ యూనియన్‌కు ప్రాతినిధ్యం వహించాయి. అసెంబ్లీలో చర్చల సందర్భంగా ఆమె ఫెడరలిజం గురించి చాలా ఉద్వేగంగా మాట్లాడారు. మొదటి లోక్‌సభకు స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయ్యారు. కేరళ నుంచి లోక్‌సభకు ఎన్నికైన తొలి మహిళగా రికార్డు సృష్టించారు.

విజయలక్ష్మి పండిట్

విజయలక్ష్మి పండిట్‌కి జవహర్‌లాల్ నెహ్రూ సోదరిగానే కాకుండా మంచి గుర్తింపు ఉంది. స్వాతంత్ర్య సమరయోధురాలు, క్విట్ ఇండియా ఉద్యమంతో సహా అనేక సందర్భాల్లో జైలుకెళ్లారు. దేశపు మొట్టమొదటి మహిళా క్యాబినెట్ మంత్రి, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీకి మొదటి ఆసియా అధ్యక్షురాలు

రేణుకా రే

రేణుకా రే భారతదేశ స్వాతంత్ర్యం, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. ఐసీఎస్ అధికారి, సామాజిక కార్యకర్త కుమార్తెగా రేణుకా రే లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుండి బీఏ పూర్తి చేసి భారతదేశానికి తిరిగి వచ్చి ఆల్ ఇండియా ఉమెన్ కాంగ్రెస్‌లో చేరారు. రాజ్యాంగం మహిళల సమానత్వాన్ని గుర్తించడంలో కీలకపాత్ర పోషించారు. 1943 నుండి 1946 వరకు చురుకైన రాజకీయ జీవితాన్ని గడిపారు.

- సలీమ

సర్కారు బడుల్లో జోష్

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం.. 2018-2022 మధ్యలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల నమోదు పెరిగింది. కోవిడ్ మహమ్మారి అనంతరం దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రయివేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను తీసుకున్న చిన్నారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2018లో ప్రభుత్వ స్కూళ్లలో చేరిన పిల్లల సంఖ్య 65.6 శాతంగా ఉండగా.. 2022లో అది 72.9 శాతానికి పెరిగింది. ఆరు నుంచి 14 ఏండ్ల మధ్య వయసున్న చిన్నారుల్లో 98.4 శాతం మంది ప్రస్తుతం ఒక రకమైన సరైన విద్యలో నమోదు చేయబడ్డారు.

మరోపక్క, అన్ని తరగతుల స్కూల్ చిన్నారుల పఠనాశక్తి 2012కు ముందు స్థాయి వరకు పడిపోయాయి. అలాగే కనీస గణిత నైపుణ్యాలు 2018 స్థాయిలకు పడిపోవటం గమనార్హం. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో బాల,బాలికల గైర్హాజరు కనిపించింది. రెండో తరగతి స్థాయి పాఠాలను చదవగలిగే మూడో తరగతి పిల్లల శాతం ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలో 2018లో 27.3 శాతం నుంచి 2022లో 20.5 శాతానికి పడిపోయింది. ఈ తగ్గుదల ప్రతి రాష్ట్రంలోనూ కనిపించింది. 2018లో పఠనా స్థాయి అధికంగా ఉన్న రాష్ట్రాలలో అదే ఏడాది నుంచి పది శాతం కంటే ఎక్కువ పాయింట్లు పడిపోయిన రాష్ట్రాల జాబితాలో హిమాచల్ ప్రదేశ్ (47.7 శాతం నుంచి 28.4 శాతం), హర్యానా (46.4 శాతం నుంచి 31.5 శాతం) లు ఉన్నాయి.

సేఫ్టీ ఆడిట్ నిర్వహించండి : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాల్లో భారీ, ఎత్తయిన భవనాలు, వ్యాపార, వాణిజ్య భవనాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, అపార్టుమెంట్లలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో మంత్రులు నిర్ణయించారు. సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన ముగ్గురి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందచేయాలని ఆదేశించారు. సికింద్రాబాద్‌లో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదం నేపథ్యంలో ఫైర్ సేఫ్టీ అనుమతులు లేని భవనాలపై చేపట్టాల్సిన చర్యలపై బీఆర్కే భవన్‌లో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కే తారకరామారావు, పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీకుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటి మేయర్ మోతే శ్రీలత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్ యువగళం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలతో సంఘీభావం ప్రకటించారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. టీడీపీ వర్ధిల్లాలి, ఎన్టీఆర్ అమర్ రహే, చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి, నారా లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలి, యువగళం ప్రతిధ్వనించాలి, సైకో పోవాలి - సైకిల్ రావాలి తదితర నినాదాలతో ఎన్టీఆర్ ఘాట్ పరిసరాలు మార్మోగాయి. పాదయాత్రకు బయలుదేరే ముందు తల్లిదండ్రులు నారా చంద్రబాబు నాయుడు, భువనేశ్వరికి లోకేష్ పాదాభివందనం చేశారు. అత్తమామలు నందమూరి బాలకృష్ణ, వసుంధర ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయన భార్య బ్రాహ్మణి తిలకం దిద్ది, హారతి ఇచ్చి పాదయాత్రకు సాగనంపారు. ఈ యాత్ర సందర్భంగా అన్ని వర్గాల ప్రజలతో మమేకం కావాలనీ, స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి మార్గాలను అన్వేషించాలని పలువురు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్ గౌడ్, పార్టీ సమన్వయకర్త కంభంపాటి రామమోహన్ రావు, నాయకులు టి. జ్యోత్స్న, కాట్రగడ్డ ప్రసూన, షకీలా రెడ్డి, పొగాకు జయరామ్ చందర్, పర్లపల్లి రవీందర్, పి. సాయిబాబా, బొల్లారపు శ్రీనివాస్, ఏపీ టీడీపీ నాయకులు ఎం.ఎ. షరీఫ్, బుద్ధా వెంకన్న, దామరచర్ల జనార్ధన్, కేశినేని చిన్ని, జి.వి. రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పొత్తూరు రామరాజు, మర్రి ప్రసాద్, సయ్యద్ మొసిన్, మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)


MUNICIPAL COUNCIL, JAGTIAL

చైర్‌పర్సన్ కన్నీరు పెట్టుకుంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. జగిత్యాల పట్టణంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రశ్నిస్తున్నామన్న కోపంతో ఎమ్మెల్యే అడుగడుగునా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "మీకు పిల్లలు ఉన్నారు.. వ్యాపారాలు ఉన్నాయి.. జాగ్రత్త" అంటూ బెదిరించడంతోపాటు డబ్బుల కోసం కూడా డిమాండ్ చేశారని ఆరోపించారు. డబ్బులు ఇచ్చుకునే పరిస్థితుల్లో తాము లేమని చెప్పినా వినిపించుకోకుండా అహంకారపూరితంగా వ్యవహరించారన్నారు. బీసీ బిడ్డ ఎదుగుతుందని ఓర్వలేక తనపై కక్షగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు అడ్డొస్తూ, తనకు చెప్పకుండా ఎలాంటి అభివృద్ధి పనులూ చేయొద్దని హుకుం జారీ చేస్తున్నారని చెప్పారు. తాను నరక ప్రాయంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిలో కొనసాగుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తన స్నేహితుడి పెట్రోల్ బంకు కోసం జంక్షన్ చిన్నగా చేసి కట్టారని, డివైడర్ ఎత్తు తగ్గించారని తాను అధికారులను అడిగితే "నీకు సంబంధం లేని విషయం" అంటూ వారి ముందే ఇష్టారీతిన ఎమ్మెల్యే అవమానించారని ఆమె వాపోయారు. మూడు ఏండ్లుగా నరకం అనుభవిస్తున్నానని, ప్రజాసేవలో నిమగ్నం అయిన తనను నిత్యం వేధింపులకు గురి చేయడమే పనిగా పెట్టుకున్నారని, చివరకు వార్డు సందర్శన కార్యక్రమం చేపట్టినా తప్పేనంటూ మాట్లాడారని ఆరోపించారు. ఆర్డీఓ కన్నా తక్కువ ప్రొటోకాల్ ఉండే మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిలో ఉండి జిల్లా స్థాయి అధికారులను ఎలా కలుస్తున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారని చెప్పారు. ఎమ్మెల్యే ఈ విధంగా వ్యవహరించడం సరికాదని, అవిశ్వాసం కూడా ఆయన ఆడిన డ్రామానేనని ఆమె ఆరోపించారు. సస్పెండ్ చేస్తానని కమిషనర్‌ను బెదిరించడంతోనే ఆయన లీవ్‌పై వెళ్లిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కనీసం తనకు మాట్లాడే స్వేచ్ఛ కూడా ఇవ్వలేదని, ఆయన ఇచ్చిన స్క్రిప్టే చదవాలని శాసించారన్నారు. మంత్రి కేటీఆర్‌ను, ఎమ్మెల్సీ కవితను కలవకూడదని ఒత్తిళ్లకు గురి చేశారన్నారు. సమావేశాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత పేర్లు ప్రస్తావించకూడదని హుకుం జారీ చేశారని ఆరోపించారు. తన రాజీనామా పత్రాన్ని కలెక్టర్‌కు ఇవ్వనున్నట్టు తెలిపారు. అయితే, ఈనెల 23న అధికార పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా సంతకాలు చేసి ఆ పత్రాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు అందజేశారు. కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమౌతున్న తరుణంలో ఆమె తన పదవికి రాజీనామా చేశారు.

రాష్ట్ర అర్థగణాంక శాఖ నివేదిక విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర అర్థగణాంక శాఖ నివేదికను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ ఆవిష్కరించారు. బుధవారం హైదరాబాద్‌లోని గణాంక భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారులు డాక్టర్ జి.ఆర్ రెడ్డి, అర్థగణాంక శాఖ డైరెక్టర్ జి దయానందం, రాష్ట్ర రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, టీఎస్ డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామకృష్ణ, కన్సల్టెంట్ రామభద్రం, స్టాటిస్టికల్ అదనపు డైరెక్టర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పురోగతి, జీడీపీ, అభివృద్ధి సంక్షేమ పథకాలు వివరాలను ఈ ప్రచురణలో సవివరంగా పేర్కొన్నారు.

నేడు కిసాన్ ట్రాక్టర్స్ మార్చ్

20 రాష్ట్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు

- హర్యానాలోని జింద్‌లో భారీ కిసాన్ మహాపంచాయత్‌కు సన్నాహాలు

న్యూఢిల్లీ : రైతుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు (గురువారం) దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ట్రాక్టర్స్ మార్చ్ నిర్వహించనున్నది. రైతులు జాతీయ జెండాను ఎగురవేసిన తరువాత ట్రాక్టర్ ర్యాలీలు, పాదయాత్రలు, సమావేశాలను నిర్వహించనున్నట్టు ఎస్కేఎం తెలిపింది. దేశవ్యాప్తంగా 300 జిల్లాలను కవర్ చేస్తూ 20 కంటే ఎక్కువ రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొంది. చారిత్రాత్మక రైతు పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులందరికీ నివాళులు అర్పిస్తామని తెలిపింది. జిల్లా కలెక్టర్లకు మెమోరాండం అందజేస్తామని పేర్కొంది. జనవరి 26న

హర్యానాలోని జింద్‌లో రైతుల భారీ కిసాన్ మహాపంచాయత్ జరగనున్నది. ఎస్కేఎం ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు 2021 జనవరి 26న బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రను ఎస్కేఎం బట్టబయలు చేస్తుంది. కిసాన్ ఐక్యత బలమైన ప్రదర్శనలో మహాపంచాయత్ సమావేశమై భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొంది. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్న ఫాసిస్ట్, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా మహాపంచాయత్ ఒక దృఢమైన సందేశాన్ని పంపుతుందనీ, అదే సమయంలో రైతుల సమస్యలను కూడా లేవనెత్తుతుందని ఎస్కేఎం తెలిపింది.

రైతు హంతకుడైన ఆశిష్ మిశ్రాకు బెయిలా..? ఎస్కేఎం దిగ్భ్రాంతి

లఖింపూర్ ఖేరీ వద్ద పట్టపగలు తన వాహనంతో నలుగురిని హతమార్చిన కేంద్రమంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాకు ఎనిమిది వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం పట్ల సంయుక్త కిసాన్ మోర్చా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది.

అయితే ఆశిష్ మిశ్రా విడుదలైన వారంలోపు యూపీ వదిలి వెళ్లాలనీ, ఢిల్లీ, యూపీల్లో ఉండకూడదని ఉత్తర్వు నిర్దేశించడం కొంత ఓదార్పునిస్తుందని పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఎస్కేఎం ప్రకటన విడుదల చేసింది. బీజేపీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించే రైతులను చంపేస్తానని మంత్రి బెదిరించడంతోపాటు... రైతులను హత్య చేయడం హింసాత్మక చర్య అని పేర్కొంది. మిశ్రా అధికార బీజేపీకి అనుబంధంగా ఉన్న శక్తివంతమైన రాజకీయ నాయకుడు, ఆయన విడుదల సాక్షులను బాగా భయపెడుతున్నదనీ, విచారణను ప్రమాదంలో పడేస్తుందని ఎస్కేఎం ఆందోళన వ్యక్తం చేసింది. బీజేపీ నేతృత్వంలోని యోగి ప్రభుత్వం ఆశిష్ మిశ్రాను అరెస్టు చేయడం, అభియోగాలు మోపడం పట్ల మృదువుగా వ్యవహరిస్తోందనీ, చివరికి సుప్రీంకోర్టు స్వతంత్ర దర్యాప్తు, చర్యకు ఆదేశించాల్సి వచ్చిందని గుర్తుంచుకోవాలని సూచించింది.

మిశ్రా న్యాయాన్ని ఎలా దారి మళ్లిస్తాడో, తప్పుదోవ పట్టిస్తాడో ఊహించవచ్చని పేర్కొంది. లఖింపూర్ ఖేరీ దోషులను త్వరగా శిక్షించాలని, అజయ్ మిశ్రా టేనిని కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని ఎస్కేఎం డిమాండ్ చేస్తునే ఉన్నదనీ, కాని ఈ రెండూ నెరవేరలేదని పేర్కొంది. సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ దానిని మరింత పొడిగించకూడదని కోరింది. ఆశిష్ మిశ్రా, ఆయన తండ్రి అజయ్ మిశ్రా సమాజానికి ముప్పు అని పేర్కొంది. లఖింపూర్ ఖేరీ ఘటనలో జైల్లో మగ్గుతున్న అమాయక రైతులకు శాశ్వత బెయిల్ మంజూరు చేయాలనీ, వారిపై పెట్టిన నకిలీ కేసులను ఉపసంహరించుకోవాలని ఎస్కేఎం డిమాండ్ చేసింది.

జేఎన్‌యూలో రణరంగం

(మొదటిపేజీ తరువాయి)

పదర్శనను అడ్డుకునేందుకు అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. వైఫై, విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. అయినా మన కార్యక్రమం ఆగిపోదు" అని చెప్పారు. "కార్యక్రమం జరగకుండా వర్సిటీ యాజమాన్యం అడ్డంకులు సృష్టించింది. విద్యుత్ సరఫరా నిలిపివేయటం పిరికిచర్య. అన్ని రకాల భావాలపై చర్చించే వేదికగా ఈ వర్సిటీకి పేరుంది. అయితే ఇప్పుడు వర్సిటీ యాజమాన్యం వ్యవహరించిన తీరు విద్యాసంస్థ ప్రతిష్టను దెబ్బతీసింది"అని ఒక విద్యార్థి అన్నారు.

చూడొద్దు..అంటూ నోటీసు

డాక్యుమెంటరీ చూడొద్దు, ప్రదర్శనలో పాల్గొనద్దు..అంటూ సోమవారం నాడు జేఎన్‌యూ యాజమాన్యం విద్యార్థులను బెదిరించింది. జేఎన్‌యూఎస్‌యూ ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అనుమతులు లేవని పేర్కొంది. ఇదిలా ఉండగా, మంగళవారం రాత్రి కమ్యూనిటీ సెంటర్ వద్ద జరిగిన రాళ్లదాడి, గాజుపెంకల దాడి..ఏబీవీపీ కార్యకర్తల పనేనని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆరోపించింది. దాడి ఘటనను తీవ్రంగా ఖండించింది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు రాజకీయాలకు వ్యతిరేకంగా విద్యార్థులంతా గళమెత్తుతారని, ప్రజాస్వామిక గొంతు వినిపిస్తారని ఒక ప్రకటనలో ఏఐఎస్ఏ తెలిపింది.

జామియా మిలియా

బుధవారం ఢిల్లీ జామియా మిలియా వర్సిటీలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన డాక్యుమెంటరీ ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. పదుల సంఖ్యలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం సాయంత్రం వర్సిటీ ప్రధాన గేటును మూసేసిన పోలీసులు, విద్యార్థులను లోపలికి అనుమతించలేదు. దీంతో గేటు వద్ద విద్యార్థులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. ఫతేపూర్ బేరిలోని క్యాంపస్‌కు 20 కి.మీ దూరంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థుల్ని పోలీసులు అరెస్టు చేయటం ఏంటని 'ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్' (ఏఐఎస్ఏ) ప్రశ్నించింది. అరెస్టయిన కార్యకర్తల మొబైల్ ఫోన్లను పోలీసులు లాక్కున్నారని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐఎస్ఏ ఒక ప్రకటన జారీచేసింది. అరెస్టు చేసిన విద్యార్థుల్ని పోలీసులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో బుధవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో డాక్యుమెంటరీ ప్రదర్శన చేపట్టగా, డాక్యుమెంటరీ ప్రసారమవుతుండగా...మధ్యలో పోలీసులు రంగంలోకి దిగి కార్యక్రమాన్ని నిలిపివేశారు.

పౌష్టికాహారంలో కామారెడ్డి వెనుకబాటు

(మొదటిపేజీ తరువాయి)

లోపంతో బాధపడుతున్నట్టు అధికారులు గుర్తించారు. 2021-22 లో 21,03,194 మంది చిన్నారులు అదనపు పౌష్టికాహారం కోసం నమోదు చేసుకోగా వారిలో 57.9 శాతం మంది అంటే 12,18,336 మందికి మాత్రమే పౌష్టికాహారం అందుతుండటం గమనార్హం. ఇందులోనూ 78.4 శాతంతో సిద్ధిపేట మొదటి స్థానంలో నిలవగా కేవలం 20.9 శాతం మందితో కామారెడ్డి చివరి స్థానంలోకి దిగజారింది. తల్లులకు అదనపు పౌష్టికాహారం అందించే కార్యక్రమానికి 4,82,242 మంది నమోదు చేసుకోగా 2,58,562 (53.6 శాతం) మందికి మాత్రమే అది అందుతున్నది. ఈ కేటగిరీలో 62.9 శాతంతో జగిత్యాల మొదటి స్థానంలో ఉండగా, 26.9 శాతంతో కామారెడ్డి చివరి స్థానంలో నిలిచింది. ప్రసవాల సమయంలో జరిగే మరణాలు 2019లో లక్షకు 56గా ఉండగా 2020 నాటికి 43కు తగ్గాయి. 2021-22 లో కేసీఆర్ కిట్లను 1,05,439 మందికి పంపిణీ చేయగా 2022-23లో ఆగస్టు నాటికే 97,448 మందికి అందజేశారు. 2021-22 లో 1,71,903 మంది ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి పొందారు.

వెయ్యి మంది మగ పిల్లలకు... 934 మంది ఆడ పిల్లలు

నవజాత శిశువు మొదలుకుని ఆరేండ్ల లోపు చిన్నారుల సంఖ్య రాష్ట్రంలో 38,99,166గా ఉంది. వీరిలో మగ శిశువులు 20,17,935 కాగా వారి కన్నా 1,36,704 మంది తక్కువగా ఆడ శిశువుల సంఖ్య 18,81,231కే పరిమితమైంది. అంటే ప్రతి 1,000 మంది మగ శిశువులకు గానూ 934 మంది ఆడ శిశువులే ఉన్నారన్న మాట. జిల్లాలవారీగా చూస్తే ములుగు జిల్లాలో ప్రతి 1,000 మంది మగ శిశువులకుగాను 971 మందితో కొంత మెరుగ్గా ఉండగా, వనపర్తి, మహబూబాబాద్ జిల్లాల్లో ఆ సంఖ్య 903కే పరిమితమైంది.

ఫైనల్‌కు బొప్పన్న-సానియా



- సెమీస్‌కు జకోవిచ్, టఫీ
- నేడు మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్

ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లోకి భారత జోడీ రోహన్ బొప్పన్న-సానియా మీర్జా ప్రవేశించారు. ఉత్కంఠభరితంగా బుధవారం జరిగిన తొలి సెమీస్‌లో భారత జోడీ 7-6(7-5), 6-7(5-7), 10-6తో 3వ సీడ్, సుప్రీస్(బ్రిటన్)-క్రాజిక్(అమెరికా)పై పోరాడి నెగ్గారు. మార్గరెట్ కోర్ట్ ఎరేనాలో జరిగిన ఈ మ్యాచ్ చివరి పాయింట్ వరకు పోటాపోటీగా సాగింది.

ఈ గెలుపుతో బొప్పన్న-సానియా మీర్జా జోడీ తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరి రికార్డు నెలకొల్పారు. తొలిసెట్‌ను టైబ్రేక్‌లో గెలిచినా.. రెండో సెట్‌ను టైబ్రేక్‌లోనే కోల్పోయింది. దీంతో మూడో గేమ్‌లో పాయింట్లను కేటాయించగా.. భారత జోడీ ఓ దశలో 5-1పాయింట్ల ఆధిక్యతలో నిలిచింది. ఓ దశలో 8-6పాయింట్లతో చేరువైనా.. చివరి 10-6తో ముగించి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు. బొప్పన్న 2017లో కెనడాకు చెందిన గాబ్రియేలాతో కలిసి ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను గెలిచాడు. 2018లో ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ రన్నరప్ కూడాను. ఇక సానియా మీర్జా మహిళల డబుల్స్‌లో ఫ్రెంచ్ ఓపెన్ మినహా అన్ని గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గింది. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో గత ఏడాది వింబుల్డన్ సెమీస్‌కు చేరగల్గింది. సానియా చివరి సారిగా 2016లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను మహిళల డబుల్స్‌లో చేజిక్కించుకుంది. మరో సెమీస్‌లో బ్రెజిల్ స్టెఫానీ-మటోస్ జోడీ 4-6, 6-4(11-9)తో ఆస్ట్రేలియా జోడీ గడెక్కీ-పోల్మన్స్‌పై గెలిచారు. శనివారం జరిగే టైటిల్ పోరులో భారతజోడీ బ్రెజిల్ జంటతో తలపడనున్నారు.

సెమీస్‌కు జకో, టఫీ

పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి 4వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ ప్రవేశించాడు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో జకోవిచ్ 6-1, 6-2, 6-4తో 5వ సీడ్ ఆండీ రుబ్లేవ్(రష్యా)పై వరుససెట్లలో గెలిచాడు. మరో సెమీస్‌లో టామీ పాల్(అమెరికా) 7-6(8-6), 6-3, 5-7, 6-4తో సహచర ఆటగాడు షెల్టన్‌పై గెలుపొందాడు. ఇక మహిళల సింగిల్స్ సెమీస్‌కు లినెట్టె(పోలండ్), సబలెంక(రష్యా) ప్రవేశించారు. క్వార్టర్స్‌లో 5వ సీడ్ సబలెంకా(రష్యా) 6-3, 6-2తో క్రొయేషియాకు చెందిన వేకిక్‌పై, లినెట్టె 6-3, 7-5తో 30వ సీడ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన ప్లిస్కోవాపై గెలిచి సెమీస్‌కు చేరారు.

పీఎంపై బీబీసీ దాయడానికే
ఎమర్జెన్సీ అధికారాలు

- ట్విట్టర్, యూట్యూబ్ లకు ఎంఐబీ ఆదేశాలు

న్యూఢిల్లీ : గుజరాత్ అల్లర్లలో మోడీపాత్రపై బీబీసీ విడుదల చేసిన డాక్యుమెంటరీని కట్టడి చేయడానికి కేంద్రం తన అధికారాలను విస్తృతంగా వినియోగిస్తున్నది. ఈ డాక్యుమెంటరీలోని విషయాలు ప్రజలకు చేరకుండా దానిని దాచేందుకు చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా వివాదాస్పద సమాచార సాంకేతిక నిబంధనలు - 2021 (ఐటీ రూల్స్) లోని ఎమర్జెన్సీ అధికారాలను ఉపయోగిస్తూ ట్విట్టర్, యూట్యూబ్‌లకు ఆదేశాలు జారీ చేసింది. డాక్యుమెంటరీకి సంబంధించిన లింకులను తొలగించాలని కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ (ఎంఐబీ) సదరు సామాజిక మాధ్యమాలను ఆదేశించింది.

"ఇండియా : ద మోడీ క్వశ్చన్"

పేరుతో బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ మొదటి భాగాన్ని బీబీసీ ఇటీవల భారత్ మినహా ఇతర దేశాల్లో విడుదల చేసిన విషయం విదితమే. భారత్‌లో బీబీసీ ఈ డాక్యుమెంటరీని ప్రసారం చేయకున్నా.. కొందరు దీనిని యూట్యూబ్‌లో షేర్ చేశారు. ట్విట్టర్‌లోనూ ఈ డాక్యుమెంటరీ లింకులను షేర్ చేశారు. దీంతో ఈ వీడియో వ్యాప్తిని అడ్డుకోవడానికి మోడీ సర్కారు చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగానే డాక్యుమెంటరీకి సంబంధించిన ఈ లింకులను తొలగించాలనీ, భవిష్యత్తు లోనూ ఈ వీడియో అప్‌లోడ్ కాకుండా బ్లాక్ చేయాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర ఆదేశాలు జారీ చేశారు. ఐటీ నిబంధనల్లోని ఎమర్జెన్సీ అధికారాలను వినియోగించి ట్విట్టర్‌కు నిషేధాజ్ఞలు జారీ చేసినట్టు ఎంఐబీ సీనియర్ సలహాదారు ఒకరు ధ్రువీకరించడం గమనార్హం. ఈ చట్టంలోని సెక్షన్ 69ఏ కింద మంత్రిత్వ శాఖ ఆదేశాలు ఉల్లంఘించినట్టయితే భారీ జరిమానాతో పాటు ఏడేండ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. దీంతో కేంద్రం ఆదేశాలను ట్విట్టర్, యూట్యూబ్ లకు చెందిన అధికారులు పాటించారు. అయితే, కేంద్రం ఆదేశాలకు సంబంధించిన అధికారిక కాపీ లేదా పత్రికా ప్రకటనా ఎంఐబీ నుంచీ కానీ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో నుంచి ఇప్పటికీ విడుదల కాలేదు.

ఈనెల 17న బీబీసీ డాక్యుమెంటరీ " ఇండియా : ద మోడీ క్వశ్చన్"

రెండు భాగాల్లో ఒక భాగం యూకేలో ప్రసారమైంది. తొలి ఎపిసోడ్‌లో మోడీ తొలినాళ్లలో రాజకీయ జీవితాన్ని ప్రస్తావించారు. ముఖ్యంగా, 2002 లో ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అల్లర్లలో రెండు వేల మంది మరణించడంపై ప్రశ్నలను తొలి ఎపిసోడ్ లేవనెత్తింది. బ్రిటీషులోని అంతర్గత నివేదికల ఆధారంగా దీనిని రూపొందించినట్టు బీబీసీ వెల్లడించింది. 2002లో హింసాత్మక పరిస్థితులు తలెత్తడానికి నేరుగా మోడీనే బాధ్యుడని బ్రిటీషు విదేశీ కార్యాలయ నివేదిక పేర్కొన్నది. బ్రిటీషు విదేశీ మంత్రిత్వ శాఖకు నివేదికను అందజేసిన బ్రిటీషు దౌత్యవేత్త కూడా తన నివేదికకు కట్టుబడినట్టు వెల్లడించడం గమనార్హం.

అనంతరం డాక్యుమెంటరీ వీడియో ఒక ప్రయివేటు ఖాతా ద్వారా యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయబడింది. ఈ యూట్యూబ్ లింక్ విస్తృతంగా వ్యాప్తి చెందింది. అయితే, జనవరి 19 మధ్యాహ్నం కాపీరైట్ ఉల్లంఘన కింద వీడియోను తొలగించే వరకు ఈ లింక్ వ్యాప్తి జరిగింది. ప్రస్తుతం 'ఈ వీడియో తొలగించబడిందని' యూట్యూబ్‌లో కనబడటం గమనార్హం.



జర్మనీ సంచలనం

- చివరి రెండు నిమిషాల్లో రెండు గోల్స్ కొట్టి ఇంగ్లండ్‌పై గెలుపు
- కొరియాపై నెదర్లాండ్స్ గెలుపు
- హాకీ ప్రపంచకప్

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్ సెమీఫైల్లోకి నెదర్లాండ్స్, జర్మనీ జట్లు ప్రవేశించాయి. బుధవారం జరిగిన తొలి క్వార్టర్‌ఫైనల్లో జర్మనీ జట్టు పెనాల్టీలలో 4-3గోల్స్ తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించగా.. చివరి క్వార్టర్‌ఫైనల్లో నెదర్లాండ్స్ జట్టు 5-1గోల్స్ తేడాతో దక్షిణ కొరియాపై విజయం సాధించింది. జర్మనీ జట్టు మ్యాచ్ ముగియడానికి 2నిమిషాల ముందు వరకు 0-2గోల్స్‌తో వెనుకబడ్డా.. ఆ తర్వాత 58, 59వ ని.లో ఒక్కో గోల్స్ కొట్టడంతో ఇంగ్లండ్ జట్టు షాక్‌కు గురైంది. దీంతో నిర్ణీత సమయం పూర్తయ్యే సరికి ఇరుజట్లు 2-2గోల్స్‌తో సమంగా నిలిచాయి. ఇంగ్లండ్ జట్టు తరఫున వల్లెస్(12వ ని.), అన్‌సెల్(33వ ని.) ఒక్కో గోల్ కొట్టగా.. జర్మనీ తరఫున ఎం.గ్రాంబష్(58వ ని.), టి.గ్రాంబష్(59వ ని.) ఒక్కో గోల్ కొట్టారు. పెనాల్టీల్లో జర్మనీ వరుసగా నాలుగు గోల్స్ కొడితే.. ఇంగ్లండ్ తరఫున ఇద్దరు గోల్స్ చేయడంలో విఫలమయ్యారు. దీంతో జర్మనీ ఆటగాళ్లు సంబరాల్లో మునిగారు.

క్రికెట్‌లోకి అదానీ గ్రూప్స్

రూ.1,289కోట్ల అత్యధిక బిడ్‌తో అహ్మదాబాద్ జట్టు కొనుగోలు
మహిళల ఐపీఎల్ ఐదు ఫ్రాంచైజీల ద్వారా బిసిసిఐకి రూ.4670కోట్ల రాబడి



ముంబయి: 'మహిళల ప్రీమియర్ లీగ్'(డబ్ల్యుపిఎల్) ద్వారా బిసిసిఐకి కాసుల వర్షం కురిసింది. ఈ లీగ్‌లో ఐదు జట్ల కోసం బుధవారం నిర్వహించిన వేలంలో బిసిసిఐకి సుమారు రూ.4,670కోట్లు రానుంది. ఈ విషయాన్ని బిసిసిఐ కార్యదర్శి జై షా ప్రకటించారు. అంటే 2008లో ప్రారంభమైన పురుషుల ఐపిఎల్ కంటే ఇది అధికం. పురుషుల ఐపిఎల్ బిడ్డింగ్ ద్వారా పొందిన దాని కంటే ఈ మొత్తం ఎక్కువ అని జై షా పేర్కొన్నారు. రూ.1,289కోట్ల అత్యధిక బిడ్‌తో ఆదానీ గ్రూప్ అహ్మదాబాద్ జట్టును కైవసం చేసుకుంది. ఆ తర్వాత రిలయన్స్ గ్రూప్స్ ముంబయిని, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును బిడ్‌లో దక్కించుకున్నట్లు ఆర్సీబీ ఛైర్మన్ ప్రత్మేశ్ మిశ్రా ఓ ప్రకటనలో తెలిపారు.

ఫ్రాంచైజీల వివరాలు..

1. అహ్మదాబాద్	: అదానీ స్పోర్ట్స్‌లైన్స్	రూ.1,289కోట్లు
2. ముంబయి	: ఇండియావిన్ స్పోర్ట్స్ ప్రై.లి.	రూ.913కోట్లు
3. బెంగళూరు	: రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్	రూ.901కోట్లు
4. ఢిల్లీ	: జెఎస్‌డబ్ల్యు జిఎంఆర్	రూ.810కోట్లు
5. లక్నో	: కాప్రీ గ్లోబల్ హోల్డింగ్స్	రూ.757కోట్లు

అభివృద్ధి కోసం అప్పలు చేయడమేంటి? చావడమేంటి?

- రాష్ట్రంలో సర్పంచ్‌ల పరిస్థితి దారుణం
- 18 మంది ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరం
- సీపీఐ(ఎం) సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ధనిక రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు అప్పులు చేయడమేంటో? వాటిని తీర్చలేక ఆత్మహత్యలు చేసుకోవడమేంటో అర్థం కావడం లేదని సీపీఐ(ఎం) సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని లక్డికాపూల్‌లో పంచాయతీరాజ్ చట్ట సవరణపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ఎవ్వరినీ సంప్రదించకుండా నూతన పంచాయతీరాజ్ చట్టం తీసుకొచ్చిందని విమర్శించారు. అఖిల పక్షం తరఫున ఎంతో మంది సీఎంల దగ్గరకు వెళ్లి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లాలనీ, ఈ సీఎం(కేసీఆర్) దగ్గరకు ఒక్కసారి కూడా వెళ్లలేకపోయానని చెప్పారు. ఆ చట్టంతో పంచాయతీరాజ్ వ్యవస్థను కేసీఆర్ తన చెప్పుచేతుల్లోకి తీసుకున్నారని విమర్శించారు. సర్పంచుల సమస్యలపై సెమినార్లు, సదస్సులు మరిన్ని పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా 18 మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, వారందరి కుటుంబాలతో మీటింగ్ పెడితే బాగుంటుందని సూచించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమర్థుడే అయినప్పటికీ అంతా కేసీఆర్ చేతుల్లో ఉండటంతో ఆయన ఏమీ చేయలేకపోతున్నాడన్నారు. టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ..సర్పంచ్‌లు ఏం చేయాలో ఎమ్మెల్యేలు నిర్ణయించడం దారుణమన్నారు. అసలు వారిపై ప్రభుత్వ పెత్తనమేంటని ప్రశ్నించారు. సర్పంచుల పదవీకాలం ఏడాదే ఉందనీ, పోరాడితే పోయేదేం లేదన్న భావనతో వారంతా రోడ్ల మీదకొచ్చి ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే అన్ని పార్టీలతో చర్చించి బలమైన పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. బీజేపీ నేతలు, మాజీ ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచులందరూ మూకుమ్మడిగా రాజీనామా చేస్తే ప్రభుత్వం చచ్చినట్టు దిగొస్తుందన్నారు. సర్పంచుల నిధులను కేసీఆర్ పక్కదోవపట్టిస్తున్నారని ఆరోపించారు. చేసిన పనులకు కూడా బిల్లులివ్వకుండా సర్పంచులను వేధించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు చింపుల సత్యనారాయణరెడ్డి, వైఎస్ఆర్‌టీపీ నేత గట్టు రామచందర్‌రావు, ఆప్‌నేత సుధాకర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు విమలక్క, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

సీట్ ఎడ్జ్ థ్రిల్లర్


మోహన్‌బాబు, లక్ష్మీప్రసన్న, సముద్రఖని

లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై డా.మంచు మోహన్ బాబు, మంచు లక్ష్మి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'అగ్ని నక్షత్రం'. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. మోహన్ బాబు, లక్ష్మీప్రసన్న తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్న ఈ చిత్రంలో విలక్షణ నటుడు సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. మలయాళంలో ఎన్నో విభిన్న పాత్రలు పోషించిన మలయాళ నటుడు సిద్దిక్, యువ హీరో విశ్వంత్, చైత్ర శుక్లతో పాటు భారీ తారాగణం ఇందులో కీలక పాత్రలు పోషించారు.

శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమా ఒక సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ అని, ఆసక్తికర ఫైట్స్‌తో ఆకట్టుకుంటుందని డైరెక్టర్ వంశీ కృష్ణ తెలిపారు. ఈ చిత్రానికి అచ్చు రాజామణి సంగీతం అందిస్తున్నారు. గోకుల్ భారతి కెమెరామెన్‌గా, మధు రెడ్డి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

మెప్పించే సిందూరం

శివ బాలాజీ, ధర్మ, బ్రిగిడా సాగ ప్రధాన తారాగణంగా శ్యామ్ తుమ్మలపల్లి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సిందూరం'. రిపబ్లిక్ డే సందర్భంగా నేడు (గురువారం) ఈ సినిమా థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది.

ఈ సందర్భంగా దర్శకుడు శ్యామ్ తుమ్మలపల్లి మాట్లాడుతూ, 'ఈ సినిమా అందర్నీ అలరిస్తుందని ఆశిస్తున్నాను. నక్సల్స్ పాయింట్‌తో ఉద్యమం నేపథ్యంలో చాలా సినిమాలు వచ్చాయి. హిస్టరీలో జరిగిన కొన్ని రియాలిటీ సన్నివేశాలను ఈ సినిమాలో చూపించాం. ఉద్యమ నేపథ్యం, రాజకీయం, ప్రేమకథ ఇందులో ఉంటాయి. మొత్తంగా ఇది నక్సల్ ఇన్ఫార్మర్ కథగా ప్రేక్షకుల ముందుకు రానుంది' అని తెలిపారు.

'ఈ సినిమాలో నటించిన అందరికి మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను. మంచి సినిమా తీశామనే సంతృప్తి ఉంది. శ్రీ లక్ష్మీ నరసింహ మూవీ మేకర్స్ బ్యానర్ పై వస్తోన్న ఈ సినిమా అందరికి నచ్చే సినిమా అవుతుంది' అని నిర్మాత ప్రవీణ్ రెడ్డి జంగా చెప్పారు. శివ బాలాజీ మాట్లాడుతూ,'డైరెక్టర్ ఈ సినిమా కథ చెప్పినప్పుడు బాగా నచ్చింది.

నవచిత్రం

సైంధవ్‌గా వెంకటేష్

అగ్ర కథానాయకుడు వెంకటేష్ తన ల్యాండ్‌మార్క్ 75వ చిత్రం కోసం 'హిట్' సిరీస్‌తో విజయాల్ని అందించిన డైరెక్టర్ శైలేశ్ కొలనుతో చేతులు కలిపారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ పై వెంకట్ బోయనపల్లి ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మేకర్స్ బుధవారం టైటిల్ పోస్టర్, గ్లింప్స్ ద్వారా ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి 'సైంధవ్' అనే పవర్ ఫుల్ టైటిల్ ఖరారు చేశారు. వెంకటేష్ పవర్ ఫుల్ లుక్‌లో చేతిలో తుపాకీ పట్టుకుని టెర్రిఫిక్‌గా కనిపించారు. బ్యాక్‌గ్రౌండ్‌లో ఒక కారు, పేలుడును కనిపిస్తోంది. టైటిల్ పోస్టర్ 'సైంధవ్'లో యాక్షన్ ఎక్కువగా ఉంటుందని, వెంకటేష్ ఇంటెన్స్ పాత్రలో నటిస్తున్నారని చెప్పకనే చెబుతోంది.

వెంకటేష్ ఒక మెడిసన్ వయాల్ ఉన్న కూల్ బాక్స్‌తో చంద్రప్రస్థ అనే ఓడరేవు ప్రాంతంలోకి ఎంటరై, అక్కడ కంటైనర్ నుంచి తుపాకీని బయటకు తీస్తాడు. చివరగా గూండాల గ్యాంగ్‌ని ఉద్దేశించి.. 'నేనిక్కడే ఉంటాన్రా... ఎక్కడికి వెళ్లను... రమ్మను...' అంటూ హెచ్చరించడం గ్లింప్స్‌లో ప్రజెంట్ చేశారు.

గ్లింప్స్ సినిమా స్వభావం, దాని టోన్, ఇందులో వెంకటేష్ ఎలాంటి పాత్ర చేయబోతున్నారో చూపించింది. త్వరలోనే షూటింగ్‌ని ప్రారంభిస్తామని కూడా మేకర్స్ ప్రకటించారు. గ్లింప్స్ వీడియోకి అద్భుతమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించిన సంతోష్ నారాయణన్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. ఈ సినిమా నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ నుండి ప్రొడక్షన్ నెం 2.గా రానుంది. 'శ్యామ్ సింగరాయ్'తో నిర్మాణంలో విజయవంతంగా అడుగుపెట్టింది. అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే భారీ స్థాయిలో ఈ చిత్రం రూపొందుతుంది. ఇది వెంకటేష్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా ఉండనుందని మేకర్స్ తెలిపారు.

ప్రముఖ నటీనటులు, అత్యున్నత సాంకేతిక నిపుణులు ఈ చిత్రం కోసం పని చేస్తున్నారు. ఎస్ మణికందన్ కెమెరామెన్‌గా, గ్యారీ బిహెచ్ ఎడిటర్‌గా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్న ఈ చిత్రానికి కిషోర్ తాళ్లూరు సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

హిమ వనంలో అగ్ని వర్షం..



సమంత నటించిన లేటెస్ట్ పాన్ ఇండియా చిత్రం 'శాకుంతలం'. ఫిబ్రవరి 17న ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలవుతున్న సంగతి తెలిసిందే.

కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం ఆధారంగా దర్శకుడు గుణశేఖర్ రూపొందించిన పౌరాణిక ప్రేమ కావ్యం ఇది. ప్రతి ఫ్రేమ్‌ను అత్యద్భుతంగా తెరకెక్కించే గుణ శేఖర్ మరోసారి 'శాకుంతలం' వంటి విజువల్ వండర్‌తో పాన్ ఇండియా ప్రేక్షకులను మెస్మరైజ్ చేయటానికి సిద్ధమవుతున్నారు.

ఈ మూవీ ప్రమోషన్స్ భారీ స్థాయిలో సాగుతున్నాయి. అందులో భాగంగా విడుదలైన మూవీ ట్రైలర్, 'మల్లికా మల్లికా..' సాంగ్ సోషల్ మీడియాలో సెన్సేషన్‌ను క్రియేట్ చేశాయి. ఈ నేపథ్యంలో బుధవారం చిత్ర యూనిట్ ఈ సినిమా నుంచి 'ఋషి వనంలోన...' పాటను విడుదల చేశారు. మణిశర్మ ఈ చిత్రానికి సంగీతం అందించటంతో మరోసారి ఆయన తనదైన శైలిలో అందమై బాణీలను పలికించారు. దుష్యంతుడు, శకుంతల మధ్య ఉండే ప్రేమను తెలియజేసే ఈ పాట అందరి హృదయాలను ఆకట్టుకుంటోంది. ఈ పాటలో కనిపించే ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్, విజువల్స్ ప్రేక్షకులను మైమరిపింప చేస్తున్నాయి. ఈ ఇన్‌టెన్స్ క్యాచీ సాంగ్‌ను సిద్ శ్రీరామ్, చిన్మయి ఎంతో శ్రావ్యంగా ఆలపించారు. శ్రీమణి పాటను రాశారు. దేవ్ మోహన్, సమంత మధ్య ఉండే కెమిస్ట్రీ ఓ మ్యాజిక్‌ను క్రియేట్ చేసింది. శ్రీ వెంకటేశ్వరక క్రియేషన్స్ దిల్ రాజు సమర్పణలో గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నీలిమ గుణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

దేశం కోసం చేసిన సినిమా : పరుచూరి గోపాలకృష్ణ

దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమర యోధుల జీవిత చరిత్రను ఆధారంగా చేసుకుని ఇప్పటి వరకు తెలుగు సినీ చరిత్రలో ఎవరూ చేయనటువంటి గొప్ప దేశభక్తి చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'.

గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' లాంటి చిత్రాలను నిర్మించిన నాగలక్ష్మి ప్రొడక్షన్స్ అధినేత రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని నిర్మించారు.

రవీంద్రజి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తూ.. ఈ చిత్రాన్ని తెరకెక్కిం చారు. రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రలలో నటించగా సూర్య, జీవా, ప్రసాద్ బాబు, అశోక్ కుమార్, సుధ నటించారు. ఈ చిత్రంలోని పాటలను ఇటీవల ఫిలించాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రచయిత పరుచూరి గోపాలకృష్ణ, నిర్మాత దామోదర్ ప్రసాద్, ప్రసన్న కుమార్, మోహన్ వడ్లపట్ల, బాబ్జీ, ప్రమోద్ శర్మ, బల్లెపల్లి మోహన్, ఘంటాడి కృష్ణ, దర్శకుడు, నటుడు, నిర్మాత రవీంద్ర గోపాల తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886